వెంకటరామయ్య, తుమ్మల

పాలస్టయిన్

బెజవాడ, 1939

Record no. 64

Veṅkaṭarāmayya, Tummala

Pālasṭayin

Bejavāḍa, 1939

Record no. 64

Bibliographic Record Target

వెంకటరామయ్య, తుమ్మల.
పాలస్టయిన్ / తుమ్మల వెంకటరామయ్య. - బెజవాడ : నవశక్తి కార్యాలయం, 1939.
103 p. (7) leaves of plates. :ill. ;16 cm.
Record no. 64

Veṅkaṭarāmayya, Tummala.
Pālasṭayin / Tummala Veṅkaṭarāmayya. - Bejavāḍa : Navaśakti Kāryālayaṃ, 1939.
103 p. (7) leaves of plates. :ill. ;16 cm.
Record no. 64

నాల్గిణాలు


1939

పాలస్టయిన్

తుమ్మల వెంకటరామయ్య

నవశక్తి కార్యాలయం
బెజవాడ





గ్రాండ్ ముఫ్టీ
అరబ్బు విప్లవ నాయకుడు.

అబ్దుల్ రజాక్
అరబ్బు గొరిల్లా సైనిక నాయకుడు.



ప్రవిత్ర భూమి యని పిలుపబడుతూ వచ్చింది పాలస్టయిన్. నేడు పాలస్టయిన్‌లో జీసస్, మోజెస్, మొహమ్మద్ అనుచరు లున్నారు. క్రైస్తవ మతం, జుడాయిజమ్, ఇస్లాం మతా లున్నాయి. జెరూసలంలో, యూదులకు, 'శోకకుడ్యం' (**Wailing Wall**) ; క్రైస్తవులకు, పవిత్ర సమాధి (**Sepulchre**) ; మహమ్మదీయులకు, ఓమర్ సమాధి : ఉన్నాయి. ఇవన్నీ పవిత్ర స్థలాలే. ఓమర్ మసీదుకు సమీపంగానే 'శోకకుడ్యం' ఉంది. ఇది మూడు వేల యేండ్ల క్రిందటి 'ఇస్రాయెల్' సార్వభౌముని దేవాలయ శిధిలత. ఇది యూదులకు పవిత్ర స్థలం. వారంలో మూడు రోజులు ఆ గోడవద్దకు ప్రపంచ మందలి అన్ని ప్రాంతాల యూదులు వచ్చి ఏడుస్తారు. జెరూసలం పతన మయినందులకు, దేవాలయం శిధిల మయినందులకు విలపించుతారు. అందుకనే దీనికి 'శోకకుడ్యం' అనే పేరు కల్గింది. ఇది ఓమర్ సమాధికి ప్రక్కగా ఉండటం వల్ల మత కల హాలకు కారణ మయింది. ఈ మత కలహాల వెనుక రాజకీయ కారణాలు

లేకపోలేదు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల రాజనీతి లేకపోలేదు. అందుచేతనే రాముడు, బుద్ధుడు కన్ఫూషియస్, జొరాస్టర్‌లు జన్మించిన పవిత్ర భూములు మనం మరచిపోయాం. కారణం? అవి రాజకీయంగా, ఆర్థికంగా అంత ఉపయోగకరాలు కావు కాబట్టి. కాని నేడీ పవిత్ర భూమి ఎందుకు కలవరపెట్టుతున్నది? నేటి బ్రిటిష్ సామ్రాజ్యవాదులకే గాదు—ఎందరికో—ప్రాముఖ్య రాజకీయ స్థలం ఇది. అందుచేతనే ఈ మతాలకు, కలహాలకు, ఇంత ప్రాముఖ్యత ఈయబడింది! "ప్రపంచ స్వాతంత్ర్యోద్యమానికి ఇస్లాం నాటి పవిత్ర భూమి యగు పాలస్టయిన్‌తో సంబంధం లేదు. కాని వలస రాజ్య ప్రజలకు పాలస్టయిన్ స్వాతంత్ర్య వీర పోరాటంలో అభిరుచి ఉంట. ఎందుకంటే ఇది ఇస్లాం నాటి పవిత్ర భూమి కాదు. బ్రిటిష్ సామ్రాజ్యంలోని పవిత్ర భూమి." *

పాలస్టయిన్‌లో ప్రారంభింపబడిన స్వాతంత్ర్యోద్యమాన్ని గురించి చెప్పే ముందు, పాలస్టయిన్ ప్రాముఖ్యత చెప్పాలి.

పాలస్టయిన్ ప్రాముఖ్యత.

పాలస్టయిన్ ప్రజా ఉద్యమాన్ని ఇంత తీవ్రంగా—ఇంత నిరంకుశంగా—ఇంత అమానుషంగా—బ్రిటిషువా రెందుకు అణచుతున్నారు? పాలస్టయిన్ బ్రిటిష్ సామ్రాజ్యానికి ఆయువుపట్టు. పాలస్టయిన్ స్వాతంత్ర్యము సంపాదించుకొంటే, బ్రిటన్‌కు కాల మాసన్నమైన దన్నమాట!

ప్రపంచ మహాయుద్ధానంతరమే పాలస్టయిన్ ప్రాముఖ్యత మరింత హెచ్చింది. దేశం ఏమంత పెద్దది కాదు. మన దేశంలో ఏదో ఒక

* ఆలిండియా కాంగ్రెస్ కమిటీ విదేశ శాఖ ప్రచురణ (22—9—37.)

జిల్లాలోకన్న ఎక్కువ ప్రజ లుండరు. అయినా పాలస్టయిన్ గురించి ఏ రాజకీయ విద్యార్థిని కదలించినా—సంపుటాలకొలది—చరిత్ర వ్రాయగలడు. రాజకీయంగా (స్ట్రాటజిక్) అంత ప్రాముఖ్య స్థలం ఇది.

పురాతనకాలంనుండి మత ప్రాముఖ్యతయే గాదు—రాజకీయ ప్రాముఖ్యత కూడా కల్గి ఉంది పాలస్టయిన్. ఈజిప్టు, బేబిలోన్, అస్సీరియా సామ్రాజ్య యుద్ధాలకు కేంద్రం ఇది. ఇక్కడే ప్రాచ్య రోమన్ సామ్రాజ్యాన్ని, ఇస్లాం నవయుగ శక్తులు పెద్ద దెబ్బ కొట్టినాయి. యూరప్‌లోని ఫ్యూడల్(భూస్వామిక)ప్రభులంతా క్రూసేడ్స్(మతయుద్ధాలు)అనే బురఖాతో టర్కిష్ సామ్రాజ్యాన్ని తుదముట్టించ ప్రయత్నించారు. ఇక-ఈనాడు—పాలస్టయిన్ లేనిచో బ్రిటిషు సామ్రాజ్యమేలేదు. మధ్యధరా సముద్రంమీదా, మధ్య సముద్ర సమీప ప్రాచ్య దేశాలపైనా, హిందూ దేశపు రాకపోకల పైనా, బ్రిటిషువారి పెత్తనం సడలకుండా బిగించే ప్రయత్నమే పాలస్టయిన్ స్వాతంత్ర్యోద్యమాన్ని అణచడం. సూయజ్ కెనాల్‌ను, ఈజిప్టును రక్షించుకొనేందుకు అవసరమైన సైన్యాలు పంపాలంటే ఒక మిలటరీ స్థానం కావాలి. అది పాలస్టయిన్! అలాగే ఒక విమాన కేంద్రం!! అలాగే మరొక నౌకాశ్రయం!!! ఇలా మిలటరీ, నౌకా, విమాన బలానికి కేంద్రమయింది పాలస్టయిన్.

ఇంతే గాదు. మోసల్ పెట్రోల్ పైప్ లైన్ యొక్క చివరిభాగం ఇందులో ఉన్నది. యుద్ధంలో అవసర మయితే కావలసినంత పెట్రోలు ఇక్కడనుండి సప్లయి అవుతుంది బ్రిటిషువారికి. ఒకసారి బ్రిటిషు పార్లమెంటులో అమ్రే (Amrey) అనే ఆయన చెప్పిన విషయాలు బ్రిటిషు రాజనీతిని తేటతెల్లంగా తెలుపుతాయి.

"పాలస్టయిన్‌ను రక్షించుకోవలసిన ఆవశ్యతకు కారణం, అది ఒక రాజకీయ ప్రాముఖ్య స్థలం. ఇది బ్రిటన్, ఆఫ్రికా, ఆసియా మార్గాలకు జంక్షన్. మధ్యధరా సముద్రంలోని నూతన పరిస్థితుల ననుసరించి ఇది చాలా ప్రాముఖ్యమైనది. మనకు మాండేటు నియమావళి ననుసరించి ఒక నౌకాశ్రయం కట్టుకొనేందుకు అధికారం లేకపోయినా, "హైఫా" మధ్యధరా సముద్రంలో గొప్ప నౌకా కేంద్రం గాను, పారిశ్రామిక కేంద్రం గాను మారింది. ఇంతే గాక యుద్ధ సమయంలో అవసరమయే నూనె— ప్రపంచంలో మరెక్కడనుండి కూడా ఇంతగా దొరకని నూనె—సప్లయి అవుతుంది." *

దీన్ని వేరే విశద పరచవలసిన అవసరంలేదు. మాండేటు నియమావళిని కూడా ఉల్లంఘించి నౌకా కేంద్రాలు నిర్మించడానికి కారణం సామ్రాజ్యవాదుల లాభాల కోసరమే. మధ్య ధరా సముద్రంలో ఏర్పడి 'నూతన పరిస్థితులూ' ఏమీ కాదు; ముస్సోలినీ భయమే. అబ్సీనియాను కుదట బఱచుకొని, సూయెజ్ కెనాల్‌ను, ఈజిప్టును ముస్సోలినీ ఎదుర్కొంటాడనే భయం బ్రిటిష్‌వారి కున్నది. అందుచేతనే ఆనాడు (1936) అంత తీవ్రంగా పాలస్టయిన్ ఉద్యమాన్ని బ్రిటను అణచింది. ఆంగ్లో— ఇటాలియన్ సంధికి పూర్వం, బ్రిటన్ ఫాసిస్టుల కనుకూలంగా ప్రవర్తించడానికి పూర్వం, పాలస్టయినులో ముస్సోలినీ ఆందోళన చేసిన సంగతి మనం మఱచిపోరాదు. ఈనాడు కూడా సూయజ్ కెనాల్‌లో కొన్ని సౌకర్యాలు ముస్సోలినీ కావాలంటున్నాడు. ఈ అపాయాలన్నీ గుర్తించే పాలస్టయిన్ తమ ప్రాణ సమానంగా చూస్తున్నది బ్రిటన్. మిస్ సూసన్ లారెన్సు, ఎడిన్‌బర్గు కార్మిక మహా సభలో ఇలా చెప్పింది.

* 19—6—1936 తేదీన పార్లమెంటులో పాలస్టయిన్‌పై చర్చ.

"సమీప ప్రాచ్య దేశాలకు పాలస్టయిన్ తాళం చెవి వంటిది. అందుచేత ఆ దేశంలోని ప్రజలు సంతృప్తి సౌఖ్యాలతో మెలగే ప్రజలై యుండాలి."*

అందుకోసమే తిరగబడకుండా, తృప్తితో, విధేయతగా ఉండే యూదులను దిగుమతి చేసి, తిరగబడే అరబ్బుల నణచివేస్తున్నది బ్రిటిష్ సామ్రాజ్యం.

1920 లో బ్రిటన్‌కు పాలస్టయిన్‌పై ఇచ్చిన 'మాండేట్' ప్రాచ్య రాజ్యాంగా నీతికి ఒక సాధనమయింది. పేరుకు 'మాండేట్' అయినా, ఈనాడు పాలస్టయిన్‌ను ఒక 'కాలనీ' అన్నమాట. యజమాని, బానిస అనే భేదం ఎన్నో విధాల కనపడుతుంది. ఈ వలస రాజ్య విధానంతోనే దోపిడి చేస్తున్న బ్రిటిషువారి అమానుష కృత్యాలు సహించలేక—దుర్భర పరిస్థితుల భరించలేక—ఎన్నో సార్లు తిరుగబడ్డారు. అవే 'అల్లరుల' క్రింద లెక్కగట్ట బడినాయి. ఆ 'అల్లర్లు' 1920, 21, 29, 33, 36 లలో తల లెత్తినాయి. అన్నిటిలోకి 1936 లోని స్వాతంత్రోద్యమం చాల ముఖ్యమయినది. 1936 ఏప్రియల్ 19 వ తేదీన ప్రారంభమైన తిరుగుబాటు పెద్దది, తీవ్రమైనదికూడా. తిరుగుబాటు చరిత్ర చెప్పే ముందు అరబ్ జాతీయోద్యమాన్ని గురించి తెలుసుకొందాం.

అరబ్ జాతీయోద్యమం.

బ్రిటన్, 1936 లో ఈజిప్టుకు నామ మాత్రపు స్వాతంత్ర్యం ఇచ్చింది. ఆ నాటినుండీ పాలస్టయిను సంపూర్తిగా అణచవలసిన అవసరం కూడా బ్రిటన్‌కు కల్గింది. కారణం? అరబ్ జాతీయ స్వాతంత్ర్యోద్యమానికి ఇది కేంద్ర మగుటయే.

* 9—10—1936 డైలీ వర్కర్, లండన్.

ప్రాచ్య ఖండంలోని అరబ్బు దేశాలలో జాతీయోద్యమం ప్రపంచ మహా యుద్ధానంతరం తీవ్ర మయింది. ఈ ఉద్యమ ఆశయం సామ్రాజ్య వాదాన్ని తుత్తునియలు చేయడం; తర్వాత మధ్య ధరా సముద్రంనుండి ఇరాన్ (పెర్షియన్) సరిహద్దు వరకూ, టర్కిష్ సరిహద్దునుండి హిందూ మహా సముద్రం వరకు వ్యాప్తి చెందిన అరబ్బు రాజ్యాలన్నీ కలసి ఒక "ఫ్రీ కన్ఫెడరేషన్" (స్వతంత్ర అరబ్బు రాజ్యాల కూటమి)ను ఏర్పరచడం.

ఈ ఆశయం ప్రపంచ మహా యుద్ధం వలననే కల్గలేదు. గత శతాబ్ది మధ్య సంవత్సరాలకు పోతే మనకీ ఉద్యమ పునాది కన్పించుతుంది. 'ఒట్టోమన్' సామ్రాజ్యం క్రింద నున్న ప్రాచ్య అరబ్ దేశాలలో అరబ్బుల స్వాతంత్ర్యం కోసం ఒక ఉద్యమం బయలుదేరింది. కాని ప్రపంచ మహా సంగ్రామం దీనికి దోహద మిచ్చింది. మహా యుద్ధ సమయంలో అరబ్ జాతీయ నాయకులు బ్రిటిష్ ఫ్రెంచి సామ్రాజ్య వాదాలను, టర్కీకి వ్యతిరేకంగా ప్రోత్సహించారు. దీని ఫలితంగా తమకు స్వాతంత్ర్యం లభించుతుందని ఆశించారు. మిత్రమండలి వారికి స్వాతంత్ర్య మిస్తానని వాగ్దానం కావించింది. కాని పబ్బం గడిచాక—అంటే మహా యుద్ధం విజయ వంతంగా ముగిసాక—ద్రోహం చేసింది. దానితో అరబ్ జాతీయోద్యమం మరింత తీవ్రమై గట్టిపడింది. ఇదివరకు టర్కిష్ సామ్రాజ్యం పైన తిరుగబడిన శక్తులన్నీ—ద్రోహం చేసిన మిత్రమండలి పైకే-తిరిగాయి.

ఆనాటి—పాలస్టయిన్‌లోని, ప్రాచ్యదేశాలలోని అరబ్బు ప్రజా పోరాటం జాతీయ విప్లవ పోరాటం. మన దేశపు పోరాటంలాగానే, అభివృద్ధికరమయిన—సామ్రాజ్యవాదాన్ని కూలద్రోయ యత్నించే పోరాటం.

ఈ పోరాటానికి కావలసిన మనుష్యులంతా ఎక్కువగా బీద రైతుల నుండి వచ్చారు. వీరే ప్రజలలో అత్యధిక సంఖ్యాకులు. వలస దేశాలలో వీరే ఎక్కువగా పాల్గొనడం సహజం కూడా. అయితే వీరికి పారిశ్రామిక కార్మికులు, పట్టణ వాసులైన మధ్య తరగతి ప్రజల్తూ, సామ్రాజ్య వాదపు టొత్తిడిని సహించలేని ఉన్నత వర్గాలవారూ తోడ్పడకపోలేదు. 1936 లో పాలస్టయిన్‌లోని జనరల్ స్ట్రియిక్ మహోన్నత స్థాయికి పోయింది. ఈ సమ్మె చాలా కాలం—అంటే 178 రోజులు—సాగింది. అరబ్ పార్టీ లన్నీ (సర్వవ్యాపితమగు సమ్మె) ఒక "అరబ్ హైయర్ కమిటీ" గా ఏర్పడినయి. తీవ్రవాదులు, మితవాదులు, భూస్వాములు, వర్తకులు, రైతులు, కార్మికులు ఐకమత్యంతో తిరగబడేటంత ఉన్నతస్థానానికి ఈ ఉద్యమం వృద్ధి పొందింది.

"జియోనిజం"


యూదు (జ్యూ)ల ఉద్యమాన్నే 'జియోనిజం' అంటారు. మొదట యూదుల పుట్టుక పాలస్టయిన్‌లో అయినా, వారు చెల్లాచెదరై పోయారు. ప్రపంచ మందలి ప్రతి భాగంలోనూ నివసించసాగారు. కాని కొన్ని శతాబ్దాలనుండి, అనేక హింసలకు బాధలకు లోనయ్యారు. ప్రతి దేశంలోను, బహిష్కరించడం, ముఠాలు ముఠాలుగా తరిమివేయడం జరుగుతూ వచ్చింది. ఈనాడు—నాజీ రాక్షస పరిపాలనలో—యూదుల అవస్థ మనం ప్రత్యక్షంగా చూస్తూనేఉన్నాం. ఈనాడు ఆర్తులగు యూదుల సమస్య ప్రపంచ సమస్య అయిపోయినది. పీడితులైన యూదులంటే సానుభూతి చూపడం కూడ సహజమే. కాని పాలస్టయిన్‌లోని యూదులు మన సానుభూతికి తగినవారా? ఈ సమస్య చర్చించే ముందు "జియోనిజం" పుట్టు పూర్వోత్తరాలు చూద్దాం.

19 వ శతాబ్దం రెండవ భాగంలో "జియోనిజం" జాతీయోద్యమంగా ప్రారంభమయింది. తూర్పు యూరప్‌లోని యూదులను ఆ రోజులలో తీవ్రంగా బాధించసాగారు, తరుమగొట్ట ప్రారంభించారు. అచటి జాతీయోద్యమాలకు, యూదులు కంటకంగా కన్పించసాగారు. అంతటితో తమ "మాతృభూమి"కి—పాలస్టయిన్‌కు-తాము తిరిగి పోవాలని యూదులు తలచసాగారు. ముఖ్యంగా మేధావులను ఉద్రేకపరచింది ఈ భావన. "మెస్సాయి" ప్రాచీన ఆశయం, "వచ్చే సంవత్సరం జెరూసలం" అని ఉండేది. ఈ ఆశయాన్ని పూర్తి చేయడం—అంటే పాలస్టయిన్‌లో నివసించడం—ముఖ్యమని యూదులు భావించారు. ముఖ్యంగా మధ్య తరగతి యువకులు ప్రచారం చేయ ప్రారంభించారు. ఇది వట్టి ఊహామాత్రమైనా (Utopian) దీనిలో జాతీయ తత్వం ఉంది. తీవ్రంగా బాధలకు లోనై, అణచబడ్డ, ప్రజల కోర్కె గాబట్టి ఈ ఆశయం న్యాయమూ ధర్మబద్ధి కూడా.

జియాన్ ప్రేమకులు **(Lovers o f zion)** అనే ఉద్యమం ఒకటి బయలు దేరింది. ఇది పాలస్టయిన్‌లో యూదులకు వ్యవసాయ కాలనీలను ఏర్పాటు చాలని అభిలషించింది. 'ఇస్రాయెల్' కాలంలో లాగా మళ్లా, యూదులు తమ భూమిని దున్నుకోవాలని తలచారు. ఈ ఉద్యమానికి పట్టుగొమ్మలు, యం. అల్లెన్ బ్లూమ్, డాక్టరు లియోపిన్స్కర్, అనువారలు. వీరొక కరపత్రం—'స్వయం స్వేచ్ఛ' **(Auto-Emancipation)**అను దానిని ప్రకటించారు. ఇది ఈ ఉద్యమానికి బైబిల్ అని చెప్పవచ్చు. 19 వ శతాబ్దం మొదటి భాగంలో ప్రబోధించిన యూదు జాతీయ నాయకుల ప్రబోధం వీరి కాధారం. ఆ నాయకులు మోసెస్ హెస్, రబ్బి హిర్స్చ్ కాలిషర్ **(Moses Hess and Rabbi Hirsch Kallischer)** అనే వారలు. యూదుల



యూదుల నూతన జీవితం



యూదు వాలంటీర్లు

సమస్య ఇతర జాతులతో కలిసి పోవడం వలన పూర్తిగా వసీ, వారికి ఒక 'మాతృ భూమి' దొరికే వరకు యూదులు ఇతర జాతులకు 'క్రొత్త' వారిగా కన్పించుతూ ఉండవలసినదే నసీ చెప్పారు. ఈ బోధలే తర్వాత వారిని ప్రోత్సహించు "స్వేచ్ఛా" ఉద్యమానికి దారి తీసినయి. ఈ ఉద్యమం ముఖ్యంగా విద్యార్ధులలోను. మేధావులలోను నిలచిపోయింది. కాని జియోనిజం ప్రపంచంలోని యూదుల సమస్య పరిష్కరించలేదు. ప్రపంచ యుద్ధానంతరం ఏదో కొద్దిగా వ్యవసాయ సెటిల్‌మెంట్లు సంపాదించినా, ఇంకా అసలు సమస్య అలాగే నిలిచిపోయింది.

ఈ ఉద్యమం గాక మరొకటి కూడా ఉంది. దీనికి సిద్ధాంత కర్త ఆస్కార్ గిన్స్‌బర్గ్ (**Ascher Ginsberg**). ఇతడు మారుపేరుతో వ్యాసాలు వ్రాస్తుండేవాడు. "ప్రజలలో ఒకడు" అనే పేరుతో వ్రాస్తూ తన అభిప్రాయలను ఇలా వెలిబుచ్చాడు. "పాలస్తయిన్, యూదుల ఆధ్యాత్మిక విజ్ఞాన కేంద్రంగా ఉండాలి. హిబ్రూ భాష, విజ్ఞానాన్ని పునరుద్ధరించే కేంద్రము గావాలి. ప్రపంచంలోని అన్ని యూదు తెగలను దాని పలుకుబడి క్రిందకు తీసుక రావాలి." కాబట్టి ఆ రోజుల్లో యూదుల ఉద్యమానికీ— నేటి ఉద్యమానికీ చాలా భేదం ఉంది. ఈ నాటి వలె అది ఒక రాజకీయ ఉద్యమం గాదు. కేవలం యూదులకు ఒక "మాతృ భూమి" కావాలని హిబ్రూ విజ్ఞానాన్ని పునరుద్ధరించాలని యూదులలో ప్రబోధించడానికి బయలు దేరిన ఉద్యమం.

19 వ శతాబ్దం చివరి రోజులలో తూర్పు యూరప్ నందు యూదులను హింసించడం అధికమైంది. నాగరీకత గలవనుకునే ఫ్రాంసు. జర్మనీలే (డ్రేఫస్ కేసు) యూదులను తరుము ప్రారంభించినయి. అంతటితో "జియోనిజం" కూడ రాజకీయ ఉద్యమంగా మారింది. పాలస్తయి

నులో "యూదుల ప్రభుత్వం" (**Jewish State**) నిర్మించాలని కార్యక్రమం నిర్ణయించారు. ఇతర జాతులలాగానే యూదులు కూడా ఒక జాతి కావాలని వాంఛించారు.

ఏ ఉద్యమమైనా, దానిలో విప్లవ స్వభావం ఉన్నంతవరకే మనం హర్షిస్తాం. విప్లవపంథాను విడిచితే అది మన నిరసనకు గురిగాక తప్పదు 'జియోనిజం' యూదుల క్షేమాన్నిమాత్రం ఆశించినంతవరకూ కాదనలేరు. కాని ఆ క్షేమాన్ని-స్వార్థంగా మార్చుకొని-బ్రిటిష్ సామ్రాజ్యానికి దాసోహమంటూ అరబ్బుల నణచడానికి ప్రయత్నిస్తే ఏ స్వాతంత్ర్యవాదీ సహించలేడు. ప్రపంచ యుద్ధానంతరం పాలస్టయిన్‌లో యూదుల 'మెజారిటీ'ని స్థాపించాలని బ్రిటిష్ సామ్రాజ్యం ఆశించింది. అందుకుగాను అరబ్బు కార్మిక కర్షకులను విభజించి వేర్వేరు ప్రాంతాలలో ఉంచింది. పాలస్టయిన్‌లో నిరంతరం యూదులను దిగుమతి చేయడంవలన ఆరబ్ వర్గాలకు కూడ ఇది ఒక కంటకం అయింది. బ్రిటిష్ సామ్రాజ్యానికి ఒక మహదవకాశం లభించింది. ఆరబ్ జాతీయోద్యమానికి పోటీగా జియోనిస్టు ఉద్యమం కన్పించింది. మనదేశంలో హిందూ మహమ్మదీయ సమస్య ఎలా సాకుగా ఉపయోగించుకొంటూ వచ్చారో, అలాగే ఆరబ్-యూదు సమస్య పాలస్టయిన్ స్వాతంత్ర్య ఉద్యమానికి అడ్డుగా ఉపయోగించసాగారు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు.

జియోనిజం-బ్రిటన్ పట్టుగొమ్మ.

రాజకీయాలతో సంబంధం కల్గిన నూతన జియోనిస్టు సిద్ధాంతాన్ని స్థాపించింది థియోడోర్ హెర్జెల్ (**Theodore Herzl**) ఇతడు జ్యూయిష్ స్టేట్ అనే కరపత్రం ఒకటి ప్రకటించాడు. రాయబారాల ద్వారా

తన ప్రణాళికను—యూదులకు కాలనీలు— బలపరచ దలిచాడు. ఆనాటి రష్యా సామ్రాజ్యపు మంత్రి ప్లెహ్వే (**Plehve**)ని, టర్కీ సుల్తానగు అహమ్మద్‌ను, బ్రిటిషు వలస రాజ్య మంత్రి జోసఫ్ ఛాంబర్లేనును, కలిసికొన్నాడు. సిప్రస్‌లో యూదుల కాలనీకి అనుమతి ఈయమని ఛాంబర్లేనును అడిగాడు. కాని అతడు నిరాకరించి, ఈజిప్టు సరిహద్దులలో ఉన్న ఎల్ హరిష్, సినై పెనిన్సులాలను సూచించాడు. కాని ఈజిప్టులోని వ్యతిరేకాందోళన వలన ఈ సూచనలు కూడా వృథా అయినాయి. ఇక, తూర్పుఆఫ్రికాలోని "యుగండా"ను ఇస్తామని అన్నారు. హెర్జెల్‌ను ఈ విషయంలో అనేకమంది ప్రోత్సహించడంవలన ఈ సూచనకు అత డంగీకరించాడు. అయితే ఈ సూచన కూడా ఫలించలేదు. రష్యాలో 'జియోనిస్టు'లు దీనికి వ్యతిరేకించారు. ఇలా ఒక దాని వెనుక ఒకటి—అన్ని ఆశలూ అడుగంటినవి. రాయబారాల ఫలితం సున్న అయింది. హెర్జెల్—భగ్నమనస్కుడుగానే—చనిపోయాడు. అతని బోధలను కొంతమంది మేధావులు ప్రచారం చేయసాగారు. అందులో ప్రముఖుడు డాక్టరు చైమ్ వీజ్ మన్. ఇతడే తర్వాత తర్వాత ప్రపంచ యూదుల ఉద్యమానికి నాయకుడయ్యాడు.

19 వ శతాబ్దం చివరను, 20 వ శతాబ్ద ప్రారంభంలోను, జియోనిజం రాజకీయ ఉద్యమంగా వృద్ధిచెందింది. ఈ రోజులలోనే రెండవ అంతర్జాతీయ కమ్యూనిస్టుపక్షం, (సెకండ్ ఇంటర్నేషనల్) ఇతర కార్మిక ప్రజాసంఘాలు, ఉదయించాయి. ఈ సంఘాలలో యూదుకార్మికులు చేరి అనేక పోరాటాలలో పాల్గొన్నారు. తమ జాతికి మాత్రమేగాక ప్రజలందరకీ ప్రజా స్వామిక హక్కులు కావాలనీ, సుఖ జీవనం కావాలనీ పోరాడారు. కాని 'జియోనిజం' ఈ పోరాటాలనుండి యూదులను తప్పించాలని ప్రయత్నించింది. ప్రజాస్వామిక పోరాటాలలో విజయం లభించితే

యూదులూ తదితరులవలెనే గౌరవింపబడేవారే. అయినా ఈ ఉద్యమనాయకు లందుకు ఇష్టపడలేదు.

యూదుకార్మికులీస్వభావాన్ని గుర్తించారు. రష్యాలో-ఈనాటి సోవియట్ రష్యాలో కాదు-జార్ కాలంలోని రష్యాలో - 60 లక్షల మంది యూదులుండేవారు. వారందరూ జార్ ప్రభువులచేత పీడింపబడేవారు. రష్యన్ విప్లవంలో యూదులు వేలకొలది పాల్గొన్నారు. పాల్గొనడంకూడా తమ వర్గపరిస్థితుల ననుసరించే పాల్గొన్నారు. కార్మికులు, కార్మిక పక్షాల లోను; పెట్టి బూర్జువా (మధ్య తరగతివారు) సోషల్ రివల్యూషనరీపార్టీ మొదలగు వాటిల్లోను; ధనవంతులగు యూదులు, కేడెట్ (జ్యూ కేపిటలిస్టుల పార్టీ)లోనూ; మెంబర్లుగా ఉన్నారు. యూదులలో ఇంత రాజకీయ చైతన్యం కల్గినా, జియోనిస్టు సిద్ధాంతం యూదు కార్మికులకు నచ్చలేదు. కారణం తమలో ప్రజా ఉద్యమాన్ని లేవదీసే శక్తి 'జియోనిజం'లో లేకపోవడం వల్లనే. యూదులను తీవ్రంగా హింసించే చోట్లకూడ ఈ సిద్ధాంతం కార్మికుల్లో చొచ్చుకొనలేదు. మితవాద యూదు కార్మికపార్టీ "బండ్"* కూడా 'జియోనిజం'ను వ్యతిరేకించింది. పాలస్టయిన్ మొదలగు దేశాలకు వచ్చే యూదులంతా 'జియోనిజం' యొక్క సిద్ధాంతాలతో ఏకీభవించికాదు. ఆర్త త్రాణులగువారిక-ఏమీ దిక్కు తోచనప్పుడు-చేసే పనేమిటి? అందుకే పాలస్టయిన్‌కువచ్చుట. కొంతవరకు జాతీయోద్రేకమున్నా-అది ప్రజాసామాన్య ఉద్యమం కానప్పుడు, వారికి నచ్చదు. అందుకనే యూదులు లక్షలాది అమెరికాకు, ఇతరప్రదేశాలకు పోయారు. పాలస్టయిన్ వచ్చినది కొద్ది మందే.

* బండ్: యూదుల సోషలిస్టు లీగ్. 1897లో పోలండ్‌లో స్థాపించబడింది. ఈ లీగ్ సభ్యులు తదితర సోదర కార్మికుల హక్కులకై నేడుకూడా కలసి పోరాడుతున్నారు.

జియోనిజంలో కూడ సోషలిస్టు భావాలతో నిండిన మరో ఉద్యమం బయలుదేరింది. వీరు యూదు కార్మికులకు పాలస్టయిన్‌లో ఒక భాగం కావాలనీ, ఆ ప్రదేశంలో సోషలిజం కొరకు పోరాడుతారనీ చెప్పసాగారు. యూదు కార్మికులను ఈ ఉద్యమం ఆకర్షించింది. కాని యూదుల కార్మిక ఉద్యమం, మొదట పాలస్టయిన్—తర్వాత సోషలిజం అనే ధోరణిలో ఉన్నది. జాతి ద్వేషం, పీడించడం, తరమడం అనేవి ఏమి లేకుండా శాంతియుతంగా నిలవడానికి ఒక స్థలం ముందు ఉంటే—ఆ తర్వాత సోషలిజం అనే స్థితిలో వీరున్నారు.

కాని ఈ ఉద్యమానికి కూడ యూదులలోని పెద్ద బూర్జువా (పెట్టుబడిదారులు) సమ్మతించలేదు. కొందరు దీనిని అలక్ష్య పరచారు. ఉదార హృదయులు కొందరు (ఫిలాంత్రఫిస్టుస్) పాలస్టయినులో "చోవవాయ్ జియాన్" సెటిల్మెంట్లకు చాలా ధనం ఇచ్చారు. వీరిలో ముఖ్యులు బారన్ హిర్స్కు, బారన్ ఎట్మండ్ డిరాత్స్ చైల్డ్ అనువారు.

అసలు జియోనిస్టు ఉద్యమం యూదులకు మంచి జీవితం-సౌఖ్యం కావాలన్న ఆశయాలతో బయలుదేరింది. కాని క్రమేణా "తప్పించుకు తిరిగే" పద్ధతి అవలంబించింది. ఆ యా దేశాల ప్రజలలో ప్రజా పోరాటాలకు దోహద మిచ్చి, యూదుల జీవితాన్ని సుఖపరచేందుకు ప్రయత్నించక ఆ ఉద్యమాల నుండి "తప్పించుకో" జొచ్చింది. ఒక్క పాలస్టయిన్‌లో యూదులకు మెజారిటీ సంభవిస్తే చాలు అన్నట్లు తలచింది. అందుచేత ఇతర దేశాల యూదుల బాగుపరచే ఒక నిర్ణీత కార్యక్రమం ఈయలేక పోయింది. ప్రజా సామాన్య పోరాటాల నుండి యూదుల విడదీసి, ఆ పోరాటాలను బలహీన పరచింది. చిట్టచివరకు ఈ ఉద్యమం బ్రిటిష్ పెట్టుబడిదారులకు, యూదుల పెట్టుబడిదారులకు ప్రోత్సాహ మిస్తూ వాళ్ళ చేతిలో

ఒక కీలుబొమ్మ అయింది. జాతీయ భావాలతోను, ఉన్నతాశయాలతోను బయలుదేరిన ఈ ఉద్యమం చివరకు బ్రిటిషు సామ్రాజ్యవాదులకు పట్టుగొమ్మయై, ఆరబ్ స్వాతంత్ర్యోద్యమానికి అడ్డుగా పరిగణించింది!

తెర వెనుక ....

జియోనిస్టు ఉద్యమపు తెర వెనుక భాగవత మాడించే ముఠా ఒకటి లేక పోలేదు. ఆ ముఠా, యూదు పెట్టుబడిదారులు. 'పవిత్ర' ఆశయాలతో ప్రారంభమైన ఈ ఉద్యమం ఇపుడు కొద్దిమంది పెట్టుబడిదారుల హస్తగతమైనది. ప్రపంచ యుద్ధానంతరమే 'జియోనిస్టు' ఉద్యమానికి మంచి ప్రోత్సాహం కల్గింది. ఒక వైపున ఆరబ్బులకు స్వాతంత్ర్య మిస్తామని, మరో వైపున యూదులకు పాలస్టయిన్‌లో "నేషనల్ హోం" స్థాపిస్తామని బ్రిటన్ పరస్పర విరుద్ధమైన వాగ్దానాలు గావించింది. బాల్ఫర్ ప్రకటన వలనా, మాండేట్‌లోనూ, (వీటిని గురించి ముందు వివరించుతాం) యూదులకు ఎక్కువ ప్రోత్సాహ మీయబడింది. యూదు పెట్టుబడిదారుల సహకారం బ్రిటన్‌కు లభించింది.

ఇతర పెట్టుబడిదారుల సహకారంతో యూదు పెట్టుబడిదారులు 'పవిత్ర భూమి'యగు పాలస్టయిన్‌లో లాభాలు సంపాదించ దలచారు. ఒక ప్రక్క "జాతీయ ఆవశ్య" మనే బురఖా. ఇంకొక ప్రక్క బ్రిటిష్ వారి రక్షణ. ఈ రెండింటితో తమ వర్తక వ్యాపారాలు విరివిగా కొనసాగించవచ్చు. లార్డు మెల్చెట్, ఇస్రాయెల్ సీఫ్, జియోనిస్టు నాయకులు. వీరి వెనుక కావలసినంత బ్రిటిషు పెట్టుబడి ఉంది. పాలస్టయినులో యూదుల పెట్టుబడిలో బ్రిటన్‌ది పైచేయి. కాబట్టి నేటి జియోనిస్టు ఉద్యమ నాయకత్వం అంతా బ్రిటిషు యూదు పెట్టుబడిదారుల చేతిలోను—వారి 20,000,000 పౌనుల పెట్టుబడిలోనూ ఉంది. ప్రపంచ యూదు ఉద్యమ నాయకత్వం పాలస్టయిన్ విభజన కంగీకరించింది. పాలస్టయిన్‌లో యూదుల స్టేట్ నెలకొల్పి, బ్రిటన్‌తో స్నేహ సంబంధాలు కల్గియుండటానికి అంగీకరించింది. అంటే బ్రిటన్‌మీద పూర్తిగా ఆధారపడటం.

యూదుల పెట్టుబడి పెట్టి సురక్షితంగా దోచుకోడానికి ఒక ప్రత్యేకపు 'స్టేట్' ఉండటం ఎంత హాయి! అందులో రవి యస్తమింపని బ్రిటిషు సామ్రాజ్యపు తుపాకి గుండ్ల సహాయం....

ఇందుకు ఉదాహరణ కావాలంటే డాక్టర్ వీజ్‌మన్ బ్రిటిషు వలస రాజ్య కార్యదర్శి ఆర్మ్స్‌బీ–గోర్ (**Oamsby-Gore**)తో ఆడిన రాయబారాల వలన తెలుస్తుంది. పాలస్టయిన్‌లో నెలకొల్పబోయే యూదుల 'స్టేట్‌లో', ఎలక్ట్రిసిటీ కంపెనీ, పొటాష్ లిమిటెడ్ కంపెనీలను—ఈరెండూ యూదుల పెట్టుబడితో సంబంధం ఉన్న బ్రిటిష్‌వారివి—కల్పాలని కోరాడు.

కాని, అమెరికన్ యూదు పెట్టుబడిదారులకు పాలస్టయిన్ విభజన నచ్చలేదు. అమెరికా పెట్టుబడిని ఊరికే దిగుమతి చేయడానికి వీలుండదు. ఇప్పుడీ విభజన జరిగితే, క్రొత్తగా ఏర్పడ్డ "జ్యూయిష్ స్టేట్" బ్రిటను మీద ఆధారపడుతుంది. ఇప్పుడు 'మాండేట్' పరిపాలనలో ఉన్న కాస్త అవకాశం కూడా అమెరికా పెట్టుబడికి ఉండదు. అందుకే వీరు తీవ్రంగా విముఖులైనారు.

జియోనిస్టు ఉద్యమం బ్రిటిష్ యూదు పెట్టుబడిదారుల పలుకుబడిలో ఉందని చెప్పాం. కాని అందుచేత యూదులంతా పెట్టుబడిదారులని భావించరాదు. ఈ ఉద్యమాన్ని అనుసరించే వారిలో చాలమంది హృదయపూర్వకంగా యూదుల క్షేమాన్ని అభిలషించేవారు లేకపోలేదు. అవసరమైతే

తమ ప్రాణాల్ని సైతం అర్పించే త్యాగధనులు లేకపోలేదు. కాని వీరి ఉన్నతాశయాలు, వీరి ఉత్సాహం, వీరి కార్యదీక్ష—అంతా ఒక అభివృద్ధి నిరోధకమైన ఉద్యమంలో అర్పించబడటం విషాదకరమైన విషయం. *

* **Palestine Terror or Peace.**

౨

ప్రపంచయుద్ధానికి పూర్వం

ప్రపంచమహాయుద్ధానికి పూర్వం టర్కీష్ పరిపాలనలో ఉన్నది పాలస్టయిన్. టర్కీష్ పరిపాలననాటి అరబ్బులు సుమారు 660,000 మంది ఉంటారు. అందులో 100,000 మంది దేశమంతా తిరుగుతూ, మేకల్ని, గొర్రెల్ని, ఒంటెల్ని కాచుకొని బ్రతికేవారు. మిగిలినవారిలో దాదాపు 5లక్షల మంది వ్యవసాయం మీద ఆధారపడి బ్రతికేవారు. వారిలో 100 కి 50 మంది భూస్వాములు, 25 మంది రైతులు, 25 మంది భూమిలేని కార్మికులు.

అరబ్బుల వ్యవసాయం పూర్వమూ-చాలావరకు ఇపుడూ-వెనుకబడి వుంది, దీనికి కారణం అక్కడ అమలులోనున్న 'మేషా' పద్ధతి. ఈ పద్ధతి ప్రకారం భూమి అంతా గ్రామమొత్తానికి చెందుతుంది.

భూమిని ముక్కలుముక్కలుగా విభజించి, వ్యవసాయంచేసేవారు. రెండేళ్లకొకసారి విభజన ఈవిధంగా జరగడంవల్ల వ్యవసాయానికి ఎక్కువ కౌలుదార్లు స్థిరంగా ఉండరు. భూస్వామి తన ఇష్టంవచ్చినపుడు కౌలుదారుని తొలగించవచ్చు. అందుచేత రైతు భూమిని సరిగా బాగుచేయడు. ఇంతే గాదు. రైతుకు వ్యవసాయ ఖర్చులకు పెట్టుబడిలేదు. వ్యవసాయంలో నవీన విధానా లేవీ తెలియవు. తెలిసినా అవలంబించగల 'తాహతు' లేదు. కౌలుకూడా విపరీతంగా ఉంటుంది. పండిన దానిలో కనీసం 3 వ వంతైనా ఇవ్వాలి. కాలుమీద కాలువేసుక కూర్చున్న భూస్వామికి 2 వంతులు, అహో రాత్రులు భూమిపై అఘోరించి చచ్చే రైతుకు 1 వంతు. ఇక ఆ వ్యవసాయం ఏంబాగుపడుతుంది. దాదాపు మన దేశపరిస్థితులూ ఇలాగే ఉన్నాయి. ఏ కఱవో వస్తే తన ప్రాణాల నిలబెట్టుకొనేందుకు షాహుకార్ల వద్దకు పరుగెత్తాలి రైతు. మనదేశంలోవలెనే-ఇతర వలసదేశాలలోవలెనే పాలస్టయిన్ రైతుకూడ చాలా పేదవాడు.

వ్యవసాయం గాక, ఉన్న చిన్న చేతి పరిశ్రమలపై కూడ ఆధారపడి వుండేవారు అరబ్బులు. చిన్న చిన్న వర్తకాలు చేస్తుండేవారు. పరిశ్రమలు చెప్పదగిన వేమీ లేవు గాని, 'నాబ్లస్'పెద్ద సబ్బు పరిశ్రమ, రాతి క్వారీలు ఉండేవి. అంతేగాని ప్రపంచ మార్కెట్‌తో సంబంధం ఉండే నవీన పరిశ్రమలు గానీ, వర్తక వ్యాపారాలు గానీ లేవనే చెప్పవచ్చు.

ఇక యూదుల సంగతి. సుమారు 55000 మంది ఉండేవారని అంచనా. యూదుల ఎక్కువగా పట్టణాలలో నివసించేవారు. వర్తక వ్యాపారాలలోను, ఉద్యోగాలలోను ఉండేవారు.

తరతరాల నుండి నివసించుతున్న యూదులు చాలమంది అరబ్బు

లతో కలిసిపోయారు. మొదటి లేక రెండవ ఆలియా*తో 12 వేల మంది యూదులు పాలస్టయిన్ వచ్చారు. ఈ 12 వేల మందికి దయార్ద్ర హృదయులగు బారన్ హిర్ష్, ఎడ్మండ్ డి రాత్స్ చైల్డ్ మొదలగువారు ధన సహాయం చేశారు. సెటిల్‌మెంటులు నిర్మించుకొని తమ భూమిని తామే దున్నుకొనేవారు యూదులు. కార్మికుల నుపయోగించుకొనేవారు. 1913 లో మొత్తం సెటిల్‌మెంట్లలో వ్యవసాయ క్షేత్రాలలోను నియోగింపబడిన యూదులు 871 మంది మాత్రమే.

రాజకీయాధికారం టర్కిష్ నిరంకుశాధికారుల చేతులలో ఉండేది. అధికార ప్రాబల్యం గల భూస్వామి కుటుంబాలు వీరితో కలిసి యుండేవి.

టర్కిష్ పరిపాలనలో, ఆరోగ్య వసతులు గాని, చదువు సంధ్యలు గాని, ఇతర పబ్లిక్ సర్వీసులు గాని లేవనే చెప్పాలి.

అరబ్బు రాష్ట్రాలను పన్నులు వసూలు చేసుకొనేందుకు సాధనాలని మాత్రమే, టర్కిష్‌సామ్రాజ్యం ఎంచేది. కొందరు కంట్రాక్టర్లకు ఈరాష్ట్రాలను పబ్లిక్‌గా వేలంవేసేవారు. అయితే వేలంపాడినవారి హక్కు పన్నులు వసూలుచేయడంవరకే. పేద రైతాంగంనుండి ఇష్టంవచ్చినంత వసూలు చేసేవారు. (మన జమీందార్లమాదిరే. మన జమీందార్లుకూడా పూర్వం ఈస్టిండియా కంపెనీ తరపున పన్నులు వసూలుచేసిపెట్టే కంట్రాక్టర్లే.) వసూలు చేయడమేగాక టర్కిష్ సామ్రాజ్యానికి సైనికులను కూడా వీరే జేర్పించేవారు. ప్రతికుటుంబములో మొదటి కొడుకుతప్ప తక్కినవారం

* ఆలియా అనేది హిబ్రూపదం. ఆరోహణం అని దీని అర్థం. ఇస్రాయెల్ భూమియగు పాలస్టయిన్‌లోకి రావడం, ప్రవాసమనే అగాధం నుండి, స్వేచ్ఛ అనే ఉన్నత స్థలానికి చేరడం అని జియోనిస్టు వేదాంతం చెబుతుంది. మొదటి ఆలియా 1880 ప్రాంతాలలోను, రెండవది 20 వ శతాబ్దపు ప్రారంభంలోను జరిగింది.

దరూ అవసరమైనపుడు టర్కిష్ సైన్యాలలోజేరడానికి సంసిద్ధంగాఉండాలి.

పాలస్టయిన్‌కు ఇప్పటి ఆకృతి ప్రపంచయుద్ధానికి పూర్వం లేదనే చెప్పాలి. రాజకీయంగా చూస్తే బీరత్ * (విలాయత్) రాష్ట్రంలో కొంత జెరూసలం జిల్లా లేక సంజాక్‌లో కొంత ఉండేది. ఈ రెండింటి పరిపాలన ఒట్టోమన్ సామ్రాజ్యంలో ఉండేది.

పాలస్టయిన్ సరిహద్దులగు ట్రాన్స్‌జోర్డానియా, లెబనాన్ - ఇవన్నీ ఒక స్వాభావిక ఆర్థిక కూటమిగా తయారయినయి. వీటిలో స్వేచ్ఛావర్తకం, వస్తుమారకం ఉండేది. ప్రపంచయుద్ధానంతరం విడిపోయి, ప్రత్యేక రాజ్యాలయినవి. ఇప్పుడు వాటికి టారిఫ్‌పద్ధతి అమలులో ఉన్నది.

ఆరబ్ పాలస్టయిన్, ఆరబ్ సిరియా, ఇరాక్, సాదీ అరేబియాలలో ఒకేభాష మాటలాడేవారు. కొంతవరకు ఒకరకపు ఆచారం, విజ్ఞానం కూడ కల్గియుండేవారు. స్టాలిన్ 'జాతి' అంటే ఒక నిర్వచనం ఇచ్చాడు. ఆ నిర్వచనాన్ని దాదాపు ఈ రాష్ట్రాలు పూర్తి చేస్తున్నాయి. స్టాలిన్ ఇలా అన్నాడు.

"ప్రత్యేక భాష, విజ్ఞానం, చరిత్ర, నిశ్చిత భూభాగంలో నివాసం, ఆర్థిక జీవితం, మానసిక ప్రవృత్తి, నాగరికత గలది జాతి. *

క్లుప్తంగా చెప్పాలంటె, ప్రపంచ యుద్ధానికి పూర్వం, ఆరబ్—యూదు సమస్య ఇంత తీవ్రంగా లేదు. ఆరబ్బులు, యూదులకంటె ఎంతో అధికంగా ఉన్నారు. టర్కిష్ సామ్రాజ్యం క్రింద నలిగిపోతున్న అరబ్బులంతా ఒక స్వాతంత్ర్య రాజ్యం స్థాపించాలని కుతూహలంగా ఉన్నారు.

*జాఫాకు ఉత్తరంగాను, లటాకియాకు కొద్దిగా ఉత్తరంగాను ఉన్న సిరియా సముద్రతీర భాగం ఇందులో ఉంది. పటం చూడండి.

* **Marxism and Colonial Question :- J. Stalin**

3

ప్రపంచయుద్ధం.

ప్రపంచ మహా సంగ్రామం ఎందుకు జరిగింది? 80 లక్షల యువజనులు ఎందుకు ఆహుతి అయ్యారు? ఈ ప్రశ్నలకు జవాబివ్వడం ఇక్కడ అనవసరం. కాని ప్రపంచయుద్ధానికి కారణం మనకు సంబంధించినవరకు ఈ క్రింది విషయం గుర్తుపెట్టుకోవాలి. సామ్రాజ్యయుద్ధ మంత్రివర్గానికి మెమొరాండం సమర్పించుతూ జనరల్ స్మట్సు ఇలా వ్రాశాడు.

"ఏ భాగాలను జర్మనీ బహుశాలాగుకొని, ఆసియాసామ్రాజ్యంలోని, మన శక్తులకే దెబ్బగొట్టుతుందో, టర్కిష్ సామ్రాజ్యంలోని ఆ భాగాలను టర్కిష్ సామ్రాజ్యంనుండి లాగిపారవేయడం మనపని. ఇది దాదాపు పూర్తి అయింది. కానీ ఈ కర్తవ్యాన్ని పూర్తిచేయాలంటే పాలస్టయిన్‌ను జయించడం అవసరం. *

* **The post war World:- J. Hampdoen Jackson.**

క్రమంగా శిధిల మవుతున్న ఒట్టోమన్ సామ్రాజ్యం ప్రపంచానికి ఒక సమస్య తెచ్చిపెట్టింది. పెద్ద రాజ్యాలవారు, దోపిడీని ఎలా పంచుకోవాలా అని తలిచారు.

ఇంగ్లండు ఈజిప్టు పైన. అరబ్బు దేశాలపైన కన్నువేసింది. ఇండియాకు, ప్రాచ్యదేశాలకు, సూయజ్ కాలువగుండా మార్గం కావాలంటే ఇవి అవసరము.

రష్యా, కాన్స్టాంటినోపుల్ వరకు ప్రాకుతున్నది. నల్ల సముద్రాం కూడ కాజేసి, మధ్యధరా సముద్రంలోకి స్వేచ్ఛా మార్గం సంపాదించాలని దాని యెత్తు.

ఫ్రాంసు ఆ రోజుల్లో ఉత్తర ఆఫ్రికా తీరాన్ని కలుపుకొని, మధ్యధరా సామ్రాజ్యాన్ని నిర్మించుతున్నది. తర్వాత తర్వాత, ఇటలీ కూడ సామ్రాజ్య నిర్మాణంలో పోటీ సల్పింది.

జర్మనీ తూర్పుయూరప్‌పై ఆర్థికపెత్తనం వహించాలని తలచింది. టర్కీ అరబ్బుదేశాలను తన పలుకుబడిక్రిందకు లాక్కోవాలని దాని ఆశ. బెర్లిన్-బాగ్దాద్ రైల్వేనినిర్మించి, పర్షియాఖాతంలో అధికారంసంపాదించి, తూర్పుదేశాలలో బ్రిటన్ పెత్తనానికి దెబ్బగొట్టాలని జర్మనీ వాంఛ.

ఈ సామ్రాజ్య దురహంకార పూరిత ఆశలమధ్య ప్రపంచం నలిగిపోయింది. నాగరికత నశించింది. కాని ప్రపంచ మహాయుద్ధంలో పాలస్టయిన్ పట్ల బ్రిటన్ అవలంబించినవైఖరి ఇది.

టర్కీని యుద్ధాన్నుండి బయటకు నెట్టి ఆ విధంగా జర్మనీకి దెబ్బగొట్టడం; మహాయుద్ధానంతరం ప్రాచ్య సమీప దేశాలలో తమ పలుకుబడిని వృద్ధిచేసికొని, పెర్షియాఖాతం ద్వారా, ఇండియాకుగల తన వర్తక రహదారులకు గ్యారంటీని సంపాదించుకోవడం.

జర్మనీభయం ఆ రోజులలో హెచ్చుగా ఉంది. ఒట్టోమన్ సామ్రాజ్యంలో జర్మనుల పలుకుబడి హెచ్చింది. 1898లో బెర్లిన్-బాగ్దాద్ రైల్వే నిర్మాణానికి కంట్రాక్టుకు అనుమతి ఈయబడింది. అందుకనే జర్మనీ భయాన్నుండి రక్షించుకోవాలంటే ఒట్టోమన్‌సామ్రాజ్యాన్ని నాశనంగావించాలి. ఒట్టోమన్ సామ్రాజ్యాన్ని—అంటే టర్కిష్ సామ్రాజ్యాన్ని నాశనము చేయాలి. అందుకు టర్కిష్ సామ్రాజ్యంచే అణచబడిన అరబ్బుల సహాయము గావాలి. "400 ఏండ్లు టర్కిషు పరిపాలన క్రిందఅరబ్బులు నలిగిపోయారు. బానిసత్వ శృంఖలాలను తెంచుకొన సంసిద్ధులయిన సమయంలో బ్రిటిషు వారు అరబ్బులను ప్రోత్సాహపరిచారు." *

ఒట్టోమన్ సామ్రాజ్య పతనం.

మహమ్మద్ క్రీస్తు తర్వాత 600 ఏండ్లకు వచ్చాడని ఆంగ్ల చరిత్రకారుల అభిప్రాయం. క్రీస్తుశకం 14 వ శతాబ్దంలో, క్రిస్టియనులు పోప్ అధికారాన్నీ, పవిత్ర రోమన్ సామ్రాజ్యాన్నీ తొలగించసాగారు. అలాగే ముహమ్మద్ 14 వ శతాబ్దంలో—అంటే క్రీస్తుశకం 20 వ శతాబ్దంలో కాలిఫ్‌నూ, ఒట్టోమన్ సామ్రాజ్యాన్నీ ధిక్కరించసాగారు. 1914 నాటికి ఒట్టోమన్ సామ్రాజ్యంక్రింద ఉన్న మహమ్మదీయులు, తురుష్కులు, ఈజిప్టియన్‌లు, అరేబియన్ పెనిన్సులా వాసులు. ఒట్టోమన్ తురుష్కులు తర్వాత తర్వాత ముస్లిం లయారు. ఒట్టోమన్ తురుష్కులు మొదట ఇల్లు వాకిలి లేక పశువుల మందల గాచుకొని తిరిగే రకం. గోబీ ఎడారులలో తిరుగుతూ ఉండేవారు. టార్టారులు వచ్చి అనాటోలియా వరకు తరిమారు. అచ్చట వీరు స్థిర నివాస మేర్పరుచుకొని ఇస్లాం మతం స్వీకరిం

* **The Jewish problem. —George Sacks**

చారు. తర్వాత ఒక మహా సామ్రాజ్యాన్ని నిర్మించారు. పర్షియాఘాతం నుండి అరేబియా వరకు గల భూముల నన్నిటినీ, ముస్లిం రాజ్ క్రిందికి తీసుక వచ్చారు. అదే ముస్లిం టర్కిష్ సామ్రాజ్య మయింది.

కాని వాల్టైర్ చెప్పినటుల అది ముస్లిమూ గాదు—టర్కిషూ కాదు-సామ్రాజ్యమూ కాదు. ఎందుకంటే, అధిక సంఖ్యాకులయిన ముస్లిములు, సామ్రాజ్యానికి బయట నున్నారు. సామ్రాజ్యంలో ముస్లిములు కాని క్రిస్టియన్లు, బాల్కన్ - ఆసియా మైనర్ వాసులూ ఉన్నారు. సామ్రాజ్యమెందుక్కాదంటే—సామ్రాజ్యాధికారానికి లొంగకుండానే క్రైస్తవులు ప్రభుత్వపు 'చర్చి'లను నిర్మించేవారు. క్రిస్టియన్ వర్తకులుకూడా సామ్రాజ్యానికి లొంగకుండానే తమ 'కాన్సల్స్' సలహాల ననుసరించే తిరిగేవారు. ఇక టర్కిష్ ఎందువలన కాదంటే, విజ్ఞానమూ, సాహిత్యమూ అరబ్బులవి. 'లా' అనేది ఒట్టోమన్ టర్కులచేతిలో గాక—భగవంతునిచేతిలో—అంటే 'కొరాన్'లో చెప్పినటుల—'ఉలేమా' వ్యాఖ్యానించినటుల ఉండేది.

ఒట్టోమన్ సామ్రాజ్యాన్ని ఈ నిర్వీర్యతనుండి రక్షించాలని రెండవ అబ్దుల్ హమీద్ (1879—1909) ప్రయత్నించాడు. తాను కాలిఫ్ననీ, సుల్తాన్ననీ ఎన్నో చెప్పాడు. కాన్స్టంటినోపిల్ నుండి మదీనా వరకు రైల్వేని నియమించాడు. అనేక దేశాలనుండి హెడ్ జాజ్ పవిత్ర పట్టణాలకు వేలకొలది మహమ్మదీయులు వస్తూ ఉండేవారు. అయినా సుడాన్లో మహదీ, మధ్య అరేబియాలోని వాహాబీ అనే మత సంస్థలు ఒక విధముగా తిరుగబడ్డాయని చెప్పవచ్చు. ఒట్టోమన్ సామ్రాజ్యాన్ని ముస్లిం కేంద్రంగా చేయాలన్న ప్రయత్నాలు విఫలమయ్యాయి.

అరబ్ స్వాతంత్రోద్యమం.

గత శతాబ్దపు మధ్య కాలమునుంచి అరబ్బు స్వాతంత్రోద్యమము పెరుగజొచ్చింది. పాశ్చాత్యులయిన మత గురువుల విద్య, దీనికి కొంత తోడ్పడింది. తర్వాత తమ చరిత్ర విజ్ఞానాలలో కల్గిన అసక్తి (ఐర్లండులోవలె) దీనిని వృద్ధి పరిచింది. అయితే ప్రపంచ మహా యుద్ధం సంభవించేవరకు ఈ ఉద్యమం వెనుక ప్రజా సామాన్యం లేదు. కాని పట్టణ ప్రజలూ, మేధావులూ దీనిని ప్రోత్సహించేవారు. అరేబియన్ భాష మాట్లాడే ప్రజల రాజ్యం ఒకటి ఏర్పరచాలని ఈ ఉద్యమ ఆశయం. పారిస్లోనున్న ప్రవాసులగు యువక తురుష్కులు, పాశ్చాత్య పద్ధతుల పైన, ఒట్టోమన్ సామ్రాజ్యాన్ని పునర్నిర్మించాలని తలచారు. వారు ఫ్రెంచి పద్ధతులమీద 'డెమాక్రటిక్ ఎంపైర్' (ప్రజా స్వామ్య సామ్రాజ్యం) నిర్మించాలనీ, దానిలో క్రిస్టియన్లు, ముస్లింలూ, యూదులూ, తురుష్కులూ, అరబ్బులూ, బాల్కన్లూ ఉండాలనీ కలలు గన్నారు, 1908 లో ఈ కల నిజమయింది. "ఐకమత్యం, అభివృద్ధి" అనే ఒక సంఘాన్ని నెలకొల్పి 'సాలోనికా'లో తిరుగబడ్డారు. అబ్దుల్ హమీద్ లొంగిపోయాడు. అందరూ ఆశ్చర్య పడ్డారు. యువక తురుష్కులు ప్రభుత్వానికి వచ్చారు. ఇదొక విధంగా ప్రాతినిధ్య ప్రభుత్వం అనవచ్చు. ఇదే అరబ్ దేశాల రాష్ట్ర ప్రభుత్వానికి (ప్రొవెన్షియల్ అటానమీ) కూడా దారితీస్తుందని తలచారు. కాని, వీరిపై తిరుగుబాటు జరిగింది.

బల్గేరియా తాను స్వతంత్ర్య రాజ్యమని ప్రకటించింది. గ్రీస్, క్రీటీని పట్టుకొంది. ఆస్ట్రియా, బోస్నియాను - హెర్జి గోవినాలను పట్టుకొంది. ఇటలీ ట్రిపోలీని పట్టుకొన్నది. ఈ విధంగా, ఒట్టోమన్ సామ్రా

జ్యము క్రిందనున్న, యూరప్ దేశాలగు సెర్బియా, గ్రీస్, రుమేనియా, బల్గేరియాలు తిరుగబడ్డాయి. ఈ దేశ ప్రజలు ఆర్థికంగా - రాజకీయంగా ఉన్నతస్థితికి వచ్చారు. యూరప్‌లోని ఇతర దేశాలవలెనే ఉన్నత స్థితికి వచ్చారు. ఈ దేశాలవారు జాతీయ ప్రభుత్వాలను స్థాపించారు. కాని ఈ స్వాతంత్ర్యం నామమాత్ర స్వాతంత్ర్యమే.

ఇక ఒట్టోమన్ సామ్రాజ్యం క్రిందనున్న ఆఫ్రికన్ ప్రదేశాలు—మొరాకో, ట్యూనిస్, అల్జీర్స్, ట్రిపోలీ—ఆర్థిక స్థితి దుర్భరంగా ఉన్నది. జాతీయోద్యమంకూడా బాగా వృద్ధి కాలేదు. అందుచేత ఇతర సామ్రాజ్యాలు వీటిపై బడి ఆక్రమించుకొన్నాయి. 'ఆక్రమించి 'రక్షించ' మొదలు పెట్టినాయి. ఫ్రాంసు, ఇటలీల చేతిలోఇవి పడినాయి.ఇక ప్రత్యేక ప్రాముఖ్యత గల ఈజిప్టు, సిప్రస్, ఏడెన్, బ్రిటిషువారి చేతిలో పడినయి.

యూరప్ దేశాల స్వాతంత్ర్యత, అరబ్బులకు ప్రోత్సాహమిచ్చింది. సామ్రాజ్యవాద మంటే అరేబియాను తురుష్క మయం గావించడమనీ, తురుష్క కఠిన పరిపాలన యనీ తలచారు 'గ్రేట్ పెనిన్సులా'లో నాల్గు వైపులా తిరుగబడటానికి కుట్రలు సలిపారు. మెస్పొటామియా, డెమాస్కస్‌లలో రహస్య సంఘాలు పనిచేయసాగాయి. 'సిరియన్ అటానమీ'కి మరొక సంఘం పనిచేయసాగింది. మెక్కాలో, గ్రాండ్ షెరీఫ్-హుస్సేన్, అరేబియాకు షెరీఫ్ రాజ్యం సంపాదించాలని కలలు గంటున్నాడు.

తురుష్కేతరులను అణచడంతో పరిస్థితులు విషమించాయి. పీల్ కమీషన్ రిపోర్టు ఇలా చెబుతుంది. "ఆవిధంగా అరబ్ జాతీయోద్యమం రహస్యంగా పనిచేయవలసి వచ్చింది. 1909 నుండి కాన్స్టాంటినోపిల్, కైరో, డెమాస్కస్, బీరట్—లలో రహస్య సంఘా లేర్పడినయి.

1913 లో ఒక అరబ్ కాంగ్రెస్ జరిగింది. అరబ్ ప్రజా సామాన్య విప్లవాన్ని వీలు కలిగినపుడు లేవదీసి, డమాస్కస్‌ను ప్రధాన నగరం (కేపిటల్)గా పెట్టుకొని 'ఫ్రీ యునైటెడ్ అరబ్ స్టేట్' (సంయుక్త స్వాతంత్ర్య అరబ్ రాజ్యం)ను నిర్మించ దలచారు."

వీటి ఫలితం పైననే చెప్పాం. ఈ జాతీయ చైతన్యముయొక్క ప్రథమ చిహ్నం 1916-18 తిరుగుబాటులో స్పష్టమవుతున్నది. ముఖ్యంగా అరేబియా, ట్రాన్స్‌జోర్డనియాలోని వెనుకబడ్డ జాతులు (Bedowin) తిరుగుబాటు సాగించారు. కొంతమంది వ్యక్తిగతంగా సిరియావాసులు కూడ పాల్గొన్నారు. తక్కిన వారిలో ఈ తిరుగుబాటు ప్రోత్సాహమిచ్చింది. "సిరియన్ జాతీయ వాదులు రాజద్రోహ చర్యలు గావించేవారు. అందుకు కొందరికి లభించిన బహుమానం ఉరికంబాలు."

టర్కిష్ సామ్రాజ్య వాదం యొక్క ఈ నిరంకుశత్వం, టర్కీ-జర్మనీ తరఫున ప్రపంచ యుద్ధంలో చేరడము అరబ్ స్వాతంత్ర్య ఉద్యమానికి దోహద మిచ్చింది. కాని అరబ్బు ప్రజా సామాన్యం తిరుగుబాటులో పాల్గొని,దాన్ని జయప్రదంగా కొనసాగించేటంత చైతన్యవంతులు కాలేదు. అందువలన మరల బ్రిటిషు, ఫ్రెంచి సామ్రాజ్య వాదాలు సాదీ అరేబియా తప్ప తక్కిన రాజ్యాలకు టర్కీనుండి విడదీసి తామే ఆక్రమించు కొన్నాయి.

ఈ సామ్రాజ్యాల విజయానికీ, తురుష్క సామ్రాజ్య పతనానికీ కారణం చూద్దాం : మెస్పొటోనియా, ఇరాక్‌లు—ఇండియా నుండి దాడి వచ్చిన బ్రిటిషువారిని తీవ్రంగా ఎదుర్కొనలేదు. డెమాస్కస్,సిరియన్‌వాసులు టర్కిషు మిలటరీకి లొంగి ఉన్నా సమయానికి వేచియున్నారు, నెజ్‌ద్‌లో

ఇబాన్‌సాద్ బ్రిటిషువారి లంచం తీసుకొని తటస్థంగా ఉన్నాడు. ఇలాంటి పరిస్థితిలో హుస్సేన్ (మెక్కా షేరీఫ్) సహాయం చేస్తానన్నాడు. కాని, మొదట బ్రిటిషువారు తిరస్కరించారు. డార్డినెల్లీస్‌గుండా, కాన్స్టాన్టినోపిల్‌ను బ్రిటిషువారు ఎదిరించారు. అయితే, టర్కీని రక్షించడానికి ఒక నాయకుడు వచ్చాడు. అతడే ముస్తఫా కెమల్ పాషా. కెమల్ పాషా ఇంగ్లీషు వారిని వెనక్కి తరిమి, సుల్లా, డార్డినెల్లిస్‌లను రక్షించు కొన్నాడు. *టర్కీ రక్షింపబడ్డా, టర్కిష్ సామ్రాజ్యం ఒట్టోమన్ సామ్రాజ్యం కూలిపోయింది.

* Post war World —J. H. Jackson

౪

కుటిల వాగ్దానాలు

పాలస్టయిన్ పట్లను, ఇతర ఆరబ్ దేశాల పట్లను ప్రపంచ సంగ్రామంలో బ్రిటన్ అవలంబించిన రాజనీతి క్రింద రెండు విషయాల వలన తేటతెల్లమవుతుంది.

(1) ప్రాచ్య దేశాలలో యుద్ధాన్ని జయించవలసిన ఆవశ్యకత.

(2) బ్రిటిషు వర్తక రహదారులను సాధ్యమైనంత గట్టిగా రక్షించుకొనేందుకు, యుద్ధానంతరం ఆరబ్ దేశాలను పునర్నిర్మాణ మొనర్చుటకు అవకాశం.

ఈ రెండు విషయాలు జ్ఞప్తియందుంచుకొంటే, బ్రిటన్ కపట స్వార్థ నాటకం బయటపడుతుంది.

హుస్సేన్—మెక్ మహన్ ఉత్తర ప్రత్యుత్తరాలు.

1915 లో ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. దీని తర్వాత రెండేండ్లకు బాల్ఫర్ డిక్లరేషన్ వెలువడింది.

సర్ హెన్రీ మెక్ మహన్ ఆ రోజులలో ఈజిప్టుకు హై కమీషనర్. హుస్సేన్ మెక్కాకు గవర్నరు. మత గురువులగు షెరీఫ్ కుటుంబానికి పెద్ద. వీరి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల ఉద్దేశ్యం ఇది.

మిత్రమండలికి వ్యతిరేకంగా జరుగుచున్న పవిత్ర యుద్ధం (జిహాద్)లో హుస్సేన్ పాల్గొనకుండా ఉండటం, ఇండియాలోను, ఇతర స్థలాలలోను, ముస్లిముల సానుభూతిని సంపాదించి పెట్టడం. ఈ పవిత్ర యుద్ధం, సుల్తాన్-కాలిఫ్‌చేత మిత్రమండలికి వ్యతిరేకంగా కాన్స్టాంటినోపిల్ వద్ద ప్రకటింపబడింది.

(2) అరబ్బు జాతులలో తిరుగుబాటు లేపదీసి, డమాస్కస్‌కు దక్షిణంగా నున్న టర్కిష్ రహదారులకు దెబ్బగొట్టించడం.

అరబ్బుల ఉద్దేశ్యం ప్రపంచ మహాయుద్ధానంతరం తమ స్వాతంత్ర్యాన్ని మిత్రమండలి గుర్తించాలని. అందుకోసమే హెడ్‌జాజ్‌లోను, సిరియాలోను, తురుష్కులకు వ్యతిరేకంగా పోరాడారు. అరబ్బులను తిరగబడమని మెక్ మహన్ షెరీఫ్‌ను అడిగాడు. దీనికి బదులుగా షెరీఫ్ యావత్ అరేబియన్ పెనిన్సులా (ఏడెన్ తప్ప) స్వాతంత్ర్యాన్ని గుర్తించాలన్నాడు. కొంత సంప్రదింపులు జరిగాక హుస్సేన్ మరికొన్ని అవకాశాలు ఇచ్చాడు. బస్రా—బాగ్దాద్, అలెప్పో—బీరట్ రాష్ట్రాలలో బ్రిటిషు, ఫ్రెంచి సామ్రాజ్యాల స్వార్థాన్ని హుస్సేన్ గుర్తించి తాత్కాలికంగా విడిచిపెట్టాడు. బ్రిటిషు గవర్నమెంటు తరఫున హెన్రీ మెక్ మహన్ ఇలా వాగ్దానం గావించాడు.

"మెక్కా షెరీఫ్‌చే నిర్ణయింపబడిన (ప్రపోజ్ చేసిన) సరిహద్దులలోను—లిమిట్సులోను ఉన్న ప్రదేశంలోని అరబ్బుల స్వాతంత్ర్యాన్ని గుర్తించి ప్రోత్సహిస్తాం." ఇది 1915 అక్టోబరు 25 వ తేదీన జరిగింది. కాని ఈ వాగ్దానం ఇదమిత్థమని ఖచ్చితముగా లేదు. ఎచ్చటి నుండి ఎచ్చటికో ప్రదేశ నిర్ణయంలేదు. ఈ వాగ్దానానికి వ్యాఖ్యానం గావిస్తూ 1922 లో చర్చిల్ అరబ్ ప్రతినిధులకు ఇలా చెప్పాడు. "అరబ్ స్వాతంత్ర్యంలో పాలస్టయిన్ మాట లేదు." ఈ విషయాన్నే కొందరు బలపరుస్తున్నారు.

"అరబ్బులకు అనేక వాగ్దానాలు గావింపబడినా, దేనిలోనూ పాలస్టయిన్‌ను చేర్చలేదు. హుస్సేన్—మెక్‌మహన్ రాయబారాలలోగాని; పారిస్‌లో జరిగిన పీస్ కాన్ఫరెన్సులో ఎమిర్ ఫీసల్, డాక్టర్ వీజ్‌మన్‌లు వ్రాసిన మెమొరాండములోగాని, స్వాతంత్ర్య వాగ్దానం కావింపబడిన అరబ్బు రాష్ట్రాలలో పాలస్టయిన్ లేదు.* ఇలా వ్యాఖ్యానించగలనని ధైర్యంవలననే పాలస్టయిన్ కాన్ఫరెన్సులో, హుస్సేన్—మెక్‌మహన్ ఉత్తర ప్రత్యుత్తరాలను ప్రకటించుతామని ఛేంబర్లేను ధైర్యంగా చెప్పాడు। అయినా ఒక విషయం స్పష్టం. పీల్ కమిషనన్ రిపోర్టు ఇలా వ్రాసింది.

"1905 లోని హెడ్‌జాజ్ విప్లవానంతరమూ, విప్లవానికి పూర్వం కూడా మిత్ర మండలి జయిస్తే, అరబ్ స్వాతంత్ర్యంలో పాలస్టయిను కూడ కలుపబడుతుందని అరబ్బులు తలచారు."

అరబ్బుల సహాయంతో—అరబ్బుల కిరీటంలేని రాజన దగిన లారెన్సుచే నడపబడి, జనరల్ ఎల్లెన్‌బీ 1917 డిసెంబరులో జెరూసలంను

* **Jewish Problem :-Louis Golding**

వశపఱుచుకొన్నాడు. ఈ సహాయానికి వారి ఉద్దేశ్యము పాలస్టయినుకు స్వాతంత్ర్యం లభించుతుందనే. మెక్‌మహాను వాగ్దానములో పాలస్టయిను కూడా ఉందని అరబ్బుల వాదన * మెక్‌మహన్ వాగ్దానాన్ని లార్డు బాల్ఫర్ 1918 లోను, లార్డు కర్జన్ 1919 అక్టోబరు 9 వ తేదీన, బలపఱచారు. కాని ఎన్ని సార్లడిగినా, ఎంతమంది పార్లమెంటు సభ్యులు అడిగినా, ఈ ఉత్తర ప్రత్యుత్తరాలను బయటపెట్టడానికి, బ్రిటిషు ప్రభుత్వము పూర్వం నిరాకరించింది,

హుస్సేను—మెక్‌మహాను ఉత్తర ప్రత్యుత్తరాలలో ఒక విషయం స్పష్టం. అరబ్ జాతీయోద్యమాన్ని ఉపయోగించుకొని, అరబ్బు నాయకులకే వేవో సందేహాస్పదమైన వాగ్ధానాలు గావించి, యుద్ధంలో తన లాభాన్ని చూచుకోవడం.

కాని ఆరబ్బులు స్వాతంత్ర్యానికి తగుదురా ? తగరా ? అని ప్రశ్న కాదు. వాగ్దానాలలో పాలస్టయిన్ ఉన్నాదా, లేదా, అనే ప్రశ్నకూడ కాదు. అరబ్బుల స్వాతంత్ర్యం, మెక్ మహన్ వాగ్దానాలపై గాని, మరే ఇతర సామ్రాజ్యవాదుల వాగ్దానాలపైన గాని ఆధారపడి ఉండదు. 'స్వాతంత్ర్యం ప్రతివానికీ జన్మహక్కు' అలాగే ఆరబ్బు ప్రజలకు-తదితర బానిస ప్రజలవలెనే స్వాతంత్ర్యం సంపాదించుకొని, తమ కవసరమైనట్టి ప్రభుత్వ విధానాన్ని అమలుపరచుకొనుట వారి జన్మ హక్కు.

అరబ్బులకు గావింపబడిన ద్రోహాన్ని టి. యి. లారెన్సు గ్రంధము పూర్తిగా తెలుపుతుంది. హుస్సేన్—మెక్‌మహన్ ఉత్తర ప్రత్యుత్తరాలేపైనా, టర్కీకి వ్యతిరేకంగా మిలటరీ సహాయం గావించినందుకు అరబ్ రాజ్యమో—రాజ్యాలో నిర్మిస్తే, బ్రిటను సహాయం చేయడం అని

* The Palestine. Arab cause —Dr. Med. T. Canaan

అందరూ తలచారు. లారెన్సు, యుద్ధానికి పూర్వం గిల్బర్ట్ క్లేటన్‌చే నడుపబడిన ఇంగ్లీషుసైన్యానికి చెందినవాడు. ఇతని ఉద్దేశ్యంలో యుద్ధానంతరం, నామమాత్ర స్వాతంత్ర్యం అరబ్బుల కిచ్చి, బ్రిటన్‌తో సహకారముండేటట్లు చేయాలని. లారెన్సు ప్రపంచయుద్ధంలో పూర్తిగా బ్రిటిషువారి ఏజంటు. అతడు వ్రాసిన **"Seven Pillars of Wisdom"** అనే గ్రంథంలోని ఈ క్రింది వాక్యాలు చూడండి.

'అకాబా' ముందు ఇవిగో పండ్లు—చేదు పండ్లు ఉన్నాయి. ఇవే తిరుగుబాటుకు దారితీస్తాయి నేను తప్పుడు నటనలతోను అరబ్బులను ఉద్రేకపరచసాగాను."

(378 వ పేజీ)

"మేము మిత్ర మండలి కోసం పోరాడుతున్నది నిజమే. అరబ్బులు కూడ భాగస్థులే. కాని తుది దశలో అవసరమైతే వారిని బలిగావించాలి." (386 వ పేజీ)

"నేను అరబ్బులలో అంటరానివానిగా ఉండటం భరించలేకపోయాను. ఇంటివైపుకు గాలి మళ్ళింది. అక్కడ ఉండగా నేను వారి ఉన్నతాశయాలను, స్వాతంత్ర్య పిపాసను, ఉపయోగించుకొని ఇంగ్లీషువారు జయించడానికి మరొక సాధనాన్ని సమకూర్చాను." (544 వ పేజీ) *

<u>బాల్ఫర్ డిక్లరేషన్</u>

1917 నవంబర్ బాల్ఫర్ డిక్లరేషన్ ప్రకటించబడింది. అప్పటికింకా యుద్ధఫలితాలు ఎలాఉంటాయో తెలియదు. ఆ ప్రకటన ఇది.

"పాలస్టయిన్‌లో యూదులకు 'నేషనల్ హోం' స్థాపించటానికి హిజ్ మెజస్టీ ప్రభుత్వం అనుకూలంగా ఉంది. ఈ ఆశయాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం తన శాయశక్తులా ప్రయత్నించగలదు. అయితే దీని అర్థం పాలస్టయిన్‌లో నివసించుచున్న ఇతర జాతుల పౌరసత్వ హక్కు

* who is prosperous in Palestine —British Recident.

లకు గానీ, మత హక్కులకు గానీ నష్టం కల్గించేటట్లు ప్రవర్తించదనీ, ఏ యితర దేశాలలో యూదులు అనుభవించే రాజకీయ (స్టేటస్), హక్కు లకుగాని నష్టం కల్గించేటట్లు ప్రవర్తించదనీ శుభ్రంగా అర్థంచేసుకోవాలి."

ఈ ప్రకటన విషమ పరిస్థితులలో యూదుల సహకారాన్ని కాజేయ డానికే ప్రకటించబడింది. పీల్ కమీషన్ ఇలా చెబుతుంది. "యూదుల సానుభూతి ఉండటమో, ఉండకపోవడమో, మిత్ర మండలి ఆశయాలకు తగిన ఫలితం కలుగజేస్తుంది. ముఖ్యంగా యూదుల సహకారం ఉంటే, అమెరికను యూదులసహకారం మిత్రమండలికి లభించుతుంది. అందుచేత జర్మనీ తన సైనిక బలాన్ని తగ్గించడానికి వీలుండక, ప్రాచ్య దేశాలలో జర్మనీ ఆర్థిక స్థితి బాగుపడుట కష్టమవుతుంది."

ఈ ప్రకటనను మిత్ర మండలి ప్రభుత్వాలు ఒప్పుకొనుటే గాక 'పీస్ కాన్ఫరెన్సు' కూడ అంగీకరించింది. ఇదొక విధంగా బ్రిటిషువారు, యూదులు చేసిన ఉపకారానికి ప్రత్యుపకారమని చెప్పడానికే,ఉపయోగిస్తుంది. సంగ్రామక్లిష్ట దినాలలో,డాక్టర్ వీజ్‌మన్ (యూదులు నాయకుడు) కొయ్య నుండిసారా తీసే విధానం కనిపెట్టి బ్రిటిషువారికి సాహాయం చేశాడు.దానికి ప్రతిఫలంగా 'యుగండా'ను ఇస్తామన్నారు. కాని వీజ్‌మన్ పాలస్టయినే కావాలని పట్టుబట్టాడు. లాయడ్ జార్జి ఒకానొకప్పుడు ఈ విషయాన్ని అంగీకరించాడు. ఈ ప్రకటన ఫలితం వృధా కాలేదు. ప్రపంచంలోనుండి అనేక ప్రాంతాలనుండి యూదులువచ్చి బ్రిటిష్ సైన్యాలలో చేరారు. పూర్తిగా ఒక యూదుల సైన్యం పాలస్టయినులో పోరాడింది. జెరూస లంను ఆక్రమించిన జనరల్ ఎల్లెన్‌బీ యూదుల పోరాట శక్తిని కొని యాడాడుకూడ.

పారిస్ పీస్ కాన్ఫరెన్సు—చరిత్రను వ్రాస్తూ, హెచ్. డబ్ల్యు. వి. టెంపర్లీ ఇలా వ్రాశాడు. "మిత్రమండలి తమ క్షేమానికై అవలంబించిన యుద్ధపుటెత్తు యిది. ధైర్యముతోను, కుశాగ్రబుద్ధితోను, రాజకీయ పరి జ్ఞానంతోను చేసిన ప్రయత్నం ఇది. జర్మనీ (సెంట్రల్ పవర్సు) వైపుకు యూదుల సహాయం పోకుండా, చేసీన పని ఇది." ఇంగ్లండు దీనిని ప్రోత్సహించడానికి కారణం ఏమిటి? టెంపర్లీ ఇలా వ్రాశాడు. "సూయజ్ కాలువ సరిహద్దు ప్రదేశాలలో, తమ క్షేమానికి అనుకూలించే ప్రజలను ఉంచడం, ఇంతేగాక ప్రపంచమందలి యూదులందరియొక్క సపోర్టును పొందడం—ఇవీ బ్రిటిష్‌వారి ఆశయాలు."

ఇక్కడ కూడా వాగ్దానంలోని షరతులు అస్పష్టంగా ఉన్నాయి. 'నేషనల్ హోం' అంటే ఎంతో స్పష్టంగా లేదు. కాని యూదులు, యూదుల 'స్టేట్'ను నిర్మించుకోగలమని తలచారు. ట్రాన్స్‌జోర్డానియాతో కూడ కలిసి పాలస్టయినులో అంతా, తమ యూదుల 'స్టేట్' నిర్మించుకో వచ్చునని భావించారు.

పీల్ కమిటీ రిపోర్టు, పై రెండు వాగ్దానాలు కూడా, ఒట్టోమను సామ్రాజ్య పీడితులగు అరబ్బులయెడనూ, జాతి ద్వేషం వలన వేటాడబడే యూదులయెడనూ, బ్రిటిషు ప్రజలకు గల సానుభూతి వలననే చేయబడినా యని తెల్పుతుంది. ఎంత దయ!

కాని అసలు విషయం అది కాదు. యుద్ధసమయంలో ఆపదనుండి రక్షించుకొనేందుకు చేయబడిన వన్న విషయం వివాదాస్పదమైన కాదు. ఒకప్రక్క యూదులు 'నేషనల్ హోం' కావాలంటున్నారు. ఇంకోప్రక్క, అరబ్బులు అరబ్ రాజ్యం స్వాతంత్ర్యం కావాలంటున్నారు. నిజానికి, బ్రిటిషు ఈ రెండింటి క్షేమమూ అవసరంలేదు. బ్రిటిషు యుద్ధ నీతి

కోసమే ఈ రెండు ప్రకటనలూ కావింపబడినాయి. బ్రిటిషు సామ్రాజ్యపు ధోరణి స్పష్టంగా తెలియజేయాలంటే, ఫ్రాంసు-ఇంగ్లండుల మధ్య జరిగిన ఒడంబడిక చాలు. ప్రాచ్యదేశాల యెడల ఈ రెండు సామ్రాజ్యా లకు గల వైఖరి స్పష్టపరుస్తుందీ ఒడంబడిక. ఆసియాటిక్ టర్కీలో తమలో తమకు గల విభేదాన్ని మఱచిపోవుటానికే సంధి గావించబడింది. దానినే "సైక్స్-పికాట్" సంధి అంటారు.

సైక్స్—పికాట్ సంధి.

ఫ్రాంసు ఇంగ్లండులు 1916 లో రహస్యంగా ఈ సంధి గావించుకొన్నాయి. 1917 లో సోవియట్ గవర్నమెంటు ఈ కుట్రను బయటపెట్టింది.

ప్రపంచ యుద్ధం ముగిసాక, తమ కనుకూలంగా అరబ్బు దేశా లను ఎలా పునర్నిర్మాణ మొనర్చాలో, తమ వర్తక రహదారుల క్షేమాన్ని ఎలా కాపాడాలో, గుర్తెరిగి వేసిన ఎత్తులు దీనివలన తెలుస్తాయి. సంధి షరతులను క్లుప్తంగా పరిశీలించుదాం.

1. హైఫానుండి కొంచెం ఉత్తరభాగం మొదలుకొని మెస్సినాకు కొంచెం పడమటి భాగం వఱకు నున్న సముద్ర తీర భాగం (ఇదివరకే కొంతవఱకు, ఫ్రెంచి మిషనరీలు, పెట్టుబడిదారుల వలన వృద్ధి కాబడిన దీ భాగం) ఫ్రాంసు అధీనంలో ఉంటుంది.

2. బ్రిటన్ క్రింద ఈ భాగాలుంటాయి.

(ఎ) హైఫా—ఆక్రీ తీరం. ఇది మధ్య ధరా సముద్ర తీరంలో నౌకా కేంద్రంగా చాల ముఖ్య భాగం.

(బి) దక్షిణ పాలస్టయిన్. ఇది సూయెజ్ కాలువకు తూర్పు బయట కోటలాగ ఉండి, అకాబాగుండా ఎఱ్ఱసముద్ర ఆక్రమణకు ఇతరులు ఉప

యోగించుకోకుండా అడ్డుపడుతుంది.

(సి) దక్షిణ ఇరాక్. పర్షియాఘాతంద్వారా హిందూదేశాన్ని ఎవరూ దెబ్బకొట్టకుండా కాపాడుకొనేందుకు, బ్రిటిష్ నూనె సప్లయిలను రక్షించుకొనేందుకు ఇది ఉపయోగపడుతుంది.

(ఈ మూడు బ్రిటిష్ సామ్రాజ్యానికి ఆయువుపట్టులు. ఈ మధ్య పీల్ కమిషను గావించిన సూచనలో (1) హైఫా-ఆక్రీతీరభాగం (2) అకాబా, ఈ రెండూ బ్రిటిష్ మాండేట్ క్రింద వుండాలని తెలిపింది.)

3. ట్రాన్సుజోర్డానియా, సిరియా, ఉత్తర ఇరాక్ లుగల తీరభా గం బ్రిటన్ కుగాని ఫ్రాంసుకుగాని అట్టే రాజకీయప్రాముఖ్యతగలది కాదు. కాబట్టి దానిని అరబ్ స్టేటుగాగాని, అరబ్ రాజ్యాలకు కూటమిగాగాని ఉంచడం. దీనికి నామకః స్వాతంత్ర్యం ఉంటుంది. పెద్ద సామ్రాజ్యాలపై ఆధారపడటం కూడా ఉంటుంది.

ఈ సంధి పాలస్టయిన్ అంటేనూ, అరబ్బు ప్రపంచం అంటేనే బ్రిటన్ కు గల అవ్యాజ ప్రేమను వెల్లడి చేస్తుంది. ఈ 20 ఏండ్లనుండి ఎలాంటి కుటిలప్రేమ, తుచ్ఛ రాజనీతిని ప్రదర్శించుతున్నారో ఈ సంధి తెలుపుతుంది.

"పాలస్టయిన్ ను బ్రిటిషువారి లాభంకోసరం పాలించడం లేదనీ;" "యూదుల, అరబ్బులమధ్య మైత్రి నెలకొల్పడానికే తామవతరించామనీ;" "పవిత్రస్థలాల భద్రత కోసరమే బ్రిటిషు తుపాకులు గురిచేసుక కూర్చుని ఉన్నామనీ;" చెప్పే బొల్లిబొల్లి కబుర్లకు అర్థంలేదని ఈ ఒడంబడిక స్పష్ట పరుస్తుంది.

బ్రిటన్ కు పూర్తి పాలస్టయిన్ అవసరంలేదు. కాని అకాబా, ఆక్రీ. హైఫా, పోర్టులు కావాలి, తీరభాగంలో బ్రిటన్ క్రింద "రాజభక్తి పరాయ [illegible]" ప్రజలు కావాలి.

౫

మాండేట్

పాలస్టయిన్‌ను, ట్రాన్స్ జోర్డానియాను పరిపాలించు అధికారం నానా జాతి సమితిచేత ఇవ్వబడిన 'మాండే'ట్ వలన లభించింది.

ఈ 'మాండేట్' ఆశయం ప్రెసిడెంటు విల్సన్ తన 14 పాయింట్లలో ఉదహరించిన అంతర్జాతీయ తత్వాన్ని ఆచరణలో పెట్టాలని. మాండేట్ ఆశయాలను గురించి పీల్ కమీషన్ ఇలావ్రాసింది. "మాండేట్ ఉద్దేశ్యం ఇది. ఆయా దేశాలకు సంబంధించిన ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా అక్రమణలు జరుగరాదు. సాధ్యమైనంతవరకు 'జాతీయ స్వయం నిర్ణయ సూత్రం' అవలంబించాలి. ప్రజలూ, రాష్ట్రాలూ, ఒక సామ్రాజ్యం నుండి ఇంకో సామ్రాజ్యానికి చదరంగంలో కాయలలాగా మార్చబడరాదు."

నానాజాతి సమితి 22 (IV)వ సూత్రంలో ఇలా ఉంది.

"పూర్వం టర్కిష్ సామ్రాజ్యానికిచెంది కొన్ని జాతులు అవి తాము స్వాతంత్రత గల్గియుండగలవను అభివృద్ధి స్థితికి వచ్చినపుడు, పరిపాలనా సలహా, సహాయం మాండేట్ ద్వారా ఆ దేశాలు ఒంటరిగా నిలబడగలవను కొనేవరకు ఇస్తూ తాత్కాలిక స్వాతంత్రాన్ని గుర్తింపవచ్చు. మాండేట్‌ను ఎన్నుకొనుటలో ఆయాజాతుల కోర్కె ముఖ్యమైనవిషయం." దాని అర్థం ఏమిటి? ఈ సూత్రాన్ని ఇలా వివరించారు.

1. తాత్కాలిక స్వాతంత్ర్యాన్ని గుర్తింపవచ్చు.

2. పరిపాలనా సలహా, సహాయం, ఈ తాత్కాలిక కాలంలో మాండేటరీ పవర్ ఈయాలి.

3. సహాయ మొనర్చే "మాండేటరీ పవర్" 'నాగరికతను రక్షించేదిగా' ఉండాలి.

4. మాండేట్ క్రింద నున్న ప్రజల కోర్కె, మాండేట్‌ను ఎన్నుకొనుటలో ప్రధాన విషయమయి ఉండాలి. ఈ చివరి విషయం చాల ప్రాముఖ్యమైనది. మాండేట్ క్రిందనున్న ప్రజలు నిజంగా అలాంటి ప్రభుత్వము కావాలన్నారా? లేక ఇపుడున్న మాండేట్లను ఆ ప్రజలే ఎన్నుకొన్నారా? ఈ రెండు ప్రశ్నలకు వచ్చే జవాబు లేదు అనే.

1936 అల్లరుల సందర్భాన జూన్ 19 వ తేదీన కామన్సు సభలో వలస దేశ కార్యదర్శి ఇలా చెప్పాడు.

"మేం పాలస్టయిన్‌ను ప్రపంచ అభిప్రాయాన్ననుసరించి మాండేట్‌గా ఉంచుతున్నాం. అన్ని దేశాలకన్నా, పాలస్టయిన్ అంటే ప్రపంచానికి అనేక విధాల విశ్వాసాలున్నాయి. మేం పాలస్టయిన్‌ను, మాండేటరీ

పవర్‌గా, న్యాయంతోను, సమానతతోను, యూదులను—యూదేతరులను పరిపాలించుతాం." లాయడ్ జార్జి—ఆరంస్‌బీ—గోర్స్‌లు ఆ నాడేమన్నారో చూడండి. "మేం మా సామ్రాజ్య రక్షణ కోసం పాలస్టయినులోని తిరుగుబాటును అణచడం లేదు: మాండేట్ కోసం—మాండేట్ నానా జాతి సమితికి పవిత్రమైన మా వాగ్దానం. మా వాగ్దానాన్ని భంగపఱచ మంటారా," ఇలాంటి పవిత్ర ఆశయాలు పేరు పెట్టుకొని పాలస్టయిన్‌ను ఎందుకు అణచిపెట్టుతున్నదీ ఇదివఱకే తెలియాజేశాం. మాండేట్ అనేది ఒక జాతి, తనను తాను పరిపాలించుకొనే శక్తి వచ్చేవరకు దానిని రక్షించి, తోడ్పటం, కాని స్వపరిపాలన అడిగితే, ఆ తిరుగుబాటును అణచడం కాదు.

బ్రిటిష మాండేట్‌రీ అధికారం

మాండేట్‌ను ఎన్నుకొనడంలో ప్రజాభీష్టం అవసరమని జాతి సమితి సూత్రంలో ఉన్నది. కాని ఈ విషయంలో పాలస్టయిన్ ప్రజలను సంప్రదించలేదు. పీల్ కమీషన్ ఇలా చెప్పింది. "ప్రెసిడెంటు విల్సన్ సిరియా పాలస్టయిన్ ప్రజల అభిప్రాయం కనుక్కొనేందుకు 'ఇంటర్ ఎల్లీడ్ కమిషన్' ఒకటి పంపాలని పట్టు బట్టాడు, కాని అది విఫలమైంది. చివరకు ఒక అనధికార కమీషన్‌ను పంపాడు. 1919 జూన్—జులైలలో ఈ రెండు దేశాలలో కమీషన్ తిరిగింది. సిరియా, పాలస్టయిన్‌లకు సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలన్నారని రిపోర్టు వ్రాసింది, అంతగా తమను జాగరూకతగా చూడాలిసివస్తే (సూపర్ విజన్) మొదటి ఎన్నిక అమెరికా అని, తప్పితే బ్రిటన్ అని అన్నారు.

జియోనిస్టు సంస్థ అయిన అమెరికా యూదుల కాంగ్రెసు, బ్రిటన్ ట్రస్టీగా ఉండాలని కోరింది." 'ఇది ప్రపంచ మందలి యూదు లందరి కోరిక' అంటూ కాంగ్రెస్ అన్నది. నానాజాతిసమితి కూడా "(సంబంధించిన) ప్రజాభిప్రాయానుసారంగా" బ్రిటను మాండేటుగా ఉండాలని నిర్ణయించింది. కాని ప్రంపచయూదులు 'సంబంధించిన ప్రజలు' కారు. పాలస్టయిన్‌కు సంబంధించని, ఎవరో యూదులు, పాలస్టయిన్ భవిష్యత్తును నిర్ణయించడం ప్రజాస్వామ్య ప్రియు డెవడూ సహించరానిది. పాలస్టయినుకు కావలసిన ప్రభుత్వాన్ని నిర్ణయింపవలసింది పాలస్టయిన్ ప్రజలు; అంటే ముస్లిం అరబ్బులు, క్రిస్టియన్ అరబ్బులు, పాలస్టయిన్ యూదులు. వీరి కోర్కె సిరియా, పాలస్టయిన్‌లకు సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని. ఒకవేళ మాండేటరీ అధికారాన్ని కోరినా, అది అమెరికాను కాని, బ్రిటనును కాదు. కాబట్టి బ్రిటన్ 'మాండేట్' కావడం అంతర్జాతీయ నీతికి విరుద్ధం. ఇది ప్రజాభిప్రాయమే అనడానికి ఒక వంక దొరకకపోలేదు. 1919 జనవరి 3 వ తేదీన ఎమిర్ ఫీసల్ (మెక్కా షెరీఫ్) పారిస్ శాంతి సభలో, ఒక సంధిపత్రంపైన సంతకం చేసాడు. డాక్టర్ వీజ్‌మన్ జియోనిస్టు సంస్థ తరపున సంతకం చేశాడు. దానిలో అరబ్బులే 'ట్రస్టీ' లాగా ఉండాలని సూచించాడు. రెండు పార్టీలు, ఆరబ్ స్టేట్‌కు; పాలస్టయిన్‌కు సహకారానికి; బాల్ఫర్ డిక్లరేషన్ అంగీకారానికి; యూదులు వేల కొలది రావడానికి; వారి భూసమస్యను త్వరగా తెమల్చడానికీ; సంతకము చేశారు. కాని ఈ ఒడంబడిక అమలు జరపాలంటే అరబ్బులకు స్వాతంత్ర్యము (అంటే ఇతర అరబ్బు ప్రపంచంలో ఒక స్వాతంత్ర్య రాజ్యం) ఇస్తామన్న వాగ్దానం పూర్తిచేయాలి. ఈ షరతును ఫీసల్ పీస్ కాన్ఫరెన్సులో తెలియజేశాడు. *

* Palestine Peace or Terror

మనం చూస్తూనే ఉన్నాం. ఇంతవరకు అరబ్బు స్వతంత్ర రాజ్యం ఏర్పడనే లేదు. 1920 ఆగస్టులో ఫీసల్‌ను, సిరియా అరబ్బు ప్రభుత్వాన్ని, జనరల్ గౌరాడ్ నాయకత్వం క్రింద ఫ్రెంచి సైన్యాలు దాడి సల్పి తరిమివేశనాయి. వీరినిడమాస్కస్ నుండి బయటకుతరిమారు. ఆయుధ బలంతో సిరియా ఫ్రెంచి మాండేట్ క్రిందకు వచ్చింది. ఫీసల్....వీజ్‌మన్ సంధికి పైన చెప్పినట్లు ఫీసల్ ఒక షరతు పెట్టాడు. "మార్పులు చేస్తే, ఈ సంధిని ఆమలుపరచకుండా ఉండటానికి బాధ్యుణ్ణి నేను కాదు." అని మొదటనే షరతు పెట్టాడు. పీల్ కమీషన్ రిపోర్టు కూడా ఇలా చెప్పింది. "ఫీసల్—వీజ్‌మన్ ఒడంబడిక అమలు జరుగదు; దానికి పెట్టిన షరతును (అరబ్బుల స్వతంత్ర రాజ్యం) పూర్తి చేయలేదు."

ఫీసల్‌ను, అరబ్బు నాయకునిగాను, తర్వాత రాజుగాను బ్రిటను గుర్తించింది. కాని అతనికి అరబ్బు ప్రజల స్వాతంత్ర్యాన్ని అమ్మే హక్కు ఉందా? ఇటు బ్రిటిషు అధికారం గాని, అటు ఫ్రెంచి అధికారం గాని, అరబ్బు ప్రజలు కోరుకొంటే రాలేదు. సైనిక బలం, సామ్రాజ్యాధికారం, పాలస్టయిన్ సిరియాలకు మాండేట్‌ను రుద్దినాయి: టర్కిషు యజమాని పోయి, బ్రిటిషు యజమాని వచ్చాడు. తురుష్క ప్రభుత్వంలోని నీచమైన అధికారానికి బదులు, బ్రిటిషువాళ్ళ నైపుణ్యంతో గూడిన నిరంకుశత్వము వచ్చింది.

బ్రిటిషు మిలటరీ అధికారుల చేతులలో నున్న పాలస్టయిన్‌ను, నానాజాతిసమితి 'మాండేట్'గా ఇచ్చామని చెప్పి సంతృప్తి పడింది.

మాండేటరీ అధికారం, స్వరిపాలన ఈయలేదు సరిగదా, దానికి దోహదంకూడా ఈయలేదు. అరబ్ స్వాతంత్ర్యోద్యమం హెచ్చినకొలదీ, నిరంకుశ పరిపాలన హెచ్చింది. మామూలు పౌరసత్వ హక్కులు పోవ

డమే గాక, నేడు 'మార్షల్‌లా' పాలస్టయిన్‌ను ఏలుతోంది. ట్రస్టీ షిప్ అనేది బూటక మయింది. నానాజాతిసమితి ఏర్పరచిన "పర్మనెంటు మాండేట్సు కమీషన్" నిర్వీర్యమైపోయింది. అది సూచనలు గావించుటా లేదు, దాని ప్రాతినిధ్యమూ నశించింది. అశాంతి ప్రబలిన దేశాలలో తిరిగి రిపోర్టు చేసే అధికారం కూడా నశించింది. 1925 లో సిరియా స్వాతంత్ర్యోద్యమాన్ని అణచిన ఫ్రాంసుపై గాని, 1936 లో పాలస్టయిన్‌ను రక్తస్రవంతులతో నింపిన బ్రిటన్‌ను గాని విచారించిన పాపాన పోలేదు. నానాజాతిసమితి నిర్మించిన న్యాయాన్నైనా పాలించడం లేదు బ్రిటన్. అసలు నానాజాతిసమితినుండి న్యాయాన్ని కోరడంలో అర్థ మేముంది? అందుకనే రష్యా ఒకప్పుడు నానాజాతిసమితిని "లీగ్ ఆఫ్ రాబర్స్" (బందిపోటు దొంగల గుంపు) అని అన్నది.

౬

బ్రిటిషు పరిపాలన

బ్రిటిషు సాయుధ సైనికులు ఆక్రమించిన పాలస్టయిన్ తరువాతి చరిత్ర ఏమిటి? ఈ 20 ఏండ్లలోను బ్రిటిషు పరిపాలనా ఫలితం ఏమిటి? వీటికి జవాబు, అరబ్బుల కన్యాయమూ. యూదుల యెడ పక్షపాతమూ చూపి. తమ సామ్రాజ్యాన్ని రక్షించుకొనుటయే.

యూదుల దిగుమతి.

1920 నుండీ బ్రిటిషువారి సహాయంతో యూదుల దిగుమతి హెచ్చు సాగింది. దొంగతనంగా కూడ పాలస్టయిన్‌లో ప్రవేశించేవారు యూదులు. అన్ని యుగాలలోను, యాత్రికులు (యూదులు) పాలస్టయిన్‌కు వెళ్ళడం- కొన్నిసమయాలలో ప్రార్థనకైనా—ఎక్కువగా అక్కడ ఉండిపోవడానికే.

* The Jewish Problem - Louis Golding

ప్రభుత్వ అనుమతి పొంది ప్రవేశించిన యూదులు.

1933 లో 32,000
1934 లో 42,500
1935 లో 61,500

ఇది గాక ప్రతి యేటా 15 వేలమంది పాలస్టయిన్ వచ్చేవారు. ఈ మూడేండ్లలోను మొత్తం 180,000 మంది పాలస్టయిన్ వచ్చారు. అంటే సంవత్సరానికి 60 వేలమంది వచ్చారు. 1922 సెప్టెంబరు ఒకటవ తారీఖుకు పాలస్టయిన్‌లో నున్న యూదుల సంఖ్య 158,000. 1935 సంవత్సరములో 375,000 మంది: 13 *సంవత్సరాలలో నూటికి 237 చొప్పున వచ్చారన్నమాట. 1919 నుండి 1938 కి 300,000 మంది యూదులు దిగుమతి అయ్యారని మరొక లెక్క-

భూముల అమ్మకం.

యూదులు వచ్చి పాలస్టయిన్‌లో భూములు కొనడంవలన కొంత మంది అరబ్బులు ధనవంతులైనమాట నిజమే. జ్యూయిష్ ఏజెన్సీలెక్కల ప్రకారం 1918 ...30 సంవత్సరాల మధ్య 175,000 ఎకరాల భూమిని యూదులు కొన్నారు. సుమారు 45,000,000 రూపాయల ధనం వెచ్చించారు భూమికి. 1930 నుండి 35 వరకు యూదులు భూములు కొనడం చూద్దాం.

సంవత్సరం	కొన్నభూమి (సుమారు) ఎకరాలు	ధర చెల్లించింది పౌనులు(సుమారు)
1931	4,500	100,000
1932	4,700	149,000
1933	8,000	855,000

1934	15,500	1,548,000
1935	18,200	1,699,000

అంటే ఈ 5 ఏండ్లలోను 50,900 ఎకరాలు యూదులు కొన్నారు. 1936 నాటికి పాలస్టయిన్‌లో వ్యవసాయం చేయదగ్గ భూమి 3,000,000 ఎకరాలు. అందులో పదవ వంతు, అంటే 300,000 ఎకరాలు యూదులు కొనివేశారు, 1929 లో షా కమీషన్ ఒకటి పాలస్టయిన్ అల్లరుల విచారించడానికి వచ్చింది. దాని ముందు చెప్పిన సాక్ష్యాల ననుసరించి, 1929 నాటికి కొన్న భూములలో నూటికి 90 పాళ్ళు, ఎక్కువమంది భూస్వాముల వద్ద, జమీందార్లవద్ద కొన్నారు. వీరు పాలస్టయిన్‌లోగాక ఇతరదేశాలలో నివసించేవారు. ఎక్కువ ధనం పెట్టి యూదులు కొన్నా లాభం జమీందారులకు వచ్చేది గాని రైతులకు గాదు. ఉదాహరణకు బీరట్‌లో నివసించుతున్న ఒక క్రిష్టియన్ అరబ్బు ధనికుల కుటుంబం 1921—25 సంవత్సరాల మధ్య 22 గ్రామాలలోని భూమి అంటే 50 వేల ఎకరాలు అమ్మి, 726,000 పౌనులు సంపాదించుకొంది? మరి ఆ 22 గ్రా మ వా సు ల గతి ఏమిటి?

ప్రభుత్వశాసనం ప్రకారం మాత్రం తనకూ. తనకుటుంబపోషణానికీ సరిపోయినంతవరకు ఉంచుకొని మిగతాభూమి మాత్రమే,అమ్ముకోవాలి. కాని, రైతులకు లంచాలిచ్చి కొనసాగారు యూదులు. పైన చెప్పిన భూమిని కొన్నప్పుడు 30 వేల పౌనులను నష్టపరిహారంగా ఇచ్చామని యూదులు చెప్పారు. జ్యూయిష్ ఏజెన్సీ ప్రకారం రైతు కుటుంబాలు 750 మాత్రమే కాని అరబ్బుల లెక్కప్రకారం 1750. కాబట్టి ఒక్కొక కుటుంబానికి ఎలా చూచినా 17 లేక 40 పౌనులకంటె ఎక్కువరాలేదు. భూములమ్మడంవలన ధనిక కుటుంబం ఒకటి 726,000 పౌనులు సంపాదిస్తే

మరి బీద రైతు కుటుంబం 17 లేక 40 పౌనులకంటె ఎక్కువ సంపాదించలేదు. లాభం ఎవరికి?

1930 లో వ్యవసాయదార్ల దుస్థితిని విచారించడానికి మరొక కమీషన్ వచ్చింది. అది 104 గ్రామాలలో విచారణ జరిపింది. ఆ గ్రామాలలో ఉన్న 23,573 కుటుంబాలలో 6940 కుటుంబాలకు భూమిలేదు. వారు కూలీలయి పోయారు. మిగిలిన 16,633 కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి సగటున 18 ఎకరాలు ఉంది. పాలస్టయిన్ పంట ననుసరించి, అరబ్బుల వ్యవసాయపద్ధతి ననుసరించి, ఒక్కొక్క కుటుంబానికి 30 లేక 40 ఎకరాలు కావాలి * కాబట్టి అవసరమయినదాని కంటె సగం భూమే ఉన్నదన్నమాట.

భూముల అమ్మకంవలన. భూమిలేని రైతులు, మగతాకైనా భూములు దొరకని రైతులు, పట్టణాలకు కూలికి పోసాగారు.

ఈదుస్థితిని తొలగించడానికి ప్రభుత్వం ఏంచేసింది? 1929 లో నష్టపరిహారం ఇయ్యాలని ఒక 'ఆర్డినెన్సు' ప్యాసయింది. కాని ఈనష్టపరిహారం తగినంత ఇవ్వలేదు. షా—హోప్ సింప్సన్ కమిటీలు, 1929 అల్లరుల తదనంతరం పాలస్టయిన్‌ను దర్శించి అరబ్బుల భూమి పోవడమే తగాదాకు కారణమని తెల్పినాయి. అందుచేత భూస్వాములు, తన మగతాదారులకు నష్టం కల్గించులాగా భూముల నమ్మరాదని, కొంత నిర్బంధించుతూ ఒక శాసనం చేసింది. కొంత అమ్మకం తగ్గింది. అయినా 1931-35 ల మధ్య 50 వేల ఎకరాలు అమ్ముడు పోయింది.

---

* **Sir John Simpson's Report on Immigration, Land Settlement and Devolopment.**

ఇంతేగాక ప్రభుత్వం, భూమి పోయిన రైతులకు మళ్ళా భూమిని ఇప్పించే ఒక ప్రణాళిక పెట్టింది. ఆప్రణాళికకై 250,000 పౌనులు ఖర్చుపెట్ట దలచిన బ్రిటిషు ప్రభుత్వం 2,000,000 అప్పు ఇచ్చింది. కాని 3271 కుటుంబాలు అర్జీపెట్టుకొంటే ప్రభుత్వం 664 కుటుంబాలను అంగీకరించింది. కాని 1936 వరకు ఒక 100 కుటుంబాలు మాత్రమే మళ్ళా భూములను పొందగలిగాయి. వీరైనా, నాగళ్ళకు, పశువులకు, వ్యవసాయ సామగ్రికి, అద్దె చెల్లించాలి. ఇంతా తిప్పలు పడితే కుటుంబం గడిచీ గడవదు. తమ భూములు, తమ ఇండ్లు వదలుకొని గవర్నమెంటు చూపిన భూములమీద బ్రతకాలి. తమ స్వతంత్రం పోయింది. దానితో బానిసలగా బ్రతికే కంటే చచ్చిపోవడం మేలని తలవసాగారు అరబ్బులు. ఇంతేగాక కార్మికులగా మారిన రైతుల గతి ప్రభుత్వం తలపెట్టనే లేదు.

భూములను తమకు తెలియకుండానే అన్యాక్రాంతం చేయడంచేత, పాలస్టయిన్ రైతులు, యూదులు భూముల్ని వశపరచుకోడానికి వచ్చినపుడు అడ్డు తగిలేవారు. యూదులు బ్రిటిషు సైనికుల తుపాకి గుండ్ల సహాయంతో భూమి వశపరచుకొనే వారు.

కాబట్టి యూదు లధికంగా పాలస్టయిన్‌లో దిగుమతి కావడం, భూముల కొనడంవల్ల కల్గిన ఫలితాలివి. వ్యవసాయం చేయని భూస్వాములు భూముల్ని అమ్మడం-అరబ్బులకు తగిన నష్టపరిహారం ముట్టక పోవడం-కోర్టులచుట్టూ ఏండ్లకొలది తిరుగుతూ డబ్బు తగలెయ్యడం-పోలీసులచే బలవంతంగా తొలగింపబడటం, చిట్టచివరకు గతిలేక పట్టణాలకు మళ్ళి, అరబ్బు, యూదు పెట్టుబడుదారులచే పీడింపబడటం-ఇదీ పాలస్టయిన్ రైతుల జీవితగతి.

భూములను అమ్మడంవలన కొద్దిగా డబ్బు వచ్చినా అదికాస్తా వడ్డీ వ్యాపారస్థులకే పోతుంది. దాదాపు మన దేశపు పరిస్థితులే అక్కడా ఉన్నాయి. తగినంత భూమి లేకపోవడం, వ్యవసాయాభివృద్ధికి తగిన పెట్టుబడి లేకపోవడం, అప్పులూ పన్నులూ అధికంగాపడం, అరబ్బు రైతుల దుస్థితికి మూలకారణం. 1930 లో పాలస్టయిన్‌ను గురించి రిపోర్టు వ్రాసిన ఒక కమీషన్ తాము తిరిగిన 104 గ్రామాలలోని 27,573 కుటుంబాలలో 5477 కుటుంబాలు మాత్రమే స్వయం పోషణకు తగిన భూమి కలవని వ్రాసింది.

యుద్ధానంతరం, ప్రజలు హెచ్చడమేగాక భూములకొరకు పోటీ హెచ్చింది. భూములను ముక్కలు ముక్కలుగా విభజించి అమ్ముకోజొచ్చారు. ఇంతేగాక పట్టణ ప్రజల భరించే పన్నుకంటె పల్లెప్రజల పన్నులే అధికంగా ఉన్నాయి. 1930 లో పట్టణ ప్రజలు భరించిన పన్ను 131,000 పౌనులు. పల్లెప్రజలు భరించిన పన్ను 395.000 పౌనులు. అంటే పట్టణ ప్రజలకంటె 3 రెట్లు పన్ను చెల్లించారన్నమాట. ఇకపట్టణ ప్రజల ఆదాయం కనీసం రైతులకంటె 3 రెట్లు ఉంటుంది *

ఈవిధంగా కృశించే అరబ్బు రైతుల భూమి క్రమక్రమముగా యూదుల చేతులలోకి పోయింది.

యూదుల దిగుమతి ఫలితంగా నేటి జనాభా చూద్దాం. ప్రపంచ యుద్ధానికి పూర్వం అరబ్బులు 660,000. ఇపుడు 1.000,000 (మరొక లెక్క ప్రకారం 877,000 మాత్రమే) యూదులు ప్రపంచయుద్ధానికి పూర్వం 800,000. ఇపుడు 400,000 మంది(38,600 మంది అని ఒక లెక్క) యూదుల చేతులలోకి పోయిన భూమి చాల సారవంతమయినది. అది 314,000 ఎక

* **Economic Annual Palestine 1931.**

రాలు. అరబ్బులకు మిగిలిన భూమి ఎక్కువ పర్వతప్రాంతం. అట్టే సారవంతమైనది కాదు. ఇది 3,000,000 ఎకరాలుంటుంది. ఇదివరకే కొన్ని లెఖ్ఖలు చూపించాం. ఈనాడు అరబ్బులలో నాల్గవవంతు ప్రజలకు భూమియే లేదు. మిగిలినవారిలో కూడ సగటున 18¾ ఎకరాలు కుటుంబానికి ఉన్నది. కనీసం కుటుంబానికి 30 ఎకరాలయినా ఉంటేనేగాని అచ్చటి పంట, కుటుంబానికి సరిపోదు. ప్రపంచయుద్ధానంతరం, 20 ఏండ్ల బ్రిటిషు పరిపాలనా ఫలితంగా అరబ్బు రైతు అనుభవించిన సౌఖ్యమిది.

పరిశ్రమలు

పాలస్టయిన్‌లో 20 మిలియనుల (మిలియన్ అంటే పది లక్షలు) పౌనుల బ్రిటిషు పెట్టుబడి, 10 మిలియనులపౌనుల అమెరికా పెట్టుబడి పెట్టబడింది. బ్రిటిషువారికి హైఫావద్ద పాలస్టయిన్ పెట్రోలియం కంపెనీ; పాలస్టయిన్ ఎలక్ట్రిక్ కంపెనీ; పాలస్టయిన్ పొటాష్ కంపెనీ, లున్నాయి. ప్రూడెన్షియల్ అండ్ సన్‌లైఫ్ ఇన్స్యూరెన్సు అనే బ్రిటిషు కంపెనీ, భవన నిర్మాణానికి 1¾ మిలియన్ల పౌనులు పెట్టుబడి పెట్టింది.

ప్రపంచ యుద్ధానంతరం, బ్రిటిషు అమెరికన్ యూదుల పెట్టుబడి వలన పరిశ్రమలు వృద్ధి చెందాయి. టెల్-ఎవివ్ అనే యూదుల పట్టణం ఒకటి నూతనంగా నిర్మించబడింది. అది ఇతర యూరప్ పట్టణాల వలెనే చాల నవీనమైనది. దాదాపు 150,000 మంది ప్రజలు-అందరూ యూదులే-ఉన్నారు, ఏ కొద్దిమందో పరిచారకులు తప్ప.

1935లో పారిశ్రామికోత్పత్తి 10,000,000 పౌనుల విలువ గలది తయారయింది. ఇందులో నూటికి 75 పాళ్ళు యూదులదే. మిగిలినవి చేతి పరిశ్రమలూ. చిన్న చిన్న పరిశ్రమలూ. అరబ్బుల ముఖ్య వృత్తి

ఆలివ్ ఆయిల్ సబ్బు. టారిఫ్ సుంకాల వలన, ఇతర దేశాల చౌక రకపు సబ్బుల పోటీవలన ఈ పరిశ్రమ కూడా క్షీణించ సాగింది. 1930 లో 200,000 పౌనుల ఖరీదుగల సబ్బు ఎగుమతిఅయింది. కాని 1935 లో 70.000 పౌనులకు పడిపోయింది. అరబ్బుల మరొక పరిశ్రమ సిగరెట్లు తయారు చేయడం.

కాని, పరస్పర ద్వేషంవలన యూదులు సిగరెట్లు యూదుల పరిశ్రమలవే కొంటారు. ఈవిధంగానే ఆహారపదార్థాలు కూడ. యూదులమిల్లులలో తయారయిన పిండినే యూదులు కొంటారు. అరబ్బుల పరిశ్రమను యూదులు ప్రోత్సహించేదల్లా ఒక రాతి పరిశ్రమయే.

ఈ యూదుల జాతి ద్వేషం ఒక్క పరిశ్రమలోనే కాదు. అతడు అరబ్బు బస్సులో ఎక్కడు; అరబ్బు హోటలులో భోంచేయడు: అరబ్బు దుకాణంలో కొనడు; అరబ్బు సేవకుని ఉంచుకోడు. ఒకవేళ ఇది సాధ్యం గాకపోతే, ఎంత త్వరలో యూదులు అధిక సంఖ్యాకులయి, నేషనల్‌హోం స్థాపించ బడితే అంతమంచిదని ఎపుడూ ఆలోచిస్తూ ఉంటాడు.

యూదుల ప్రవేశంవలన కొంత మంది అరబ్బులు లాభం పొందలేకపోలేదు. కట్టడాల యజమానులు, రాతి పరిశ్రమల యజమానులు, భూస్వాములూ, కొద్దిమంది లాభం పొందారు. కాని ముఖ్యంగా పాలస్టయిన్‌తో వర్తక వ్యాపారాల వలన పొందిన లాభమేమిటో చూద్దాం.

బ్రిటన్ తన వస్తువులను పాలస్టయిన్‌కు దిగుమతిచేసి అమ్ముకొనడంవలన బ్రిటన్‌లో వేలకొలది బ్రతుకుతున్నారు. 1920 లో 1,200,000 పౌనుల ఖరీదుగల వస్తువులు దిగుమతి అయాయి. 1935 నాటికి 3,202,000 పౌనుల ఖరీదు గలవస్తువులు దిగుమతి అయాయి. కాని, [illegible] లో

కొంత తగ్గింది. కారణం. యూదుల ప్రవేశాన్ని అరికట్టడమూ, 1936 లో ప్రారంభమైన అల్లరులూ. 1937 లో దిగుమతి అయిన వస్తువుల విలువ 2,518,000 పౌనులు, బ్రిటిషు పరిపాలన ఉండటం వలననే బ్రిటిషు దోపిడినిరాటంకంగా కొనసాగుతున్నది. 1920 నుండి, 1937 వరకు 28, 650,000 పౌనుల విలువగల వస్తువులు బ్రిటిషువారు దిగుమతి చేశారు. ఇంతేగాక బ్యాంకులద్వారానా, ఇన్స్యూరెన్సు కంపెనీల ద్వారాను, ఉద్యోగాల ద్వారాను బ్రిటను దోపిడి చేస్తున్నది.

కార్మికుల దుస్థితి

అరబ్బు కూలీలు 1936 ప్రారంభాన 40 వేలమంది ఉంటారు. ఇది నారింజపండ్లు ఏరుకాలంలో. ఇతర కాలంలో 38 వేలమంది ఉంటారు. అప్పటి అరబ్బు జనాభా 850,000 మంది. కూలిలోకూడ అరబ్బులకు యూదులకు భేదం ఉంది. 1934 పాలస్టయిన్ బ్లూబుక్ ప్రకారం ఈ క్రింది విధంగా కూలి ఈయబడుతున్నది.

	యూరోపియన్ కూలీ	ఆసియా కూలీ
	(షిల్లింగులలో)	
దున్నడం	5 మొదలు 7	$1\frac{1}{2}$—$2\frac{1}{2}$
నారింజపండ్లు ఏరుట	4—5	$2\frac{1}{2}$—4
చెట్ల కాపలా	5—6	3—4
రాళ్ళపని	5—9	$3\frac{1}{2}$—4
కంపోజింగ్	6—8	3—5
కట్టడపు పని	6—8	2—3

యూరోపియన్ లేబర్ అంటే ఎక్కువ భాగం యూదులన్నమాట. ఆసియాటిక్ లేబర్ అంటే ఎక్కువభాగం అరబ్బులన్నమాట.

ఒక కట్టడపు పనిలోనే 1936 నాటికి 7 వేలమంది అరబ్బులు నిమగ్నులయి ఉంటారని అంచనా. వారి కిచ్చే జీతం యూదుల కిచ్చే జీతంలో 3 వ వంతు ఉంటుంది. ఇలాంటి జీతాలతోనే పి. డబ్ల్యు. డి., రైల్వే, పోర్టు, మ్యునిసిపాలిటీలలో అరబ్బులు పని చేస్తున్నారు. హైఫా, జాఫా ఓడరేవులలో దినానికి 3 షిల్లింగులు జీతం. రోడ్ల పనిచేయువారికి రెండు షిల్లింగులు. హైఫావంటి పట్టణాల జీవితం చాలా కష్టంగా గడుస్తుంది. బాగా చౌకగా ఉన్న గదికి కనీసం 10 పౌను, 1 షిల్లింగులు అద్దె చెల్లించుకోవాలి. తనకు వచ్చే ఆదాయంలో నూటికి 40 పాళ్లు అద్దెకే సరిపోతుంది.

హైఫా, జాఫా, పట్టణాలలో నివసించే కార్మికులు, పాత డబ్బారేకులతో కట్టుకొన్న గుడిసెలలో నివసించుతారు. ఆరోగ్య వసతులు లేవు. గాలి రాదు. వేసవిలో మండిపోతుంది. చలికీ, వర్షానికీ రక్షణ ఇవ్వవు, రోగాల పుట్టలనవచ్చు ఆ ఇండ్లు.

యూదులకు భూములమ్ముకోడంవల్లనో, గవర్నమెంటుకు తగిన శిస్తు చెల్లించలేకనో రైతులు పట్టణాలకు పరుగెత్తసాగారు. వారికి కనీసం జీతం ఇంత అని లేదు. పనిచేసే గంటల పరిమితిలేదు. సూర్యోదయం మొదలు సూర్యాస్తమయం వరకు పని చేయాలి. వాటికి తగ్గట్లు కార్మికులకు సరియైన ట్రేడ్ యూనియన్ సంఘాలు లేవు. 1935 లో మాత్రం రైల్వే కార్మికులు సమ్మె చేస్తామని బెదరించితే 48 గంటలు వారం గ్రాంటుచేసింది ప్రభుత్వం. నిరుద్యోగ సమస్యను గురించి ప్రశ్నిస్తే ప్రభుత్వం "సరియైన ఆచూకీ" తెలియదని త్రోసిపుచ్చుతుంది.

యూదుల ట్రేడ్ యూనియన్లు మాత్రం బాగా ఉన్నాయి. యూదు కార్మికులకు 8 గంటల దినము, కుటుంబ అలవెన్సు, శనివారం సెలవు,

మంచి ఇండ్లు, అనారోగ్య ఇన్స్యూరెన్సు ఫండు మొదలయినవి ఉన్నాయి. అరబ్బు కార్మికులకీ వసతులు లేవు. యూదు కార్మికుల సంఘమగు "ఫెడరేషన్ ఆఫ్ జ్యూయిష్ లేబర్" అరబ్బు కార్మికులను చేర్చుకోదు. యూదు కార్మిక నాయకుల్కు, అరబ్బు కార్మికులను సంఘటన పరచుటలో తగినంత శ్రద్ధ తీసుకోలేదు. యూదు పెట్టుబడిదారులు యూదు కార్మికులనే కూలికి పిలుచుటతో అరబ్బు, యూదు కార్మికులను ఒకే సంఘం క్రిందకు తీసుకురావడం అసాధ్యమయిపోయింది.

పాలస్టయిన్ అరబ్బులేగాక ఇతర సరిహద్దు దేశాలనుండి రైతులు, ఇతర బీద జాతులు వస్తారు కూలికి. వారు మరీ తక్కువ కూలికి పని చేస్తారు, కుటుంబాలతో రాని కారణంచేత, ఎక్కడబడితే అక్కడ తల దాచుకోవడానికి సిద్ధముయి వచ్చుటచేత, వీరు తక్కువ కూలికి సిద్ధ పడతారు. ఇతర వలస దేశాలలోవలెనే పాలస్టయిన్ చౌక కూలి నుపయోగించుకొని బ్రిటిషు పెట్టుబడిదారులు దోపిడి చేస్తున్నారు.

యూదుల ప్రవేశం లాభకరమా?

చాలమంది 'జియోనిజం' వల్ల పాలస్టయిన్ బాగుపడిందని వాదిస్తారు. పారిశ్రామిక విప్లవంవల్ల ఇదివరకున్న స్థితికంటె కొంచెం ప్రజలు బాగుపడవచ్చు. కాని పారిశ్రామిక విప్లవ తదనంతరం కార్మికుల గతియేమిటి? అట్టి గతియే నేటి పాలస్టయిన్‌కు సంభవించింది. జియోనిజంవల్ల జాఫా, జెరూసలం, హైఫాలవద్ద భూమికి యజమానులయిన భూస్వాములు; వర్తకులు, కొందరు పారిశ్రామికులు బాగు పడ్డారు, కాని, కార్మిక కర్షకులకు, తినటానికి తగిన తిండిలేదు—తగిన వైద్య సహాయం లేదు—చదువు సంధ్యలంతకు ముందే సున్న, బ్రిటిషు పరిపాలన, యూదుల

దిగుమతీ అంటే స్పష్టమైన విషయం ఇది. భూములు పోవడం; రైతులు కార్మికులవడం; యజమానుల దోపిడికి గురియవడం. 1933 లో హిట్లర్ అధికారానికిరావడంవలన జర్మనీనుండి పారిపోయివచ్చిన యూదుల పెట్టుబడి వలన కొద్దిగా లాభం కల్గినా అది తాత్కాలికమే. ,1936 లో తిరుగుబాటు ప్రారంభమయేముందు అరబ్బులలో, యూదులలో నిరుద్యోగం హెచ్చింది.

అరబ్బుల భూముల అమ్మకం, పరిశ్రమలు ఒక దాని వెంట ఒకటి వచ్చాయి. యూదుల పరిశ్రమలకు, బ్రిటిషుప్రభుత్వపు పోర్టులకు, రోడ్లకు, రైళ్ళకు, అరబ్బు కార్మికులు కావలసి వచ్చారు. యూదులచే పారిశ్రామికముగా చేయబడ్డ పాలస్టయినే బ్రిటిషు వ్యాపారానికి లాభం. అందుకే 'జియోనిజమూ', బ్రిటిషు ప్రభుత్వమూ పాలస్టయిన్ దోపిడిలో పరస్పర సహాయము గావించుకొంటూ ఉన్నాయి. యూదులు పెట్టుబడి పెట్టుతున్నారు. బ్రిటిషువారు తుపాకులు సప్లయి చేస్తున్నారు. ఇక దోపిడికి అడ్డెక్కడిది? అరబ్బుల తిరుగుబాటును అణచే విధానాన్ని గురించి "న్యూస్టేట్స్‌మన్" లో 1936 అక్టోబర్ 3 వ తేదీన ఒకరిలా వ్రాశారు.

"జియోనిస్టులు సాయుధులయిన మనుష్యులను సహాయం చేస్తారు —పోతే బ్రిటిషు సామ్రాజ్యము సప్లయి చేయవలసినదల్లా—విష వాయువూ, విమానాలూ."

౭

తిరుగుబాట్లు

పాలస్టయిన్ బ్రిటిషు దురాక్రమణకు గురియైననాటినుండీ, దేశంలో శాంతిలేదు. యూదుల యెడ పక్షపాతమూ, అరబ్బుల యెడ విద్వేషమూ చూపుటే గాక, బ్రిటిషు సామ్రాజ్యము తన రక్షణకై అరబ్బులను దోపిడి చేయుటయే అశాంతికి మూలము. 1920, 1921, 1929, 1933, 1936, 1938 సంవత్సరాలలో తిరుగుబాట్లు జరిగాయి. ఈ తిరుగుబాట్లనే సామ్రాజ్యవాద చరిత్రకారులు 'అల్లరులు' అని పిలవసాగారు. ఈ 'అల్లరులు' తీవ్రరూపానికి వచ్చింది 1933 లో.

1933 తిరుగుబాటు

1933 లో హిట్లర్ అధికారానికి వచ్చినతోడనే యూదులు పాలస్టయిన్‌లో ప్రవేశించడం అధికమైంది. దానికి అరబ్బులు అసమ్మతి తెలియ



బ్రిటిషు పోలీసులు, అరబ్బులపై లాఠీచార్జీ చేస్తున్న దృశ్యం



అరబ్బులను సోదా చేస్తున్న విధానం

చేయ సాగారు. 1933 అక్టోబర్‌లో ప్రభుత్వము అరబ్బులు ఎట్టి ఊరేగింపులూ చేయరాదని నిషేధించింది. కాని అక్టోబర్ 13 వ తేదీన జెరూసలంలో ఒక ఊరేగింపును అరబ్బులు లేవదీశారు. పోలీసులు దానిని చెదరకొట్టడం దుర్లభమయింది. జాఫా, నాబ్లస్ పట్టణాలలో కూడ అసమ్మతి ఊరేగింపులను జరగనీయలేదు. అరబ్బు కార్యనిర్వాహక సభ అక్టోబర్ 27 వ తేదీన ప్రభుత్వాన్ని ఉల్లంఘించాలని, జనరల్‌స్ట్రయికు (సార్వజనిక సమ్మె) చేయాలని తీర్మానించింది. ఆనాటి ఊరేగింపులను ఆపాలని, పోలీసులు ప్రయత్నించారు. కాని విఫలులయారు. ఈ తగాదాలో 20 మంది మరణించారు. 130 మంది గాయపడ్డారు. దాని తర్వాత అరబ్బులలో క్రోధాగ్ని ప్రజ్వరిల్లింది. హైఫా. నాబ్లస్, సఫేద్, నాజరెత్, జెరూసలంలో అరబ్బు ప్రజాసమూహము పోలీసులను, మిలటరీని ఎదిరించింట. పోలీసులు అరబ్బులపై కాల్పసాగారు. అరబ్బులు కూడ తిరిగి కాల్చారు. యూదులను ఎదుర్కొన్నది ఒక్క హైఫాలోనే. తక్కిన చోట్ల పోలీసులనే ఎదిరించారు. జనరల్‌స్ట్రయిక్ కూడ చాలవరకు విజయవంత మైనది, యూదు లధికంగా నున్న నగరాలలో తప్ప తక్కినచోట్ల వ్యాపారం పడిపోయింది.

బ్రిటిషు ప్రభుత్వం ఒక్క సైనికులతోనే సంతృప్తి పడలేదు. ఈజిప్టు నుండి విమాన దళాలు రెండు వచ్చినాయి. అవి అన్ని ముఖ్య నగరాల పైన ఎగిరాయి. అరబ్బు కార్యనిర్వాహక సభయొక్క ప్రధాన సభ్యులందరూ అరెస్టు చేయబడ్డారు. వారికి జామీను నిరాకరించబడింది. సెన్సార్‌షిప్ చాల కఠినంగా అమలు పరుచారు. దానికి అసమ్మతి తెల్పుతూ అరబ్బు వార్తా పత్రికలు ప్రకటించుట మానివేసాయి. చిట్టచివరకు అక్టోబర్ 30 వ తేదీన, పాలస్టన్ హైకమీషనర్ సర్ ఆర్థర్ గ్రేన్‌ఫెల్

వాచోప్ తనకు సర్వాధికారాలు ఇచ్చే "పాలస్టయిన్ (డిఫెన్సు) ఆర్డర్ ఇన్ కౌన్సిల్ 1931" శాసనాన్ని అమలు పఱచాడు. దానితో సమ్మె అణచి వేయ బడిందని చెప్పవచ్చు. నవంబరు నాల్గవ తేదీన జనరల్ స్ట్రయిక్‌ను ఆపి వేశారు. ఈ సమ్మె సందర్భంలో అరెస్టు చేయబడిన వారికి శిక్షలు అట్టే కఠినంగాలేవు. దానికి కారణం అరబ్బులు ప్రభుత్వంపై తెచ్చిన ఒత్తిడియే. షేక్ ముజఫర్ అను అతడు ఒక సంవత్సరం సత్ప్రవర్తనపు పూచీపై విడుదల గావించ బడ్డాడు. జమాల్ హుస్సేనీ, ఎడ్మండ్ రాక్‌లకు ఒక్కొక నెల శిక్ష విధించబడింది.

తర్వాత 1934 జనవరి 17 న 'బైరం' విందు దినోత్సవం జరిగింది. ఆనాడు ప్రభుత్వం అన్ని ముఖ్య పట్టణాలలోను ఊరేగింపులను సాగనిచ్చారు కొన్ని షరతులమీద. 7—8 గంటల మధ్య ఊరేగింపు జరగాలనీ, కర్రలు తీసుకరాకూడదనీ— షరతులు పెట్టారు. అరబ్బు నాయకులిదే తమ విజయమన్నట్లు భావించ సాగారు. మాండేట్‌ను, జియోనిజాన్ని ఖండించుతూ అరచారు. కాని ఎట్టి అల్లరులూ జరుగలేదు. "ప్రభుత్వం అరబ్బు ప్రదర్శనాలకు ప్రతిఘటన చూపక తాత్కాలికంగానైనా గాంధీ మహాత్ముని పద్ధతుల నవలంబించింది." అని * ఒకరు ఆక్షేపించారు బ్రిటిషు ప్రభుత్వాన్ని.

1936 తిరుగుబాటు.

ఇదివరకు జరిగిన తిరుగుబాట్లలో ఇదే ముఖ్యమైనది. 1936 ఏప్రియల్ 19 వ తేదీన జనరల్ స్ట్రయిక్ ప్రారంభమయినది. 178 దినాలు గడిచాక, సమ్మె ఆగిపోయింది. ఈసమ్మెకు మూలకారణాలు విచారించుదాం.

* **Robert L. Baker in Gurrent History of March 1934.**

ఏప్రియల్ 19 వతేదీన కొందరు అరబ్బులు జాఫాలో యూదులను ఎదుర్కొన్నారు. దానికి కారణం అదివరకు రెండు దినాల క్రింద యిద్దరు అరబ్బులు చంపబడుటే. దీనితోపాటు అరబ్బు దుకాణదారులు తమంతతామే షాపులను మూయసాగారు. మొదట జాఫాలోను తర్వాత తదితర పట్టణాలలో దుకాణాల మూసి హర్తాళ్ చేశారు. హైఫా పోర్టులోను, గవర్నమెంటు రైల్వేలోను పనిచేయు కార్మికులు తప్ప తక్కిన కార్మికులు పని మానివేసి సమ్మెలో చేరారు. వీరే గాక అరబ్బు వర్తకులు, ప్లీడర్లు, మేయర్లు, మ్యునిసిపల్ ఉద్యోగస్తులు, స్కూలుపిల్లలు అందరూ ఈ జనరల్ స్ట్రయిక్‌లో పాల్గొనసాగారు.

ఇది ప్రజలచేతనే ప్రోత్సహింపబడింది. అరబ్బు నాయకులు ప్రజల ఈ తీవ్ర[illegible]చరణకు విరుద్ధంగా నడవలేకపోయారు. సంధి చేయదలచిన హెబ్రాన్ మేయరును అరబ్బు ప్రజలు కాల్చి చంపారు. లొంగిపోడానికి తలపెట్టిన దుకాణదార్లను పికెటింగువలన ఆపేవారు. అరబ్బు ధనికులు, కార్మికులకు దుకాణదార్లకు కొంత ఆహారసామగ్రిని సప్లయి చేసేవారు. ఒకవేళ అలా ఈయకపోతే, బెదరింపులకు లొంగి ఇచ్చేవారు. రైతులు కూరగాయలు పండ్లు సప్లయి చేసేవారు. ఈ సమ్మెకు ఇతర దేశాల ప్రోత్సాహ మున్నదని ఇంగ్లీషు పత్రికలు వ్రాయసాగాయి. కాని ప్రభుత్వ వైఖరిని తెలియజేసే 'టైమ్సు' ఇలా వ్రాసింది.

"ఈజిప్టు ఇరాక్, సిరియాలనుండి కొద్ది చందాలు వచ్చినా, కావలసిన ధనమంతా స్థానికంగానే ప్రోవు చేయబడింది."

ఇదివరకు జరిగినవన్నీ చిన్న అల్లరుల క్రిందే పరిగణించ బడినాయి. కాని ఇది అలా కాదు. కారణం ఈ పోరాటంలో ప్రజాసామాన్యం బాగా పాల్గొన్నది. వ్యాపారం స్థంబించింది. ప్రభుత్వానికి ఒత్తిడి కల్గింది.

ప్రజా శాసనోల్లంఘనం జరిగింది: పన్నులుగానీ, మ్యూనిటివ్ పన్నులు గానీ ప్రజలు చెల్లించలేదు. పెద్ద పట్టణాలలో ప్రదర్శనాలు సాగించారు. ప్రభుత్వ రహదారులమీద దాడి సాగించారు. తంతి తీగెలను నరుక సాగారు. రైల్వేలను, వంతెనలను బాంబులతో ధ్వంసం చేశారు. ఇరాక్ పెట్రోల్‌లియం కంపెనీ పైప్‌లైను తెగగొట్టారు. మిలటరీ క్యాంపులపైన దాడి సల్పారు. యూదుల పంటలను నాశనం గావించారు. వ్యక్తిగతంగా యూదులను హత్య గావించిన కేసులే 80 ఉన్నాయి.

అదివరకున్న సైన్యాలు గాక 1936 సెప్టెంబరులోను 1200 మంది వచ్చారు. దానితో 30 వేల మంది సైనికులయారు.

ఈ పోరాటంలో అరబ్బులు కోరిన కోర్కెలు మూడు.

(1) యూదుల ప్రవేశాన్ని అరికట్టుట.

(2) అరబ్బు భూముల్ని ఇకముందు యూదులకు అమ్మకుండా అడ్డుపెట్టుటకు చట్టము.

(3) స్వతంత్ర ప్రజాస్వామ్య ప్రభుత్వ స్థాపన.

అరబ్బులు గత 15 ఏండ్లనుండీ వినతి పత్రాలతోను, రాయబారాలతోను కాలం గడిపారు. అది లాభంలేదని తలచారు. తిరుగబడ్డారు. తిరుగుబాటుకు మూల కారణాలను తొలగించలేదు ప్రభుత్వం. తీవ్రంగా అణచివేయ ప్రారంభించింది.

అరబ్బులు కోరిన పై కోర్కెలకు హై కమీషనర్ (మనకు వైస్రాయి వంటివాడు) ఇలా జవాబు చెప్పాడు. ఒక లెజిస్లేటివ్ కౌన్సిల్ ప్రసాదించుతారట. దానిలో బ్రిటిషు ఉద్యోగస్థులు, నామినేట్ చేయబడ్డ సభ్యులూ కలసి, ప్రజలచే ఎన్నుకోబడ్డ సభ్యులకంటె ఎక్కువ ఉంటారు. ఈ కౌన్సిల్ యూదుల ప్రవేశాన్ని గురించిగాని, బడ్జెట్ గురించిగాని

చర్చించే అధికారంలేదు. అన్ని విషయాలు హై కమీషనర్ 'వీటో' అధికారానికి లొంగి ఉండాలి.

పెట్టుబడిదారులు, భూస్వాములతో కూడిన మితవాదులు దాని కంగీకరించ దలచారు. కాని నిజమైన ప్రజా ప్రతినిధులగు తీవ్రవాదులు దానిని తిరస్కరించ దలచారు. కాని అంగీకరించడమా, తిరస్కరించడమా అన్న సమస్య యేదీ రాలేదు. తుదకు ఈకౌన్సిల్‌నుగూడ ఈయలేదు. అంతటితో మితవాదులు, అతివాదులుకూడ కలిసారు.

శాంతియుత పద్ధతులు భగ్నం కాగానే అరబ్బులు హింసాపూరిత కార్యాలు చేయసాగారు. ప్రభుత్వం ఇంకా అంతకంటె ఘోరమైన దౌర్జన్యము సాగించింది. "హింసకు లొంగం" అనే నినాదాన్ని లేవదీసింది ప్రభుత్వం. వలస రాజ్యాల కార్యదర్శి ప్రకటన ఈ భావనను తెలియచేసినది. "రాయల్ కమీషన్ పాలస్టయిన్ వెళ్ళి విచారించి వచ్చేవరకు అరబ్బులకు ఏమీ ఇవ్వం. ప్రజలు శాంతియుతంగా ఉండనంతవరకు మేము రాయల్ కమీషన్‌ను పంపించం. రాయల్ కమీషన్ గావించిన సూచనలన్నీ, మేం అంగీకరించాలని ఎక్కడా లేదు."

శాంతిని నెలకొల్పడానికి, 1,300,000 మంది ప్రజలుగల (ఆనాటికి) పాలస్టయిన్‌లో 30 వేల సైనికులను సన్నాహము గావించింది. వీరికి బాంబుల వేసే విమానాలు, టాంకులు, మెషిన్‌గన్‌లు మొదలగు నవీన యుద్ధ సామగ్రి అంతా ఉన్నది. ఇక అరబ్బులు పర్వత ప్రాంతాలలో దాగి యుద్ధం చేయసాగారు. అరబ్బు సైన్యం 2 మొదలుకొని 5 వేల మధ్య ఉంటుందని అంచనా వేయబడింది. వీరికి కొద్ది మెషిన్‌గన్‌లూ, ప్రాత తరహా తుపాకులూ తప్పితే ఏమీ లేవు. ఈ కలహంలో మరణించిన అరబ్బుల సంఖ్య 800. (ప్రభుత్వం మాత్రం 200 మాత్రమేనని వ్రాసింది.)

ఇంగ్లీషువాళ్లూ, తెల్ల సైనికులూ చచ్చింది 28 గురే. ఒకప్రక్క సమస్త ఆయుధాలు గల్గిన సామ్రాజ్యవాదులు మరొకప్రక్క తగిన ఆయుధాలులేని ప్రజాసామాన్యం. ఈ చిత్రవధను అంతకు ముందే జరిగిన అబిసీనియా యుద్ధంతో పోల్చితే తప్పులేదు. దానికీ దీనికీ అట్టే భేదంలేదు. సామ్రాజ్యము సంపాదించుకోడానికి ఇటాలియన్లు చిత్రవధలు గావించారు. సామ్రాజ్యాన్ని రక్షించుకోడానికి బ్రిటిషువాళ్ళు ఈ దారుణ హత్యలు గావించారు. కాని విషాదకర విషయ మేమిటంటే బ్రిటిషు పత్రికలన్నీ సమర్థించడమే గాక, లేబర్‌పార్టీ (కొందరు వ్యక్తిగతంగా విరోధించినా) సమర్థించింది.

పాలస్టయిన్ ప్రభుత్వం ఈ పోరాటాన్ని అణచడానికి అనేక ఉపాయాలు అవలంబించింది. ఊరేగింపులలో పాల్గొనుచున్న స్త్రీ పురుషులపై కాల్చారు. ఎక్కడైనా రైళ్లుగాని, టెలిగ్రాఫ్ తీగెలుగాని నరికితే- ఏ గ్రామస్థులు ఆపని చేసినా—తెగిన ప్రదేశాలకు సంబంధించిన గ్రామాలకు పన్నులు వేసేవారు. ఆ పన్నులు చెల్లించకపోతే పంటలను, ప్రైవేట్ ఆస్థిని, లాగివేసేవారు. సాయుధులైన అరబ్బులున్నారని అనుమానం తగిలితే ఆ ఇండ్లను నేల మట్టం చేసేవారు.

ప్రభుత్వం గావించిన అమానుష కృత్యాలకు ఒక్క ఉదాహరణ చాలు.

1936 జూన్ 16 వ తేదీన జాఫానగరంలో ఒక ప్రకటన గావించింది. ఆ ప్రకటన ఇది.

"ప్రభుత్వం ప్రాత జాఫానగరాన్ని బాగుచేయదలచింది. మొత్తం పట్టణ అభివృద్ధికిగాను, ఇచట రెండు రోడ్లను నిర్మింగ దలచింది.

కొన్ని భవనాలను మొదట పడగొట్టాలి. ఇవి చాల అనారోగ్యకరంగా ఉన్నాయి. రాయల్ ఇంజనీర్లు ఈ పనులను ప్రారంభించుతారు.

వ్యక్తిగతంగా విచారించి, ఆ ఇండ్లు కలవారికి నష్టపరిహారం ప్రభుత్వ మిస్తుంది.

ఇండ్లు పడగొట్టడం త్వరలో ప్రారంభిస్తారు. ప్రజలు తమ క్షేమాన్ని గుర్తించుకొని లోబడండి."

అదే రోజున ఈ క్రింది నోటీసులు కూడా పంచిపెట్టబడినాయి.

"లాను ధిక్కరించని ప్రజలకు ఏ ముప్పులేదు. ఎవరైనా ఎదురు తిరిగితే, మిలటరీ సైన్యాలు తమ అధికారాన్ని వినియోగించుతాయి."

జూన్ 26 వ తేదీన మరి కొన్ని నోటీసులు 48 గంటలలోగా విడిచిపెట్టాలని పంచిపెట్టారు. జూన్ 29 వ తేదీన మందుగుండు సామగ్రితో 500 ఇండ్లను పడగొట్టారు-మరి 300 ఇండ్లుకూడా పాడైనవి. మొత్తం 800 ఇండ్లు పోయినయి. 6000 మందికి తలదాచుకోవడానికి స్థలంలేదు. ఇదంతా ప్రభుత్వ ఉద్దేశ్యంలో "ప్రాత పట్టణాన్ని బాగుపఱచడానికి"

కాని యదార్థం ఇది కాదు. ఈవిషయమై కోర్టులో తీర్పుచెప్పుతూ చీఫ్ జస్టిస్ సర్ మైకేల్ మెక్‌డాన్నెల్ ఇలా చెప్పాడు:

"ప్రభుత్వం ప్రజల కండ్లలో దుమ్ముకొట్టి, ఇలా చేయడంకంటె ఇది మిలటరీకి అనుకూలంగా ఉండేందుకు చేసిన పని అని చెప్పితే బాగుండేది." తిరుగుబాటు గావిస్తున్న అరబ్బులను అణచడానికి అవసరమయిన రోడ్లను నిర్మించడానికే ఈ పని చేశారు. ఈ తీర్పు చెప్పినందుకు ఫలితం అక్టోబరు 20 వ తేదీన ఈ న్యాయమూర్తి "రిటైర్" అయ్యాడు. (ఇలా అరబ్బుల తరఫున న్యాయం చెప్పినందుకు ఇతనినే గాదు తొలగించింది. హెన్రీ లూక్, థామస్ హేక్రాఫ్ట్ అనువారికి కూడా ఇదే గతి పట్టింది.)

ఈ ఆరు నెలలలోను ప్రభుత్వం నిరంకుశంగా ప్రవర్తించింది.

మామూలు పౌరసత్వ హక్కులు లేవు. మీటింగులు చేసుకొనే హక్కు లేదు. వార్తాపత్రికలను నిషేధించారు. ఉత్తరాలను 'సెన్సార్' చేసేవారు. 320 మంది అరబ్బు నాయకులు ఎట్టి విచారణ లేకుండానే కాన్‌సెంట్రేషన్ క్యాంపులలో పడవేశారు. "ఆయుధాలకోసం వెదుకుతున్నామని" వంక చెప్పి, ప్రజాసామాన్యాన్ని చావమోదేవారు. తిరుగుబాటులో 1900 మంది అరెస్టు చేయబడ్డారు.

ఆరునెలలు తీవ్రంగా పోరాడి, పోరాడి తాత్కాలికంగా అక్టోబర్ 13 వ తేదీన జనరల్ స్ట్రయిక్‌ను విరమించివేశారు. సామ్రాజ్యవాదుల బంట్లగు అరబ్బు రాజభక్తులు అక్టోబర్ 12 వ. తేదీన ఈ క్రింది విజ్ఞప్తి గావించారు. విజ్ఞప్తి గావించిన వారిలో, సౌదీ ఆరేబియా రాజు ఇబాన్ సౌద్, ఇరాక్‌నుండి ఘజీరాజు, యెమెన్‌రాజు ఇమామ్ యెహ్యా, ట్రాన్స్‌జోర్డాన్ యొక్క అమీర్ అబ్దుల్లా కలరు. ఆ విజ్ఞప్తి ఇది.

"మా పుత్రులారా! పాలస్టయిన్ అరబ్బులారా! శాంతిని నెలకొల్పండి. రక్తపాతాన్ని మానండి. మన స్నేహితులగు బ్రిటిషు ప్రభుత్వం పైనను, న్యాయాన్ని కలుగచేస్తామని చెప్పు ప్రభుత్వ కోర్కె పైనను, ఆధారపడండి."

౭

విచారణ కమిటీలు

ఏదోరకంగా కాలంబుచ్చడములో బ్రిటనుది పైచేయి. స్వాతంత్ర్య పోరాటము వృద్ధి అయినకొలదీ, ఏదో సమాధానానికి వస్తున్నట్లు నటించడము; అలా నటించి శత్రువుల్ని బలహీనపరచి తీవ్ర నిర్బంధ విధానంతో అణచివేయడము; మనకు క్రొత్త గాదు. బ్రిటిషువారి కమిటీలను రుచి చూచిన మనము, పాలస్టయినులో మాత్రము ఈ కమిటీలు శాంతిని నెలకొల్పగలవని ఆశిస్తామా?

1936 లో పాలస్టయిన్ స్థితిగతుల విచారించడానికి 'రాయల్ కమీషన్'ను పంపిస్తామన్నది బ్రిటన్. కాని అదివరకు పంపిన ఐదు కమీషన్ల గతి ఏమిటి? హమ్మెరాఫ్ట్, షా, జాన్సన్ క్రాస్బీ, జాన్‌హోప్ సింప్సన్ కమీషన్ల విచారణ ఏమైంది? కమీషన్లలో నమ్మకము ఉండాలంటే ఎలా ఉంటుంది? వలసరాజ్య కార్యదర్శి లార్డ్ పాస్‌ఫీల్డు ఒక "శ్వేతపత్రము" ప్రకటించాడు. దానిలో యూదుల దిగుమతిని తగ్గించుతామని ప్రకటిం

చాడు. దానితో యూదులు ఆందోళనసాగించారు. సామ్రాజ్యవాద బలం యూదులమీద ఎక్కువ ఆధారపడి ఉండటమువలన రామ్సే మాక్డనాల్డు డాక్టర్ వీజ్‌మన్‌కు ఒక ఉత్తరం వ్రాస్తూ శ్వేతపత్రాన్ని రద్దుచేశానని తెలియ జేశాడు. ఇక బ్రిటిషువారి వాగ్దానాలకు విలువ ఎక్కడ?

పీల్ కమీషన్.

ఆరవ విచారణకమిటీకి లార్డ్ రాబర్టుపీల్ అధ్యక్షుడు. (ఇతడిపుడు చనిపోయాడు.) ఈయన రిపోర్టు (404 పేజీలు) 1937 జులై 7 వ తేదీనో 8 వ తేదీనో వెలువడింది. పీల్ కమీషన్ అరబ్బు, యూదు సమస్యను పరిష్కరించడానికి సూచించిన విషయాలు తెలిసికొనే ముందు అది తెల్పిన అనేక ముఖ్యాంశాలను వివరించడం అవసరము. ఈకమీషన్ ఇదివరకు అణచబడ్డ విషయాలను బయటపెట్టింది. కొన్ని చోట్ల నిజాన్ని విప్పి చెప్పడమే. ఏదైనా ఉపకారమనేది జరిగి ఉంటే, ఈ కమీషన్‌వల్ల జరిగిన ఉపకారము. ఇదివరకు జరిగిన తిరుగుబాట్లను గురించి యిలా చెబుతున్నది.

"1933 కొట్లాటలు కేవలం యూదుల్మీదదాడి మాత్రంగాదు అవి పాలస్టయిన్ ప్రభుత్వం మీదనేదాడి. 1936 లో ఇదింకా తేట తెల్లంగా బోధపడుతుంది. యూదుల పట్టణాలను స్వాధీనం చేసికోడం, యూదుల ఆస్థిని నాశనం చేయడం నిజమే కాని, తిరుగుబాటుకు ప్రధానోద్దేశ్యం ప్రభుత్వాన్ని ఎదిరించడానికే. "అల్లర్లు" అనే పదం పొరపాటు అభిప్రాయానికి తావిస్తుంది. ఇతర దేశాల అరబ్బుల సహాయంతో పాలస్టయిన్ అరబ్బులు బ్రిటిషు మాండేటు రూల్‌కు వ్యతిరేకంగా గావించిన బహిరంగ తిరుగుబాటే ఇది. తిరుగుబాటుకు కారణాలను గురించి పీల్ కమీషన్ ఇలా చెబుతుంది.

"(1) జాతీయ స్వాతంత్ర్యానికి అరబ్బుల కోరిక

(2) యూదుల 'నేషనల్ హోం' స్థాపించడానికి ధారికిగల భయమూ, ద్వేషము."

అరబ్బు యూదుల తగాదాల గురించి ఈ కమీషన్ ఇలా వ్రాసింది. "....పాలస్టయిన్‌లో తగాదాకు పూర్వం ఇతర అరబ్బు ప్రపంచంలో అరబ్బులకు యూదులకు తగాదా కొద్దిగా ఉండేది—అసలు లేదనే చెప్పవచ్చు. అలాంటి రాజకీయమగు బాధయే ఇరాక్, సిరియా ఈజిప్టులలో వచ్చింది—ఆందోళన, తిరుగుబాటు, రక్తపాతము—'నేషనల్ హోం' అనే సమస్య లేకపోయినా సంభవించాయి కాబట్టే పాలస్టయిన్ సమస్య రాజకీయ సమస్య."

ఇది ముఖ్యమైనది. బ్రిటిష్ సామ్రాజ్యం యూదుల హక్కులను ప్రతిబింబింప జేయుటవలననే యూదులపై విద్వేషం వృద్ధి కావొచ్చింది. ఇంకో విషయాన్నికూడ ఈ కమీషన్ స్పష్టపరచింది. "తీవ్రమైన నిర్బంధ విధానంవల్ల తప్పితే ఈ (బ్రిటిష్) రాజ్యం నిలబడదు."

బ్రిటిషువారు గావించిన పరస్పర విరుద్ధమగు వాగ్దానాల గురించి రిపోర్టు ఇలా చెబుతుంది. "గత 20 ఏండ్ల క్రిందట అరబ్బులకు యూదులకు బ్రిటన్ గావించిన వాగ్దానాలకు నైతికంగాగాని, న్యాయ ప్రకారము గాని, విలువ నశించిందని మేం చెప్పడంలేదు. వచ్చిన చిక్కు ఏమిటంటే అవి పొత్తుకుదరనివి. మాకు తోచినంతవరకు అవి ఇంకా తగాదాలను కొనసాగించుతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, ఇపుడున్న పరిస్థితులలో అరబ్బులు కోరుతున్న స్వాతంత్ర్యమూ, యూదులు కోరుచున్న నేషనల్ హోమూ, రెండూ ఒకసారి తీర్చలేం."

ఇది బ్రిటన్‌కు తెలియదా? తెలుసు. పాలస్టయిన్ శాశ్వతముగా తమ క్రింద ఉండాలంటే, ఈ తగాదా అవసరం. విభజించి పాలించడమే **(Divide and Rule)** బ్రిటన్ నీతి.

ఇన్ని విషయాలను గ్రహించిన పీల్ కమీషన్ మాత్రము దాని స్వభావం మానలేదు. ఎలాగైనా "తీవ్ర నిర్బంధ విధానంతో తప్ప, (బ్రిటిష్) రాజ్యం నిలవదు" గనుక, నిలిచే ఉపాయం ఆలోచించింది. ఈ కమీషన్ సఖ్యత కుదిర్చిందా? లేదు. శాంతికి దోవ చూపెట్టిందా? అదీ లేదు. స్వాతంత్ర్యం ఇచ్చిందా? ఉహుం.

పాలస్టయిన్ విభజన.

పీల్ కమీషన్ పాలస్టయిన్‌ను మూడు భాగాలుగా విభజింప సూచించింది.

(1) అరబ్బుల 'స్టేట్'
(2) యూదుల 'స్టేట్'
(3) బ్రిటిష్ మాండేట్ అధికారము క్రింద ఉండవలసింది.

ఈ సూచనలనే "ప్లాన్. ఎ." అంటారు.

	అరబ్బులు	యూదులు	మొత్తం
అరబ్ స్టేట్			
ప్రజలు	485,200	7,200	492,400
భూములు *	7007,900	37,000	7044,900
యూదుల స్టేట్			
ప్రజలు	294,700	304,900	599,600
భూములు *	3,854,700	1,140,200	4,994,900

జెరూసలం — నాజెరెత్. (బ్రిటిషు మాండేటు)			
ప్రజలు	221,400	80,200	301,600
భూములు *	1,504,600	78,800	1,583,400

దీని ప్రకారం

(1) పదవవంతు (బెధెలెహెం. నాజరెత్‌లలో సహా) బ్రిటిషు శాశ్వత మాండేట్ క్రింద ఉంటుంది.

(2) పదింట రెండుపాళ్లు (2 వేల చదరపుమైళ్ల పైగా) యూదుల చేతులలో ఉంటుంది.

(3) మిగిలనది అంటే సుమారు మూడింట రెండుపాళ్లు అరబ్బుల చేతిలో ఉంటుంది. ఇంతేగాదు. విభజన మూడు భాగాలని పేరేగాని నాల్గవ భాగంకూడా ఉంది.

హైఫా, ఆక్రీ. టిబెరియాస్ నగరాలు బ్రిటన్ క్రింద తాత్కాలిక మాండేట్ క్రింద ఉంటాయి. దానికి 'బాల్ఫర్ డిక్లరేషన్' అనువర్తించదు. ఈ విజన సూచిస్తూ అరబ్బులను, యూదులను ఒక చోటనుండి మరో చోటికి మార్చే మార్గాలనుకూడ సూచించింది. బ్రిటన్ చేతిలో ఉండే "పవిత్ర స్థలాలలో" యూదులు అరబ్బులు కలసి చదువుకొనే మిక్సెడ్ స్కూళ్ళనుకూడ స్థాపించమన్నది.

ఈ సూచనలలోని మంచి చెడ్డలనుగురించి చెప్పేముందు ఈ సూచనలగురించి పీల్‌కమీషనే ఏమి చెప్పుకొన్నదో చూద్దాం.

"అరబ్బులకు యూదులకు విభజన మంచి అభివృద్ధిని కలుగ

* ఇక్కడ ఇచ్చిన లెఖ్ఖ 'డ్యూనం'లు. 'డ్యూనం' అంటే సుమారు ఎకరంలో నాల్గవ వంతు.

చేస్తుంది. పాలస్టయిన్ సమస్యా పరిష్కారానికి గణింప శక్యంకాని శాంతి వరాన్ని ప్రసాదించే ఈపద్ధతి కంటె మరొకటి లేనే లేదు."

యూదులకు కలిగే లాభాలను గురించి రిపోర్టులో ఇలాఉంది.

1. విభజనవలన యూదులకు "నేషనల్‌హోం" లభించుతుంది. ముమ్మందు అరబ్బు ప్రభుత్వంక్రింద అణఛబడే అవకాశం లేకుండా పోతుంది.

2. విభజన యూదులను వారి "నేషనల్‌హోం" ను తమదేనని గట్టిగా చెప్పుకొనేటట్లు కావించుతుంది.

అరబ్బులకు కలిగేలాభాలను గురించి రిపోర్టు ఇలా పేర్కొన్నది.

"వారికి జాతీయస్వాతంత్ర్యం లభించుతుంది. అరబ్బు ఐక్యతకూ, అభివృద్ధికీగాను, పొరుగు దేశాలతో సమానమైన అడుగు వేయవచ్చు."

కాని యదార్థపరిస్థితులంతేనా? ఈవిభజనలోని అంతరార్థం ఏమిటి? అరబ్ హైకమిటీ "ముఖ్యమగు సారవంతమైన భూమి యూదులకు పోయి.........అరబ్బులకు పర్వతప్రాంతం మిగులు తున్నది."ని తెల్పింది. ఇంతేగాదు రాజకీయప్రాముఖ్యతగల ప్రదేశాలు,బ్రిటన్ క్రిందనేఉంటున్నాయి. పి. క్రాబైట్సు అను ఆయన ఈ విభజన గురించి అన్నదేమిటో చూడండి. "బైబిల్‌లో చెప్పినట్లు పాలస్టయిన్ అంతా తేనె,పాలుతో మయమై ఉంటే, ఇంగ్లీషువారికీ యూదులకూ పాలలోని మీగడ, వెన్న, పెరుగూ పోతు న్నది. అరబ్బులకు నీళ్ల మిగులుతున్నాయి; అలాగే తేనెలో తీపి అంతా ఇంగ్లీషువారికీ యూదులకు పోయి, పనికిమాలినతుక్కంతా అరబ్బులకు మిగులుతుంది."

* Current History – September, 1937

కాని ఈ విభజనకూడా యూదుల్ని సంతృప్తి పరచలేదు. ఏ విష యంలోను కలవని అరబ్బులు, యూదులు పీల్ కమీషన్ విభజన సూచన వల్ల ఒక విషయంలో కలిశారు. ఆ విషయం విభజన సూచనయెడల ఇద్దరూ తిరస్కారం చూపించడమే!

లార్డ్ శామ్యూల్, విభజనవలన "ఒక సార్, పోలిష్ కారిడర్; అరడజను 'మెమెల్'లు, 'డాంజింగ్'లు" చిన్నదేశంలో కల్పిం చుతున్నారు అని అన్నాడు.

ఈ విభజనలోని సరిహద్దుల నిర్ణయంగాని; అరబ్బు, యూదుల అల్ప సంఖ్యాకులను ఒక రాజ్యంనుండి ఇంకో రాజ్యంలోకి మార్చడంగాని సంతృప్తికరంగా లేకపోవడమే గాక ఈ రెండు జాతులకు ఆర్థిక, సైనిక భవిష్యత్తు సున్న. అయితే విభజనయొక్క ముఖ్యోద్దేశ్యం ఏమిటి? ఏముంటుంది? విభజింపబడ్డ పాలస్టయిన్ అయితే లాభం సామ్రాజ్యవాదా నికి. బ్రిటిష్ సామ్రాజ్యవాదతత్వం 'విభజించి పరిపాలించడం'. ఐర్లండును విభాగించి. కాథలిక్కులకు ప్రొటెస్టెంటులకు వైరుధ్యం చావకుండా చేసింది. హిందూదేశంలో హిందూ మహమ్మదీయ సమస్య ఉండనే ఉన్నదికదా! పాలస్టయిన్‌లో అరబ్బులూ యూదులూ!! ఇలా ఒకరి కుత్తుకలు ఒకరు కోసుకుంటూంటే బ్రిటను హాయిగా బ్రతుకవచ్చు.

వుడ్‌హెడ్ కమీషన్.

అయితే ఈ సూచనలు ఆచరణలోకి రాలేదు. పై రాయల్‌కమీషను సూచనలు ఆచరణలో పెట్టడానికి, (టెక్నికల్ విషయాలను ఆలోచించడా నికి) మరొక కమీషన్‌ను బ్రిటన్ 1938 ఫిబ్రవరి 28 వ తేదీన నియమిం చింది. ఈ కమీషన్‌కు చైర్మన్ సర్ జాన్ ఎ. వుడ్‌హెడ్. ఈయన 1934


లో కాబోలు బెంగాల్కు ఆక్టింగ్ గవర్నరుగా పనిచేశాడు. దానిలో ఇతర మెంబర్లు మిష్టర్ ఎ. సి. వాటర్‌ఫీల్డు, సర్ ఆలిసన్‌రస్సెల్, మిష్టర్ టి. రీడ్. వీరందరూ పాలస్టయిన్‌లో ఏప్రిల్‌లో సంచారం ప్రారంభించి ఆగస్టులో తిరిగివచ్చారు. మొత్తం మూడు నెలల ఒక దినం విచారణ ప్రారంభించారు. వీరు పాలస్టయిన్ వెళ్లెసరికి తిరుగుబాటు మాత్రమే ఉంది! కాని తిరిగి వచ్చేనాటికి అది ఒక అంతర్యుద్ధంగా మారింది॥

వుడ్‌హెడ్ కమీషన్ నియమించడం అరబ్బులకు మరింత క్రోధం గల్గింది. అరబ్బులకు పూర్తిగా బహిష్కరించారు. సాక్ష్య మిచ్చింది యూదులూ, బ్రిటిష్ సివిల్ ఆఫీసర్లూ. ఈ కమీషన్ రహస్య విచారణ ప్రారంభించిది. 300 వందల పేజీలుగల ఒక రిపోర్టును తయారుచేసింది. ఈ రిపోర్టులో రస్సెల్, రీడ్ గార్లు కొన్నిభాగాలతో ఏకీభవించలేదు.


వుడ్‌హెడ్ కమిటీ సూచనలు 1938 నవంబరు 9 వ తేదీన ప్రకటించ బడ్డాయి. ఈ కమీషన్ అసలు 'విషయాలను కనుక్కొనేందుకు' (Facts finding) నియమింపబడినా, ఇది చేసిన పనివేరు. మొత్తం పీల్‌కమీషన్ విభజన సూచనలనే త్రోసిపుచ్చింది. పీల్ విభజనను త్రోసిపుచ్చుతూ చెప్పిన కారణాలివి (1) ప్రపోజ్ చేసిన యూదుల స్టేటునుండి అరబ్బులను మరోస్థలానికి మార్చడం అసంభవం, (2) ఎక్కువగా పూర్తిగానే అనవచ్చు - అరబ్బులతో నిండిన 'గాలిలీ' ని యూదుల స్టేటులో కలపరాదు. పీల్‌కమీషన్‌ను త్రోసిపుచ్చిన వుడ్‌హెడ్ కమీషన్ ముందు రెండుసూచనలు వచ్చాయి. ఒకటి బిప్లాను, రెండవది సిప్లాను.

'బి' ప్లాను

పీల్‌కమీషన్ విభజనకు కొద్ది సవరణే "బి. ప్లాను". పీల్‌కమీషన్ విభజన (ఎ ప్లాను) లో యూదుల స్టేటులో 'గాలిలీ' అను భాగాన్ని,



పాలస్తయిన్ విభజన



విభజన పరిహసించే వ్యంగ్య చిత్రం

మరికొంత అరబ్బు ప్రదేశాన్ని తీసివేయాలి. ఈ తీసివేసిన భాగం అరబ్బు స్టేట్‌లో కలపాలి.

కాని "భి. ప్లాను" వుడ్హెడ్ కమిటీలోని అధిక సంఖ్యాకులు తిరస్కరించారు. "బి.ప్లాను"లోని విశేషం ఏమీలేదు. 'ఏ. ప్లాను' ప్రకారం ఉండే యూదుల స్టేటులో అల్పసంఖ్యాకులు అరబ్బులు, ఆ అరబ్బుల సంఖ్యను ఇంకా తగ్గిస్తుంది. (294,700 నుండి 188,000 లకు)

సి. ప్లాను

సి. ప్లాన్‌నే ఎక్కువ మంది వుడ్‌హెడ్ కమీషన్‌లో వారంగీకరించారు. అది సూచించిన ప్రకారం పాలస్తయిన్ అయిదు భాగాలవుతుంది.

1. ఉత్తరభాగం. మాండేట్ క్రింద ఉండాలి.
2. దక్షిణభాగం. ఇదీ మాండేట్ క్రింద ఉండాలి.

   మధ్యభాగాన్ని మూడుముక్కలు చేయాలి. అవి.

3. అరబ్బుస్టేట్.
4. యూదుల స్టేట్.
5. జెరూసలం (ఎన్‌క్లేవ్). పీల్‌కమీషన్ గావించిన సూచనల కంటే మరింత క్లిష్టంగా ఇవి గావించబడినయి. దీని ప్రకారం

అరబ్ స్టేట్.

	అరబ్బులు	యూదులు	మొత్తం
ప్రజలు	444,100	8,900	453,000
భూములు	7,329,700	63,800	7,393,500

యూదుల స్టేట్

	అరబ్బులు	యూదులు	మొత్తం
ప్రజలు	54,400	226,000	280,400
భూములు	821,700	436,100	1,257,800

మాండేటరీ ప్రదేశాలు.

ప్రజలు	502,800	157,400	660,200
భూములు	6,160,200	811,500	6,971.700

వుడ్ హెడ్ కమిటీ గావించిన సూచనల ప్రకారం బ్రిటిషు ప్రభుత్వానికి సంవత్సరానికి 1.250,000 పౌనులు ఖర్చుఅవుతుందని అంచనావేశారు దీని సూచనల ప్రకారం, మాండేటరీ క్రిందనుంచే భాగాలు (1, 2) భవిష్యత్తులో పరస్పర సహకారం కుదిరితే స్వాతంత్ర్యం సంపాదించుకోవచ్చు. ఆ యా ప్రదేశంలోని ఎక్కువసంఖ్య గలవారు అల్పసంఖ్యాకులతో సంధికివస్తే స్వాతంత్ర్యం సంపాదించుకోవచ్చునట. (దానికి 10 ఏండ్లుండాలట)·

ఈ కమీషన్ యూదులకు స్టేట్ ఏర్పరచాలని సూచించడంవలన "నేషనల్ హోం" ఏర్పడినట్లే అని చెబుతుంది. యూదుల దిగుమతిమీద కొంత నిర్బంధం గావించాలని సూచించింది.

ఆర్థికస్థితినిగురించిచెబుతూ మాండేటరీ దేశాలతో అరబ్బుస్టేట్‌కు "కస్టమ్స్ యూనియన్" కావాలన్నది. అంటే మాండేటరీ ప్రభుత్వంపైన అరబ్బుస్టేట్ ఆధారపడటం అన్నమాట. ఈ సూచననే 'ఎకనమిక్ ఫెడరలిజం' అంటారు.

ప్రస్తుత పరిస్థితులలో యూదులకుగాని, అరబ్బులకుగాని, సంపూర్ణ (ఆర్థిక) స్వాతంత్ర్యం ఇవ్వడం అసంభవం" అనికూడా ఈ రిపోర్టు తెల్పింది.

పీల్ కమీషన్‌ను తిరస్కరించిన వుడ్‌హెడ్ కమీషన్, విభజనకు తగిన సరిహద్దులను నిర్ణయించలేకపోయింది. ఉన్నది నల్గురుసభ్యులు. ఒక మెంబరు బి. ప్లానును సూచించాడు. ఇక ఇద్దరు మెంబర్లు (చైర్మెన్‌తో సహా) సి. ప్లాను మంచిదంటారు. ఇక నాల్గవమెంబరు "సి. ప్లాను" ఉన్నవాటిలో మంచిదే కాని, రెండు ప్లానులూ ఆచరణయోగ్యం కావని అన్నాడు. 1937 లో ఒక కమీషన్‌ను బ్రిటన్ నియమించింది. మరొక కమీషన్‌ను 1938 లో నియమించింది. మొదటి కమీషన్‌ను రెండవది ఖండించింది. రెండవదానిని ఖండించడానికి మూడో కమీషన్ కావలసి రాదుగదా! అక్కర్లేదు. విభజనసూచనలే అపుజేశామంటూ ప్రభుత్వం ప్రకటించింది. రక్షించింది!

విభజన సూచనలను నిల్పివేయటానికి గల కారణాలను తెల్పిన ప్రభుత్వ ప్రకటన సారాంశ మిది.

1. బ్రిటిషుప్రభుత్వం విభజనసూచన ఆచరణ యోగ్యం కాదని నమ్ముతుంది.

2. పాలస్టయిన్‌లో ప్రస్తుత కష్టపరిస్థితులను ఎదుర్కొంటానికి ప్రధమమార్గం "యూదులూ, అరబ్బులూ ఒక రాజీకి రావడం."

3. భవిష్యద్విధానం ఆలోచించడానికీ, పాలస్టయిన్‌లో యూదుల దిగుమతిని గురించి చర్చించడానికీ, లండనులో జరుగనున్న కాన్ఫరెన్సుకు పాలస్టయిన్‌ను; దాని పొరుగు రాజ్యాలను; ప్రపంచ యూదు సంఘాన్ని (జ్యూయిష్ ఏజన్సీ) పిలుస్తుంది.

4. ఒకవేళ ఈ సంభాషణలుకూడ తగుకాలములో ఒడంబడికతీసుక రాలేకపోతే బ్రిటిషు ప్రభుత్వం తానే నిర్ణయం గావించి, తన విధానాన్ని ప్రకటించుతుంది.

ఈ ప్రకటనతో "మంచి, ఆశాజనకమైన పరిష్కారమార్గము" అని బ్రిటిషు ప్రభుత్వం పూర్వం తలచిన 'పాలస్టయిన్ విభజన' ఆగిపోయింది.

౯

అంతర్యుద్ధం


1936 లోని సర్వవ్యాపిత సమ్మె ఆపివేయబడిన తర్వాత పీల్‌కమీషన్ సూచనలు 1937 జులైలో వెలువడ్డాయి. దీనితో అరబ్బుల ఆగ్రహం వృద్ధిచెందింది. అదివరకు యూదులకు, అరబ్బులకు అక్కడక్కడా చిన్న చిన్న తగాదాలు కలిగినా అంత గమనింపరానివి. పీల్‌కమీషన్ సూచనలతో అరబ్బుల ద్వేషమంతా ప్రభుత్వంపైన కేంద్రీకృతం చేయబడింది. ఎవరో 'తెలియనివారు' బాంబులవేయ ప్రారంభించారు. బ్రిటిషుసైనికులను ఆఫీసర్లు చంప ప్రారంభించారు. తర్వాత కొట్లాటలు తీవ్రమయినాయి.

1937 లో

1937 అక్టోబరు 1 వ తేదీన మళ్ళా పాలస్తయిన్ సైనికులను తిరిగి ప్రోపుచేసింది ప్రభుత్వం. 1936 తిరుగుబాటులో దాదాపు 30 వేల మంది సైనికులు పనిచేశారు. తిరుగుబాటు అణగిపోగానే 7 లేక 8 వేలకు



మెషిన్ గన్లతో కాల్పుతున్న బ్రిటిష్ సైనికులు.



అరబ్బు ఖైదీలకు జైలు ద్వారం. యూనియన్ జాక్‌గా కన్పించుచున్నదని ఒక బెర్లిన్ పత్రిక పరిహసించుచున్నది.

సైన్యం తగ్గిపోయింది. కాని ఇపుడు అరబు జాతీయోద్యమాన్ని తుదముట్టించడానికి రప్పింపబడ్డారు. అక్టోబరు 1 వ తేదీన "అరబ్ హైయర్ కమిటీ" (ఇదే అరబ్బుల రాజకీయ సంస్థ) ని నిషేధించారు. అరబ్బు నాయకుల నైదుగురిని అరెస్టు చేశారు. ఇందులో నల్గురు "అరబ్బు హైయర్ కమిటీ" సభ్యులు. జరూసలం నగరానికి మేయర్ అగు హుస్సేన్ ఖలిడీ; అరబ్ హైయర్‌కమిటీ కార్యదర్శి ఫాన్‌సాబూ అను వారలున్నారు. ఇంతేగాక గ్రాండ్ ముఫ్టీని ముస్లిం సుప్రీం కౌన్సిల్ అధ్యక్షపదవినుండియు,జనరల్ వాక్ఫ్‌కమిటీ చైర్మన్ పదవినుండియు తొలగించి; వాక్ఫ్‌కమిటీ సభ్యత్వం కూడా రద్దుచేశారు. పైగా అరస్టువారంటుపెట్టారు. ఇంకా ఇతరులనేకమందిని అరస్టు చేశారు. ఈ అరస్టులకు కారణం తెల్పుతూ ప్రభుత్వం ఒక ప్రకటన గావించింది.

"అరబ్బులు కొందరు జూన్ 13 వ తేదీన పాలస్టయిన్ పోలీసు ఇనస్పెక్టర్ జనరల్ ఆర్. జి. బి. స్పెసర్‌ను హత్యచేయ యత్నించి విఫలులయారు. కాని సెప్టెంబరు 23 వ తేదీన జిల్లా పోలీసు కమీషనర్ ఆండ్రూస్‌ను హత్యగావించారు. ఇలాంటి "సంఘటిత దౌర్జన్య హత్యల గావించే ముఠా" దేశంలో శాంతి భద్రతలకు అపాయకరం. వీటికి నైతికంగా కారకులయినవారు అరస్టు కాబడినారు" అని ప్రకటనలో ఉన్నది.

కాని నిజమదికాదు. అరబ్బు హైయర్ కమిటీ ఈ దౌర్జన్యాలను ఖండించింది. ప్రవాసశిక్ష విధింపబడిన డాక్టర్ ఖలిడీకూడ తమకెట్టి సంబంధం లేదన్నాడు. ఫాసిస్టు ఏజంట్లు కొందరీ పనులుగావించారని అనుమానంకూడా ఉంది. ఆరోజుల్లో మధ్యధరాసముద్రంలో "తెలియని సబ్‌మెరిన్లు" లాగానే పాలస్టయిన్‌లో "తెలియని హింసావాదులు" బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడబిడచేశారు. తగిన సాక్ష్యమున్నా ఫేసిస్టులపై చర్య

గావించడానికి ధైర్యంలేదు. ఆగోజుల్లో పీల్‌కమీషన్ విభజనను ఎలాగైనా నెత్తిన రుద్దేందుకు ఈ నిర్బంధ విధానం ప్రభుత్వం ప్రారంభించింది. 1937 అక్టోబర్ 21 వ తేదీన ఆరబ్బుల ఏకైక నాయకుడగు గ్రాండ్‌ముఫ్టీ (పూర్తిపేరు, హాజ్ ఎమిన్ ఎఫెండీ ఎల్ ఘూస్సేనీ) ఫ్రెంచి మాండేటరీ రాజ్యమగు సిరియాకు పారిపోయాడు. 1937 ఆక్టోబర్‌నుండి విప్లవాగ్ని, సన్నసన్నగా రాజుతూ 1938 జులై నాటికి పెద్దమంటగా తయారయింది.

1937 లో జరిగిన చిన్న సంఘటలను అధారంగా తీసుకొని అరబ్బు జాతీయ ఉద్యమాన్ని తీవ్రంగా అణచదలచింది ప్రభుత్వం. అందుకని బెంగాల్‌లో టెర్రరిస్టు ఉద్యమాన్ని తీవ్రంగా అణచి 'బుల్‌డాగ్' అని పేరు పొందిన సర్ ఛార్లెస్ టెగార్టును, 1937 అక్టోబర్ చివరివారంలో "ప్రభుత్వానికి పోలీసుల కర్తవ్యాన్నిగురించి సలహా" నివ్వడానికి నియమించారు. ఇదివరకున్న హైకమీషనర్ తగినంత నిరంకుశంగా ఉండదేమోనని 1931 నుండి హైకమీషనర్‌గా ఉన్న సర్ ఆర్థర్ వాచోప్‌ను "అనారోగ్యం" వలన లండను పిలిపించి, 1938 మార్చి 3 వ తేదీన సర్‌హెరాల్డు మాక్ మైకేల్‌ను హైకమీషనర్‌గా నియమించారు.

మొదటినుండీ పాలస్టయిన్‌లో ప్రభుత్వ నిర్బంధవిధానం ఒకటే. ఉద్యమం తీవ్రంగాక ముందుకూడా-అంటే 1937 లోనే—అరబ్బునాయకుడగు షేక్‌ఫరాన్ సాదీని 1937 డిశంబరులో ఉరితీశారు. ఆనాడు అరబ్బు విప్లవకారులు ఇలా ఒట్టుపెట్టుకున్నారు. "ఇంగ్లీషువారిని ఈ దేశమునుండి తరమేదాకా మేము నిద్రపోము." అలాగే 1938 జనవరి మొదటివారంలో కొంత ఆయుధ సామాగ్రిని అమ్మినందులకే 19 ఏండ్ల యువకుడు-సులేమాన్ ఆలీ-కి ఉరిశిక్ష విధించబడింది. హెబ్రాన్ నగరంలో టెలి

గ్రాఫ్ తీగెలు నరికినందుకుగాను 2750 పౌనుల ప్యూనిటివ్ పన్నువేశారు. ప్రభుత్వపు 'సెన్సార్‌షిప్' వల్ల సైనికులు గావించే దౌర్జన్యాలగురించి మనకు వార్తలురావు. అయినా ఈ క్రింది విషయాలు బహిరంగపరుపబడినాయి ఏదోవిధంగా. "1937 లో లిడ్డా విమాన కేంద్రంమీద బాంబులవేయడంవలన చాలా భవనాలు నాశనమయ్యాయి. బ్రిటిషు సైనికులు ఆ పట్టణాన్ని ఆక్రమించుకొని చాలా ఇండ్లను డైనమైట్లతో కూల్చివేశారు. గత సంవత్సరం ప్యూనిటివ్ పన్ను చెల్లించలేదని, ఇపుడు ఆ 5000 పౌనులు చెల్లించమని గ్రామస్థులను పీడించారు.

ఆయుధాలకోసం వెదుకుతూ దహరియా అనే గ్రామంలో 3 అరబ్బు ఇండ్లనుకూల్చి అరబ్బు స్త్రీలను బజార్లలోకి లాగి బట్టలూడదీసి వెదికారు. కాని లాభం లేకపోయింది. ఆఫీసర్ 'పోయిన రైఫిల్సు దొరికేదాకా ఇంకా ప్యునిటివ్ పన్ను విధించుతాం' అని ప్రకటించాడు *

టెగార్టు గోడ.

బ్రిటిషువారికి సలహా ఇవ్వడానికి వచ్చిన టెగార్టు 1938 లో సరిహద్దుచుట్టూ "ముండ్లతీగె" చుట్టించడానికి సలహా నిచ్చాడు. ఆ సలహా ప్రకారం మేలో పని ప్రారంభమయింది. దీనిని నిర్మించడానికి ప్రభుత్వం ఎంత తంటాలుపడిందో చూడండి.

ఈ తీగె కంచెకు 'టెగార్డ్‌గోడ' అని పేరు. ఒక 100 రోజులు ఇది నిర్మించడానికి పట్టింది. పాలస్టయిన్-సిరియా హద్దులగుండాను, పాలస్టయిన్-ట్రాన్స్-జోర్డాన్ సరిహద్దులగుండాను ఆయుధాలు రాకుండుటకు; సాయుధులగు అరబ్బు సైనికులు, విప్లవకారులు తిరుగకుండుటకు; ఇది

* Daily Herald—October 30, '37.

ఉద్దేశింపబడింది. దానికి 100,000 పౌనులు ఖర్చయాయి. స్థానిక పరిస్థితుల ననుసరించి దాని వెడల్పు మారుతుంటుంది. ఎత్తు రెండు గజాల పైగా ఉంటుంట. వెడల్పు చాలాభాగం 6 గజాలకు పైగా ఉంది. ఇవేగాక ఇనుపసువ్వలు, తీగె ముడులు అక్కడక్కడ ఉంటాయి. 20,000,000 గజాలకు పైగా ఇనుపతీగె ఇంగ్లండునుంచి దీనికోసం దిగుమతి అయింది.

అవసరమైతే తీగెను విద్యుచ్ఛక్తితో సంబంధం పెట్టడానికి అవకాశాలు గల్గించాడు. అలవిరాని అరబ్బుయోధులు ఒకవేళ దానిని తెగగొట్టడానికివస్తే, విద్యుచ్ఛక్తి ఉండటంవల్ల ముట్టుకుంటే చచ్చిపోతారు. 20 గేట్లు మిలిటరీ కాపలాతో ఉన్నాయి.


ఈ గోడను నిర్మించకుండా అరబ్బు లనేక ప్రయత్నాలు గావించారు. అందుకోసరమని పనిచేసేవారలను కాపలాకాస్తూ పోలీసులున్నారు. వారికి సహాయంగా ఆర్. ఎ. యఫ్. విమానాలున్నాయి. వీరు అధికారులతో రేడియోద్వారాను, కనపడే సిగ్నల్సుద్వారాను, దగ్గరసంబంధం పెట్టుకొనేవారు. ఇలా బ్రిటిషు ప్రభుత్వ సలహాలననుసరించి, పాలస్టయిన్ ప్రభుత్వం రక్షణ సన్నాహాలు కావించింది. కాని స్వాతంత్ర్య పిపాస ఉన్నంతకాలం ఆయుధాలు, విమానాలు ఆగుతాయా?

ఉద్యమ తీవ్రత.

ఇదివరకు 1936 సర్వజన వ్యాపితాసమ్మె అంతమయాక 1937 లో కొంతపోరాటం జరిగి ఆగిపోయిందనీ, మళ్లా 1938 జూలైలో ప్రారంభమయిందనీ చూచాం. జులై 6 వ తేదీన బాంబులవలన పాలస్టయిన్‌లో 20 మంది చనిపోయారు. 60 మంది గాయపడ్డారు. దానితో కొట్లాటలు ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల ఇండ్లు తగులబెట్టబడినాయి. జులై 9 వ



ఇరాక్ వైపును కాపాడుచున్న బ్రిటిష్ సైనికులు



బెగార్డు



'బెగార్డు గోడ' కోసం తీసుకపోతున్న ముండ్ల తీగె

తేదీన బ్రిటన్ మరికొన్ని సైన్యాలను పంపింది. జులై 25 వ తేదీన హైఫాలో బాంబులు మళ్ళా చెలరేగాయి. కర్ఫ్యూ ఆర్డరీయబడింది. పోలీసులు రాయలు మెరీన్స్, లారీలతో, ఫైర్ ఇంజన్లతో పట్టణమంతా తిరిగారు. ఆనాడు 47 గురు అరబ్బులు, 43 గురు యూదులు చనిపోయారు.

ఈ తిరుగుబాటు నణచడానికి హైకమీషనరుకూ, అతని ప్రతినిధులకూ ఎక్కువ అధికారాలు ఈయబడినాయి. "వారు ఎవరినైనా అరెస్టు చేయవచ్చు. మిలటరీ ట్రిబ్యునల్ ముందువిచారింప వచ్చు. అవసరమయితే ఆయుధాలను కల్గి ఉన్నందుకుగాని, అశాంతిని ప్రేరేపించి నందుకు గాని, ఉరిశిక్ష విధించవచ్చు."

జులైలో ప్రారంభింప బడిన ఈ తిరుగుబాటు అక్టోబర్‌లో ఉచ్ఛస్థితికి వచ్చింది. అరబ్బులు గొరిల్లా పద్ధతుల నవలంబించి యుద్ధంచేయసాగారు. రాత్రులందు వీధులవెంటగాని, రహదారుల వెంటగాని తిరుగరాదని "కర్ఫ్యూ" ఆర్డర్ ప్రకటించ బడింది. అనేకచోట్ల 'మార్షల్ లా' (మిలటరీ ప్రభుత్వం) ప్రకటించ బడింది. అనుమానింప బడినవారు అనేక వందలమంది కాన్‌సెంట్రేషన్ క్యాంపులలో ఉంచబడ్డారు. అయినా పోరాటం అణగలేదు.

అక్టోబర్‌లో నిర్మాణయుక్తంగా గొరిల్లా యుద్ధాలు సాగినయి. విప్లవకారులు రహస్యంగా కోర్టులు స్థాపించారు. ప్రభుత్వకార్యాలయం స్థాపించారు. తమ జెండా (నలుపు, తెలుపు, ఆకుపచ్చరంగులు కలది) క్రింద కొంతభాగం స్వాధీనం చేసుకున్నారు.

ఇదివరకులాగా వీరు అక్కడక్కడా ఏదో ఒక బాంబువేసి పోయేవ్యక్తిగత దౌర్జన్యవాదులు కాదు. ఇపుడు సైన్యాలను నడపగల్గిన, సైనికశిక్షను తెలిసినవారు. గొరిల్లా సైన్యాలు తిరుగుబాటుదార్లకున్నాయి. వారి నాయ

కుడు గ్రాండ్‌ముఫ్టీ ప్రవాసంలో ఉన్నా ఎప్పటికప్పుడు రహస్య ఉత్తర ప్రత్యుత్తరాలద్వారా తిరుగుబాటును సాగిస్తున్నాడు. ఇక సైనికనాయకత్వం, అబ్దుల్ రహీమ్, అబ్దుల్ రజాక్ అనువారలది. వీరిద్దరిని గురించి ప్రభుత్వ యుద్ధశాఖా ప్రచురణశాఖవారు ఇలా వ్రాశారు.

"అబ్దుల్‌రహీమ్ మంచి కుటుంబంనుంచి వచ్చాడు. చదువుకొన్నవాడు. తక్కిన తిరుగుబాటు దార్లకన్న చాల మర్యాదగలవాడు. దేశభక్తి కలవాడు. ముఫ్టీవిధానాన్ని వ్యతిరేకించే మితవాదుల నందరినీ హత్య చేయాలనే రకంకాదు.

అబ్దుల్‌రజాక్ తక్కువ కులంలో నుంచి వచ్చాడు. చదువుతక్కువ. విచక్షతలేని క్రూరత్వం వలన, ముఫ్టీ ఏది చెపితే అది చేయడం వలన నాతడు పెద్దవాడయ్యాడు." ఇంకా ఏవేవో కథలు—వారిలో వారికి సరిపడదని, వ్రాసింది. అయితే అబ్దుల్ రహీమ్ నాబ్లస్‌కు సమీపంగా ఉన్న గ్రామంలో బ్రిటిషువారితో పోరాడుతూ, బ్రిటిష తుపాకులకు గురియై చనిపోయినట్లు 1939 మార్చి 27 వ తేదీన ఒకవార్త ప్రచురింప బడింది.

గొరిల్లా యుద్ధం.

తిరుగుబాటుదార్ల నాయకత్వాన గొరిల్లా సైన్యాలు ఏమిచేసేవి? గొరిల్లాలు చిన్నచిన్న ముఠాలుగా పోయి, రాత్రులందు గవర్నమెంటు ఆఫీసులమీద, పోలీసు స్టేషన్లమీద, తపాలా ఆఫీసులమీద అకస్మాత్తుగా దాడిసల్పేవారు. దోపిడిచేసేవారు. అవసరమయితే బాంబులు విసిరేవారు. ప్రభుత్వోద్యోగులను, దేశద్రోహులను, విప్లవోద్యమానికి అవసరమయిన సహాయాన్ని ఈయ నిరాకరించిన వారిని బాంబులవేసిగాని, తుపాకులతో కాల్చిగాని చంపేవారు. రైలుపట్టాలను పెరికి, బ్రిటిషు సైనికులను ఒకచోట

నుండి మరొకచోటికి రానీయకుండ చేసేవారు. రైల్వే లైన్లలోను. మోటారు రోడ్లమీదను డైనమిట్లుపెట్టి పేల్చేవారు. బ్యాంకులను పోస్టాఫీసులను దోచుకొనేవారు. రోడ్లపైన బండలు, చెట్లు, కొమ్మలు గుట్టలుగా అడ్డు (Barricades) పెట్టుకొని పోరాడేవారు. దొంగచాటుగా బ్రిటిషు సైనికులను కాల్చేవారు. గొరిల్లా నిర్మాణయుత పోరాటం వలన అక్టోబర్ (1938) రెండవ వారానికి గొరిల్లాల చేతిలో కొంత రాజ్యం చిక్కింది. పల్లెలలోను పట్టణాలలోను స్వతంత్ర ప్రభుత్వాలను స్థాపించారు. పాలస్టయిన్ ప్రభుత్వసేనలు కోర్టులు, పోస్టాఫీసులు, పోలీసు స్టేషనలూ, రైల్వే స్టేషనులూ వదలి ముఖ్యనగరాలకు పారిపోయారు. మధ్యధరాసముద్ర తీరంలోనున్న 'టెల్‌అవివ్' పట్నంనుండి 'డెడ్‌సీ' వరకుగల 750 చదరపు మైళ్లు, విప్లవకారుల చేతులలో చిక్కింది. జెరూసలం ప్రాతపట్టణంకూడా వశమయింది. జెరూసలం క్రొత్తపట్టణంలోని బ్రిటిషుసైనికులను చుట్టుముట్టారు.

తిరుగబడ్డ అరబ్బుసైనికుల సంఖ్య ప్రభుత్వ లెక్కల ప్రకారం 5 వేల మందే కాని వారి వెనుక అరబ్బు ప్రజాసామాన్యపు బలమున్నది. నవీన ఆయుధపరికరాలంతగా లేవు కాని బ్రిటిషువారిని హడలుకొట్టే గొరిల్లా పద్ధతులున్నాయి. ఇక ప్రభుత్వ సైన్యాలు చూద్దాం. ప్రభుత్వ లెక్కలప్రకారం, మిలిటరీ యూనిట్లు, విమానబలమూ కలిసి 18,500 మంది. వీరిలో ట్రాన్స్‌జోర్డాన్ సరిహద్దు సైనికులనూ, ఇతర పోలీసులనూ కల్పలేదు. మొత్తం సైనికులు 35 వేలమంది ఉంటారని అంచనా. సైనికులుగాక బ్రిటిషు ప్రభుత్వానికి, 2 వేలదాక యూదు వలంటీర్లున్నారు. పూర్వం ఉద్యోగం చేసి విరమించిన వారున్నారు. అన్నిటికంటె ముఖ్యమైన యుద్ధవిమానాలు, యుద్ధనావలు, ఫిరంగులు, టాంకులు, ఆర్మర్డ్ కారులూ, మిషన్‌గన్‌లూ ఉన్నాయి.

అక్టోబరు 19 వ తేదీన అరబ్బులకు, బ్రిటిషు సైన్యాలకు తీవ్ర యుద్ధం జరిగాక, ప్రాత జెరూసలం మళ్ళా బ్రిటిషువారి స్వాధీనమయింది. జెరూసలం స్వాధీనం కాగానే, తక్కినచోట్లకూ విమానబల సహాయంతో "తుడిచివేయ" ప్రారంభించారు. అదివరకు అక్టోబరు 16 వ తేదీన 12 పట్టణాలలో కర్ఫ్యూ ఆర్డరు ప్రకటింపబడింది. అది చాలక, అక్టోబర్ 21 వ తేదీన డిష్ట్రిక్టు కమిషనర్లను తీసివేసి, మిలిటరీ కమాండర్లనే అధికారులుగా నియమించారు. 16 ఏండ్ల పైబడినవారందరూ 'గుర్తించే కార్డు'ను కల్గియుండాలని ప్రకటించారు. దానికి అరబ్బు విప్లవకారులు అలాంటి కార్డులు కలిగిఉంటే కాల్చివేస్తామని ప్రకటించారు. ఇంతేగాక ప్రయాణానికి అనుమతినిచ్చే "ట్రావెల్ పరిమిట్లు"ను కోరాలని ప్రభుత్వం ప్రకటించింది. అలా కోరిన అరబ్బులను కాల్చి చంపుతామని విప్లవకారులు ప్రకటించారు. జాఫాలోను, హైఫాచుట్టు నున్న ప్రదేశాలలోను బ్రిటిషు సైనికులు అరబ్బులను ఎదిరించసాగారు. మెగిడ్డో అను గ్రామంలో ఒక విప్లవకోర్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. నవంబరు 1 వ తేదీన ప్రయాణాలపైన నిర్బంధానికి అసమ్మతి చూపుతూ అరబ్బులు 3 రోజులు సర్వజనవ్యాపిత సమ్మెచేశారు. జాఫాలోని సోదాలఫలితంగా 700 మందికి పైగా డిటైన్ చేయబడ్డారు. పట్టణాలలోనేగాక పల్లెలలో బ్రిటిషు సైన్యాలు అరబ్బులపై దాడి సాగించినాయి. అరబ్బులు ఎదుర్కొన్నారు. పాలస్టయిన్ తిరిగి డిశంబర్ మాసాంతానికి చాలవరకు బ్రిటిషు సైనికుల స్వాధీనమయింది.

పోరాట ఫలితం?

1938 జులైలో తిరుగుబాటు ప్రారంభింపబడిన నాటినుండి ఆసంవత్సరాంతానికి 'పాలస్టయిన్ పోస్టు' పత్రిక లెఖ్ఖ ప్రకారం 1997 మంది చని

పోయారు. 1720 మంది గాయపడ్డారు. కాన్సెంట్రేషన్ క్యాంపులలో 2 వేలమంది ఉంచబడ్డారు. చనిపోయినవారిలో అధిక సంఖ్యాకులు అరబ్బులే. 1138 అరబ్బులు 'దోపిడిగాండ్రు' (అంటే విప్లవకారులు) 486 మామూలు అరబ్బు ప్రజలు, 292 యూదులు ఉన్నారు. మాంచెస్టరు గార్డియన్ పత్రిక లెఖ్ఖప్రకారం 1937 నవంబరు నుండి 1938 నవంబరు లోగా 263 కేసులు మిలిటరీ ట్రిబ్యునల్సు విచారించింది. 23 రికి యావజ్జీవ శిక్ష, 101 మందికి 450 ఏండ్లవరకు శిక్ష విధించబడింది. తమ దేశాన్ని బ్రిటిషువారికి అమ్మే అరబ్బు ద్రోహులను 133 మందిని 1938 లో విప్లవకారులు చంపారని "పాలస్టయిన్ పోస్టు" అను పత్రిక వ్రాస్తుంది. అన్నిటికంటె విచారకరమైన విషయం, అరబ్బుల నాయకుడు అబుదురా చనిపోయాడని వదంతి. గోరిల్లా సైనిక నాయకుడగు అబ్దుల్ రహింకూడా చనిపోయాడు. ఒకరిద్దరు నాయకులు చనిపోయినా ఉద్యమం ఆగదుగదా! నాబ్లస్‌వద్ద 'టెగర్టు'ను చంపడానికి ప్రయత్నం జరిగింది కాని అతనికిబదులు, సాండర్సన్ అను మరొక ఉద్యోగి మరణించాడు. ఫిబ్రవరి 22 వ తేదీన మాల్కాం మాగ్డనాల్డు పాలస్టయిన్ తిరుగుబాటువలన గల్గిన వ్యయాన్ని గూర్చి ఇలా చెప్పాడు. పాలస్టయిన్ ప్రభుత్వంగాక బ్రిటిషు ప్రభుత్వం 1,120.000 పౌనులు భరించుతుంది. 113,000 పౌనులు ట్రాన్సుజోర్డాన్ సరిహద్దు సైనికులకోసరం ఖర్చు చేయబడుతుంది. ఇవి గాక పాలస్టయిన్ ప్రభుత్వం 1,187.000 పౌనులు ఖర్చులకుగాను 'గ్రాంట్' చేసింది.

ఘాతుక కృత్యాలు.

మిలిటరీ, ఆయుధ బలమేగాక, ఉద్యమాన్ని అణచడానికి బ్రిటిషు ప్రభుత్వం అవలంబించిన ఘాతుక కృత్యాలు హృదయ విదారకరంగా ఉంటాయి. ఇండ్లను పడగొట్టడం, షాపులను దోచుకోవడం, అరబ్బు విప్లవ

నాయకుల పేర్లను చెప్పమని బలవంత పెట్టడం మామూలే. జెరూసలంను తిరిగి స్వాధీనం చేసుకొన్నప్పుడు అందరి భుజాలు తమిడి చూచారు. తుపాకులను మోయుచున్నట్లు గుర్తుంటే కాల్చి చంపేవారు. స్త్రీలను సైతం బయటకులాగి బట్టలూడదీసి ఆయుధాలకోసం పరీక్ష చేసేవారు. ఫేసిస్టు పత్రికలు, అరబ్బులు ఆకలితో చచ్చిపోతూన్నారనీ. అరబ్బులను బ్రతికియుండగానే కాల్చుతున్నారనీ, గుడ్లు పీకుతున్నారనీ ప్రకటించినాయి. బ్రిటిషు ప్రభుత్వం వీటిని అబద్ధమన్నది. కాని జెరూసలంలో సైనికులు ఆహారాన్ని ప్రజలకు పంచిపెట్టారని ఒప్పుకొంది. ఫేసిస్టుపత్రికలు గనుక చెప్పింది అబద్ధమే ననుకొందాం. కాని లండనులో ప్రకటింపబడే "కలోనియల్ ఇన్ఫర్మేషన్ బులిటిన్" ఏమి ప్రకటించిందో చూడండి. ఇదొక్కటి చాలు బ్రిటిషు సైనికుల దురంతాల వెల్లడించడానికి. "ఒక మనిషిని సైనికులు తీసుకుపోయారు. అతని తలకు ముసుగు వేశారు. ఎక్కడో తెలియని ప్రదేశానికి తీసుకువెళ్ళి. అక్కడ అతని మర్మ అవయవాలను దారంతో కట్టి, తలొక వైపుకు లాగారు. దాదాపు చచ్చినంత పని అయింది. ఇపుడు ప్రమాదావస్థలో అక్రీ జైలులో నున్నాడు."

* Colonial Information Bulletin—15th Nov. 1938.

౧౦

పాలస్టయిన్ సమావేశం

ఒకవైపున నిర్బంధవిధానం అవలంబించుతూనే మరొకవైపు సమాధాన మార్గాలను అన్వేషించుతున్నట్లు నటించింది ప్రభుత్వం. అక్టోబరులో విప్లవకారుల విజృంభణ, ఇతర మహమ్మదీయ రాజ్యాలలోని సంచలనమూ, పీల్ కమీషన్ విభజన రద్దు అయేటట్లు గావించాయి. విప్లవకారుల చేతులలో ప్రాతజెరూసలం చిక్కి, బ్రిటిషువారిపై వాడిసల్పుతున్న సమయములోనే గ్రాండ్ ముఫ్టీ ఒక అల్టిమేటం అక్టోబరు 18 వ తేదీన ఇచ్చాడు. దాని సారాంశం ఇది.

1. పాలస్టయిన్‌కు యూదుల దిగుమతి ఆగిపోవాలి.

2. పాలస్టయిన్ అరబ్బులకు సంపూర్ణ స్వాతంత్ర్యము, జాతీయ ప్రభుత్వమును ప్రసాదించాలి.

3. బాల్ఫర్ డిక్లరేషలో ప్రకటించిన యూదులకు "నేషనల్ హోం" అనే అభిప్రాయాన్ని బ్రిటన్ విరమించుకోవాలి.

4. వెంటనే బ్రిటిషు మాండేట్ రద్దుకావాలి.

5. యూదులకు భూముల అమ్మకం ఆగాలి.


6. పాలస్టయిన్ అరబ్బులతో ఆంగ్లో-ఈజిప్టియన్, ఆంగ్లో-ఇరాకీ, ఫ్రెంచి-సిరియాన్, సంధులలాటి సంధిని చేసుకోవాలి. దానిలో అరబ్బుల సంపూర్ణ హక్కులతో నిండిన రాజ్యమూ, యూదులకు మైనారిటీ హక్కులూ ఉండాలి.

దానికి సమాధానం ఏమీలేదు. కాని పాలస్టయిన్‌లో "క్లీన్ అప్" (అంటే, వరుస పెట్టి విప్లవాన్ని 'తుడిచి వేయడం') జరిగింది. నవంబరు 9 వ తేదీన వుడ్ హెడ్ కమీషన్ రిపోర్టును ప్రకటిస్తూ విభజన మాను కొన్నామని తెలియజేసింది. ఇంకా ఇలాచెప్పింది. "పాలస్టయిన్‌లో అభివృద్ధికి యూదులకు, అరబ్బులకు సహకారం అవసరం. అందుకుగాను, పాలస్టయిన్. పొరుగుననున్న అరబ్బుస్టేట్‌ల నుంచియూ, జ్యూయిష్ ఏజన్సీనుంచియూ, ప్రతినిధుల పిలిపించి లండనులో సభసాగించుతాము."

లండనులో జరుగవలసిన రౌండుటేబిల్ సమావేశానికి (తర్వాత ఇది రౌండ్‌టేబిల్ సమావేశం కాలేదు) అరబ్బు రాజ్యాలయిన ఈజిప్టు, ఇరాక్, సౌదీ అరేబియా, యామన్, ట్రాన్స్‌జోర్డాన్‌లకు ప్రాతినిధ్యము ఇచ్చారు. కాని ఫ్రెంచి మాండేట్ క్రింద నున్న సిరియా, లెబనాన్‌లను పిలవలేదు. కారణం తమ ప్రభుత్వంతో సంబంధం లేనివని చెప్పినా నిజమయినకారణం అదికాదు. వీటిలోకూడ నేడు స్వాతంత్ర్యోద్యమం తీవ్రరూపం దాల్చించి. వీరి ప్రతినిధులురావడం గ్రాండ్‌ముఫ్టీ (తీవ్రవాదుల)ను బలపఱచుతుంది. అన్నిటికన్న ముఖ్యవిషయం, గ్రాండ్‌ముఫ్టీని - అరబ్బుల ఏకైకనాయకుని-పిలువలేదు. కాంగ్రెస్ లేని రౌండ్‌టేబిల్ సమావేశమెంతో ఇదీ అంతే. కాని మొదట ఇష్టపడక పోయినా, తర్వాత



మెషిన్ గన్లతో కాల్చుతున్న బ్రిటిష్ సైనికులు.



అరబ్బు ఖైదీలకు జైలు ద్వారం యూనియన్ జాక్‌గా కన్పించుతున్నదని ఒక బెర్లిన్ పత్రిక పరిహసించుతున్నది.

గ్రాండ్ ముఫ్తీ అనుచరులనైనా ఆహ్వానించక తప్పిందికాదు. గ్రాండ్ ముఫ్తీని ఆహ్వానించక పోవడాన్ని గురించి సామ్రాజ్యవాద మిత్రుడు అయిన ఫిల్బీ ఇలా అన్నాడు.

"నిజంగానే గ్రాండ్ ముఫ్తీ బ్రిటిషు ఆఫీసర్ల మరణానికి కారణమైన తుపాకులు ప్రేల్చాడనుకుందాం? అందువలన అతనిని పిలువకూడదా? ఇరాక్ స్వాతంత్ర్యానికై తిరుగుబాటులో మొదట తుపాకులను ప్రేల్చినది. నేటి ఇరాక్ ప్రధానమంత్రియే అన్నసంగతి జ్ఞాపకం చేస్తున్నాను ..." ఇంకా ముఫ్తీపార్టీవారిని ప్రతినిధులగా పిలవాలని తెలుపుతూ అతడిలా అన్నాడు, "వారు లండనుకు బాంబులు పట్టుకవస్తారని భయపడనక్కరలేదు. గతాన్ని గురించీ, భవిష్యత్తును గురించీ వారేమి చెబుతారో బ్రిటిషు ప్రభుత్వమూ బ్రిటిష్ ప్రజలూ వినాలి."

బ్రెయిల్సుఫర్డు మొదలైనవారుకూడా ముఫ్తీని ఆహ్వానించమని ఒత్తిడి తెచ్చారు. గ్రాండ్ ముఫ్తీ పార్టీ ప్రతినిధులను 8 గురిని అంగీకరించారు. ప్రవాసంలోనున్న వారిని విడుదలచేసి, రౌండు టేబిల్ సమావేశానికి వెళ్లే అవకాశాలు కల్గించారు, ముఫ్తీకిచ్చినంత ప్రాతినిధ్యం తనకూ కావాలని ఫకీరు నాషషాబీ ఆందోళన లేవదీశాడు. ఇతడు మితవాది. ఈ ఆందోళనకు బ్రిటిషు ప్రభుత్వ సహాయంకూడ ఉందని మనం వేరే అర్థం చేసికోవాలా? బ్రిటిషు ప్రభుత్వం వారి ప్రాతినిధ్యం అంగీకరించినందులకు అరబ్బులు 3 రోజులు సమ్మెచేసారు. లండనులో అరబ్బుల తరపున ఒకే ప్రాతినిధ్యం కావాలని బ్రిటిషు ప్రధాని కోరాడు. కొన్నాళ్లు వీలు కలుగలేదు. పాలస్తయిన్ ప్రథమ సమావేశానికి ఫకీర్ నాషషాబీ పార్టీ రాలేదు. తర్వాత అంగీకారం కుదరడంతో అరబ్బు డిఫెన్సుపార్టీతరపున ఇద్దరు ప్రతినిధులను ముఫ్తీపార్టీ అంగీకరించింది. రాగెబ్ నేషాషబీ ఫాత్రాజ్ (డిఫెన్సుపార్టీ ఉపాధ్యక్షుడు) అను

వారలు ప్రతినిధులు. కాని రాగెబ్ అస్వస్థతవలన కొన్నాళ్ళు పాల్గొనలేక పోయాడు సమావేశంలో.

అయితే ఈ సమావేశంలో ఇండియాకు ప్రాతినిధ్యం లేదు. ముస్లిముల తరపున జిన్నా ప్రాతినిధ్యం కోరాడు. బ్రిటిషు ప్రభుత్వం తిరస్కరించింది. అందుకని హిందూదేశమంతటా ఫిబ్రవరి 8 తేదీన పాలస్టయిన్ దినం జరుపబడింది.

ఫిబ్రవరి 7 వ తేదీన పాలస్టయిన్ సమావేశం ప్రారంభమయింది. మొదట అనుకొన్నట్లుగా రౌండు టేబిల్ సభ జరుగలేదు. యూదులతో కలసి కూర్చొనడానికి అరబ్బులు తిరస్కరించారు. విడి విడి సమావేశాలు జరిగాయి. బ్రిటిషు ప్రధాని ఛాంబర్లేను సభను ప్రారంభించాడు.

ఒకవైపున రాజభక్తిపరాయణులైన యూదులూ, మరొకప్రక్క రాజభక్తిపరాయణులైన అరబ్బులూ, కొద్దిమంది నిజమైన పాలస్టయిన్ ప్రజాప్రతినిధులతో గూడిన ఈ సమావేశ ఫలితాలు ఎలా ఉంటాయి? నిజంగా బ్రిటిషువారు అరబ్బు స్వాతంత్ర్యాన్ని ఇవ్వరని తెలుసు. కాని మితవాదులనుకూడా రౌండ్ టేబిల్ సమావేశం సంతృప్తి పఱచలేదు.

అరబ్బుల కోర్కెలను తెలియజేశారు అరబ్బులు, యూదులు యూదుల కోర్కెలను తెలియజేశారు. బ్రిటిషువారు వారిద్దరికీ అసంతృప్తికరమైన సూచనలు గావించారు. ఫలితం పాలస్టయిన్ సమావేశం భగ్నమయింది. ముఖ్యముగా అరబ్బుల తిరస్కారమే దీనికి కారణం. ఏమంటే యూదుల నాయకులెప్పుడూ రాజభక్తులే. నవంబరు 10 వ తేదీన "జియోనిస్టురివ్యూ" ఇలా వ్రాసింది.

"మేము ఎప్పుడూ (బ్రిటన్) తో సహకారం చేస్తాం. ఆశాభంగం కల్గినా, భ్రమలేకుండా తిరస్కరం చూపినా. మేము భక్తిపూర్వంగా సహకారం చేస్తాం" కాబట్టి వారి తిరస్కారం అంత గమనించ దగిందికాదు. మొత్తంమీద పాలస్టయిన్ సమావేశం వలన లాభనష్టాలు ఎలా ఉన్నా ఈ విషయాలు తెలిసాయి.

1. బ్రిటిషు ప్రభుత్వం మొట్టమొదటిసారి 'నేషనల్ హోం' అంటే, యూదుల రాజ్యమనిగానీ, కామన్ వెల్తు అనిగాని కాదని తెల్పింది. (2) స్వాతంత్ర్యం పాలస్టయిన్ ప్రజల జన్మహక్కు అని గుర్తించింది అంటే చాల రోజులు బ్రిటిషు ప్రభుత్వం ఇక్కడ ఉండదన్నమాట. ఇవన్నీ ఒప్పుకొనికూడా అసలు స్వాతంత్ర్యం ఈయనిరాకరించింది. అరబ్బుల కోర్కెలేమిటో చూద్దాం. పాలస్టయిన్ సమావేశంలో వారీక్రింది విషయం స్పష్టంజేశారు.

"అరబ్బులకు, బ్రిటిషువారిపైగాని, ఇతరులపైగాని ద్వేషంలేదు. 1915 లో వాగ్దానం గావించబడిన స్వాతంత్రానికే వారు పోరాడుతున్నారు. బాల్ఫర్ డిక్లరేషన్ వారు గుర్తించరు. యూదుల కష్టాలను, నాగరిక ప్రపంచమంతా గుర్తించుచున్నది. కాని యూదులకు పాలస్టయిన్ కాదు స్థలం, ఇంకొకటి చూడాలి. కాబట్టి మాండేటు రద్దుచేసి, అరబ్బు రాజ్యం ఏర్పరచి. యూదుల దిగుమతిని, భూముల అమ్మకాన్ని ఆపాలి."

ఇక యూదుల తెల్పినవిషయాలు చూద్దాం.

"యూదులు ఎవరిపైనా అధికారం చలాయించ దలచుకోలేదు. పాలస్టయిన్‌లో శాంతిని ఏర్పర్చకముందే, పాలస్టయిన్ సమావేశం జరపడం విచారకరం. ఇప్పటికే దేశంలో మూడవ వంతు యూదు లున్నారు. ఆర్థిక, విజ్ఞాన విషయంలో యూదులది మూడింట రెండుపాళ్ళు. ప్రతియుగంలో యూదులు పాలస్టయిన్‌కు వెళ్ళుతూనే ఉన్నారు. గత 60 ఏండ్ల నుండీ పాలస్టయిన్‌లో నివసింపసాగారు. 20 ఏండ్ల అనంతరం మాండే

టుకు ప్రభుత్వం మరొక అర్థం చెప్పడం యూదులు తెలుసుకోలేకుండా ఉన్నారు. కేవలం ఒక భాగంగాని, అనుబంధంగా గాని గాక తమ ఆశ యాలకు యజమానులుగా నుండాలి. అందులకు యూదులకు ప్రపంచంలో ఒక ప్రదేశం ఉండాలి. పాలస్టయిన్ అరబ్బులకు పవిత్ర ప్రదేశమయినా డెమాస్కస్‌లాగా జాతీయ కేంద్రంగాదు. మాక్ మహన్ ఉత్తర ప్రత్యుత్త రాలలో అరబ్బులకు స్వాతంత్రమని ప్రకటించారు. కాని పాలస్టయిన్ అం దులో లేదు. ఆ ప్రకటన ప్రకారం నేడు సాది అరేబియా ఇరాక్, యెమెన్, సిరియా, ట్రాన్స్ జోర్డన్‌లకు స్వాతంత్ర్యం ఉంది." ఇదీ యూ దుల వాదన. యూదుల ఈ వాదనకు సమాధానం వేరే ఈయనక్కరలేదు. వెనుకటి ప్రకరణాలలో సమాధానం రానేవచ్చింది. కాని చివరి వాక్యానికి జవాబు చెప్పాలి. పై అరబ్బు రాజ్యాల కిచ్చిన స్వాతంత్ర్యం సంపూర్ణ స్వాతంత్ర్యం కాదు. బ్రిటన్‌మీద ఆధారపడే స్వాతంత్ర్యం. ఇక సిరియా సంగతి 1940 లో సిరియాకు సంపూర్ణ స్వాతంత్ర్య మిస్తామని ఫ్రెంచి పాప్యులర్ ఫ్రంటు ప్రభుత్వం వాగ్దానం చేసింది. కాని ఫేసిస్టు మిత్రుడయిన దలదీర్ ప్రభుత్వం దానిని నిరాకరించింది. అందు వలనసిరియా ప్రభుత్వం రాజీనామా నిచ్చింది. సిరియా స్వాతంత్రోద్యమం పాలస్టయిన్‌లాగానే అణచబడుతూ ఉంది. ఇక అరబ్బురాజ్యాలకు నిజమైన స్వాతంత్ర్య మెక్కడ?

బ్రిటిషు ప్రభుత్వం వీరిద్దరి సూచనలనుగాక తన సూచనను తెలియ జేసింది. దానివలన రెండు మూడు కాంటన్ (స్వపరిపాలన గల భాగం అనవచ్చు.) లుగా పాలస్టయిన్‌ని విభజింపుతారు. జనాభా ననుసరించి శాసనసభలు ఏర్పాటుచేస్తారు. ఆ శాసనసభలలో ఒకటి పై శాసనసభ, రెండు క్రింది శాసనసభ (అంటే మన కౌన్సిల్, అసెంబ్లీల

మాదిరి.) క్రింది సభలలో మెజారిటీ ఓటింగునుబట్టి మాత్రం తీర్మా నం పాసవుతుంది. పై సభలో యూదులు, అరబ్బులు వేర్వేరుగా ఓటి య్యాలి. ఏదైనా తగాదావస్తే, హై కమీషనర్ పై అధికారి. అంతేగాదు. బ్రిటన్‌తో సంబంధంలేని సంపూర్ణ స్వాతంత్ర్యం కాదు. బ్రిటన్ క్రింద 'కాలనీ'గా ఉంటుంది, మాండేటరీ ప్రభుత్వం అంతరించేలోగా పై సూచ నలు గల ప్రభుత్వం సాగాలి. కనీసం 10 ఏండ్లవరకైనా మాండేటు రద్దు కాదట. ఆ తర్వాత అరబ్బులూ, యూదులు స్నేహంగా ఉంటే స్వరాజ్యం ప్రసాదించుతారట. ఈవిషయాలను ఆలోచించడానికి మరొక రౌండుటేబిల్ సమావేశం కావాలట.

ఇలాగే, యూదుల దిగుమతిని గురించి, భూముల అమ్మకాన్ని గురించి మరికొన్ని సూచనలు గావించారు. ఆసూచనలను అరబ్బులు తిరస్కరించుతూ ఇచ్చిన జవాబువలన, ఆ సూచనలేమిటో గూడ తెలు స్తాయి. అరబ్బు ప్రతినిధుల ప్రకటన సారాంశం ఇది.

(1) పాలస్టయిన్ కాన్ఫరెన్సులో బ్రిటిషు ప్రభుత్వప్రతినిధులు 1939 మార్చి 15 వ తేదిన గావించిన సూచనలు జాగ్రత్తగా పరిశీలించాం.

(2) ప్రభుత్వ సూచనలు.

(ఎ) చట్టంలో మార్పులు.

(బి) యూదుల దిగుమతి.

(సి). భూముల అమ్మకం.

(3) మొదటిదానికి ప్రభుత్వం పాలస్టయిన్ స్వతంత్రానికి కొంత కాలం (మధ్య) కావాలంటున్నది. దానికి ప్రజలసహకారం పైన ఆధార పడుతుందట. (4) కాని ఎంతకాలమో తెల్పలేదు. ఖచ్చితంగా కాలపరిమితి

తెలియజేయాలి. (5) మైనారిటీగా నున్నవారు నిరోధించుతూ అల్లరిచేయ వచ్చు. దానివల్ల పై కాలపరిమితికి అంతు ఉండదు."

ఇక యూదుల దిగుమతి, భూముల అమ్మకాన్ని గురించిన బ్రిటిషు సూచనలకు అరబ్బు ప్రతినిధు లిలాచెప్పారు.

1. ప్రభుత్వం ఎలాగైతేనేం చిట్టచివరకు యూదుల దిగుమతి ఆపాలని గుర్తించినందులకు సంతోషం. *

కాని మా అభిప్రాయం ఇంతకంటె యూదులను ఇక భరించలేము.

2. భూముల్ని గురించి ప్రభుత్వసూచనలు "భూమి కబళు"ను ఆపవు.* *

వుడ్‌హెడ్ రిపోర్టుప్రకారం కుటుంబానికి 111 "డ్యూనంలు" (డ్యూనం అంటే సుమారు ఎకరంలో నాల్గవవంతు) భూమి కావాలి. కాని 54 డ్యూనంల భూమి మాత్రం ఉన్నది.

3. భూమి అమ్మకం పూర్తిగా ఆపాలి. యూదుల చేతులలో ఉపయోగింపని భూమి చాలా ఉంది. అది యూదులకు సరిపోతుంది. అరబ్బులకు ప్రస్తుత భూమిచాలదు.

4. ప్రభుత్వ సమాధాన ప్రయత్నానికి సంతసించుతూ అరబ్బులు, "అన్ని పవిత్రస్థలాలకు, మైనారిటీ హక్కులకు, న్యాయమయిన బ్రిటిషు

---

* బ్రిటన్ సూచన ఇది. ఇపుడు వెంటనే 25 వేలమందిని. 5 ఏండ్లలో ప్రతియేటా 10 వేల చొప్పున 50 వేలను మొత్తం 75 వేల యూదులను రానీయాలి. అప్పటికి మూడవవంతు ఉంటారట. తర్వాత ఆపివేస్తారట. అరబ్బులు ఇప్పుడే అంత మంది ఉన్నారని అంటున్నారు.

** ప్రభుత్వ సూచనలివి. 3 భాగాలుగా భూమిని చేయడం (1) ఒక దానిలో పూర్తిగా భూముల్ని అమ్మకూడదు. (2) జాగ్రత్తగా పరిశీలించి అమ్మడం (3) పూర్తిగా అమ్ముకొనేందుకు స్వేచ్ఛ.

హక్కులకూ పూచీ ఇస్తాం. భూముల కబళువలన. యూదుల దిగుమతివలన, స్వాతంత్ర్య నిరాకరణవలన ఏర్పడిన నేటి పరిస్థితులను త్వరలో అంతమొందించడానికి, మేము కూడా ఆతురతతో ఉన్నాం." అని జవాబిచ్చారు.

అరబ్బుల ఈసమాధానంతో పాలస్టయిన్ సమావేశంభగ్నమయింది; భగ్నమవడంలో ఆశ్చర్యం ఏముంది?

బ్రిటిషు ప్రభుత్వంవారు స్వాతంత్ర్యం ఇవ్వడానికి 10 ఏండ్లదాకా కొన్ని ప్రయత్నాలు చేస్తారట. (అలాంటి ప్రయత్నాలు మన దేశంలో మనం చూస్తూనే ఉన్నాం.) చిట్టచివరకు అరబ్బు హైకమీషనరు (మనకు వైస్రాయిలాంటివాడు.) ఈ పెద్ద పిల్లకాయలు (అరబ్బులు-యూదులు) సరిగా ప్రవర్తిస్తే సూచిస్తాడు బాధ్యతాయుత ప్రభుత్వం ఇవ్వవచ్చునా లేదాఅని పదేండ్ల అనంతరం. ఒకలండను విలేఖరి చెప్పినట్లు అరబ్బులు, యూదులు ఒకరినొకరు కౌగలించుకొని ముద్దిడుకుంటే, "మాండేట్‌ను రద్దుచేసే అవకాశాల" గురించి ఆలోచిస్తారట!

పాలస్టయిన్ సమావేశం భగ్నమయింది. కాబట్టి మనపై ఫెడరేషన్ రుద్దినట్లే, రానున్న ప్రపంచ సంగ్రామంలో తమ స్థితిని మరింత భద్రపరుచుకోడానికి బ్రిటిషు ప్రభుత్వం ఒక శాసనాన్ని రుద్దవచ్చు. దానివల్ల స్వరాజ్యం కల్ల. ఫెడరేషనులో మనకెంత స్వరాజ్యంవస్తుందో, బ్రిటను విధించే పాలస్టయిన్ శాసనంవల్ల కూడా అంతే వస్తుంది. రౌండుటేబిల్ (పాలస్టయిన్) సమావేశం భగ్నమవుతుందని ప్రతివారూ అనుకొన్నారు. నెహూ్రి పండితుడు గత డిశంబరు 17 వ తేదీన ఇలా అన్నాడు.

"మనకు రౌండుటేబిల్ కాన్ఫరెన్సుల సంగతి తెలుసు. అవి అసలు సమస్యలను ఎలా పెడమార్గాలను పట్టించి, పవిత్ర వాక్యాల ముసుగు వెనుక సామ్రాజ్య నిరంకుశాధికారం ఎలా బలపరుచేది మనకు తెలుసు."

౧౧

తుదిమాట

"సమాధాన మార్గాలను అన్వేషించుతున్నట్లు నటించడమూ, నటించి శత్రువుల బలహీనపరచడమూ బ్రిటిషు రాజనీతి అని వేరొకచోట చెప్పాం. హిందూస్థాన్ స్టాండర్డు ప్రత్యేక విలేఖరి లండను నుండి మార్చి 25 వ తేదీన ఏమి వ్రాస్తున్నాడో చూడండి!

"పాలస్టయిన్ ప్రతినిధులు వెళ్ళిపోయారు. కాని ఒక్కరూ పాలస్టయిన్‌కు వెళ్ళలేదు. వెళ్ళగూడదు. సిరియా, లెబనాన్‌లలో కూడ "క్లీన్ అప్" (విప్లవాన్ని తుడిచివేయడం) సాగుతున్నది. పాలస్టయిన్ ప్రవాస వీరులు కూడా అరెస్టు చేయబడ్డారు. సిరియాలోని పాలస్టయిన్ డిఫెన్సుకమిటీ రద్దు చేయబడింది. దాని నాయకులను కూడ అరెస్టుచేశారని బ్రిటిషు యునైటెడ్ ప్రెస్ వార్త. గ్రాండ్ ముఫ్తీకి సకాలం కబురు తెలిసినందువల్ల, బీరట్ సమీపంలోని జునియానుండి అదృశ్యమయాడు. సౌది అరేబియాకు పోయాడని ఊహించబడుతుంది. టర్కీ-సిరియన్ సరిహద్దును గ్రాండ్ ముఫ్తీ

దాటాడో లేదో? లేక దాటుతున్నపుడు అరెస్టు చేయబడి ఇపుడు జైలులో ఉన్నాడేమో? అన్నిటికన్న అవినీతికరమగు కార్యమేమంటే. మాగ్డనాల్డ్ హైఫావద్ద నౌకలపైన, ప్రతినిధులను అరెస్టు చేయతావని ఒక రికమెండేషన్ ఉత్తరం వ్రాశాడు. అయినా అరెస్టులు సాగాయి. కొన్నిచోట్ల ఫ్రెంచివారి ఈ నిర్బంధ విధానం, బ్రిటన్ పాలస్టయిన్‌కు ప్రసాదించబోయే రాజ్యాంగశాసనపు వైఖరిని తెలియజేస్తుందని అంటున్నారు."

ఈ అమానుష అవినీతి నవలంబించు సామ్రాజ్యవాదాన్నుండి పాలస్టయిన్ బయల్పడుతుందా? పాలస్టయిన్ సమస్యా పరిష్కారం సులభమేనా? అన్న ప్రశ్నవస్తుంది. దానికి పాలస్టయిన్‌యెడ వివిధశక్తు లవలంబించుతున్న విధానం చూడాలి.

ఫేసిజం, అబిసీనియా. ఆస్ట్రియా. జకోస్లోవేకియా. స్పైన్. మెమెల్, ఆల్బేనియాలను మ్రింగింది. ప్రాచ్యఖండంలో చైనాను మ్రింగ చూస్తూన్నది. ఇలాంటి సామ్రాజ్యతృష్ణగల ఫేసిజం. బ్రిటిషు ఫ్రెంచి సామ్రాజ్యాల క్రింద అణచబడిన పీడిత ప్రజలను తమవలలో వేసుకోడానికి ప్రయత్నిస్తున్నది. పాలస్టయిన్ ప్రాముఖ్యతను గురించి మళ్లా చెప్పనక్కర్లేదు "ఇక్కడ అరబ్బు స్వాతంత్ర్యోద్యమము తీవ్రంగా ఉంది. నిర్బంధవిధానం తీవ్రంగా ఉంది. కాబట్టి ఇక్కడ ఫేసిస్టు విత్తనాలు నాటడం సులభం" అని 1935 నుండి ఇటలీ జర్మనులు ఫేసిస్టు ప్రచారానికి పూనుకొన్నాయి.

యూదులు చెప్పినంతగాక పోయినా. కొంత సహాయం విప్లకారులకు ఫేసిస్టుల నుండి వచ్చింది. 'బారి' రేడియోద్వారా ముస్సోలినీ తాను ఇస్లాం సంరక్షకుడనని ప్రచారం చేసుకోసాగాడు. ఆంగ్లో ఇటాలియన్ సంధితో ఈ ప్రచారం కొంత తగ్గినా, ఇప్పటి వైమనస్యం మళ్లా

ప్రోత్సాహానికి దారితీయవచ్చు. ఇథోపియాలో గొప్ప ఇస్లామిక్ ఫేసిస్టు యూనివర్సిటీని నియమించుచున్నాడని ఆమధ్య వదంతులు పుట్టాయి. ఇరాక్, హెడ్జాజ్, యెమెన్‌లలో ఫాసిస్టు పలుకుబడి కొంత ఎక్కువగా ఉంది. కాని పాలస్టయిన్‌లో కొద్దిమంది భూస్వాములూ, పెట్టుబడిదార్ల లోనే ఉన్నది. కొంతమంది-బ్రెయిల్సు ఫర్దులాంటివారు సైతం, విప్లవ కారులుపయోగించే డైనమిట్లు మొదలైనవి జర్మనుల సహాయం లేనిదే, అంత చాకచాక్యంగా ఉపయోగింపబడవనీ, ఒకరిద్దరు జర్మనీ వారక్కడ ఉండి సహాయం చేస్తున్నారనీ నమ్ముతున్నారు. దానికి ఆధారంగా ఈమధ్య బ్రిటను దురంతాలనుండి తమ్ము రక్షించమని హిట్లర్‌ను, పాలస్టయిన్ విద్యార్థులు వేడుకొనడంకూడా ఈ వదంతికి సహాయ పడుతుంది.

కాని ఫేసిస్టుల పరిపాలన అబిసినియాలోనూ, ముఖ్యంగా ముస్లిం దేశమగు అరేబియాలోను ముస్లింలు చూచారు. బాగ్దాద్‌లోని 'అహాలి' అను పత్రిక ఇటాలియన్ ఘాతుక కృత్యాలను వర్ణించుతూ ఇలా వ్రాసింది. "సామ్రాజ్యవాదాన్ని ముఖ్యంగా ఫేసిజాన్ని ఎదుర్కొనడానికి ఒక సంయుక్త ప్రతిఘటన ఏర్పరచుట అరబ్బుల కోరిక." ముసోలినీ పద్ధతులు "కుట్రతో కూడినవి. పరిహాసాస్పదమైనవి." అని అన్నది. మొన్న అల్బేనియా ఆక్రమణతో ఫేసిస్టుల స్వార్థకాంక్ష ఏమిటో ముస్లిం లోకానికి తెలిసింది. "దేవుడొక్కడే. అతనికి శత్రువు ముసోలినీ" అని అనాలసి వచ్చింది "ఇస్లాం సంరక్షకు"డైన ముసోలినీని.

ఇక ముస్లింప్రపంచంలోకూడ తగిన ఆందోళనలేకెత్తింది పాలస్టయిన్‌కు బ్రిటన్‌కు "మిత్రులైన" అరబ్బు రాజ్యాలవారే ఆందోళన చేయసాగారు. క్రిందటి అక్టోబరులో కైరోలోజరిగిన "ముస్లిం ఇంటర్ పార్లమెంటరీ కాంగ్రెసు"కు 8 దేశాలనుండి వచ్చినప్రతినిధులు బ్రిటన్ సమాధాన మార్గాలను

అరయాలని వ్రాసింది. ఇక మనదేశంలో స్వాతంత్ర్య పోరాటాన్ని భగ్నం చేస్తూ బ్రిటన్‌కు తాళంవేసే జిన్నా ప్రభృతులు పాలస్టయిన్ సమావేశానికి తమకూ ప్రాతినిధ్యం కావాలన్నారు. తిరస్కరించింది బ్రిటిషుప్రభుత్వం. దేశంలో అనేక ముస్లింసభలు బ్రిటిషుప్రభుత్వాన్ని ఖండించాయి. ముస్లింలీగ్ తరఫున ఇద్దరు ప్రతినిధులు వెళ్ళి బ్రిటిషుప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తమ అభిప్రాయాన్ని తెలియచేశారు. కీ॥ శే॥ షౌకతాలీ సైతం అక్టోబరు 12 వ తేదీన ఇలా అన్నాడు. "ముస్లిం ప్రజల భావాలను నొచ్చింపజేస్తే ముస్లిం ప్రపంచమంతా, తిరుగబడుతుంది." నేడు హిందూదేశంలో ముస్లిములు (ప్రజాసామాన్యంమాట కాదు; నాయకులమాట) తమ దేశస్వాతంత్ర్యం మాట తలపోయడం లేదు. పోరాడటం లేదు. కాని, తమ సోదరులకోసం, పాలస్టయిన్ మహమ్మదీయులకోసం పోరాడుతామని చెప్పడం హాస్యాస్పదంగానే ఉంటుంది. నిజంగా ముస్లిం నాయకులు తమ సోదర ముస్లిములయెడ ప్రేమవుంటే, వారి శత్రువులయెడ శత్రుత్వం వహించాలి. పాలస్టయిన్ శత్రువగు బ్రిటిషు సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించడానికే, వారు ప్రయత్నించాలి. అలా ప్రయత్నిస్తున్న సామ్రాజ్య వ్యతిరేక శక్తులతో-ముఖ్యంగా కాంగ్రెసుతో చేతులు కలపాలి. అలా కలుస్తారా? లేక వైట్‌హాల్ చుట్టూ తిరిగి పాలస్టయిన్ సమస్య పరిష్కరింప చూస్తారా?

ఇక కాంగ్రెసు వైఖరిచూద్దాం. నేడు కాంగ్రెసు, సామ్రాజ్యవాదానికీ, ఫేసీజానికీ ప్రబలవిరోధి. పీడిత దేశాలయెడను, పీడితప్రజల యెడను సహకారం చూపుతుంది. అందుకనే తమలాగానే సామ్రాజ్యవాదం క్రింద నల్గిపోతున్న పాలస్టయిన్ సోదరులయెడ సానుభూతి ప్రకటించుతూ, జాతీయ కాంగ్రెసు, ఫైజపూర్, హరిపూర్, త్రిపురీ కాంగ్రెసులు తీర్మా

నించాయి. నెహూౄపండితుడు మిత్రులద్వారా తెలిసికొన్న అచటి యదార్థ పరిస్థితులను అపుడపుడూ తెలియజేసాడు. నెహూౄలాగా అంతర్జాతీయ పరిస్థితులలో ఆస్టేజోక్యం కలుకజేసుకోని మహాత్ముడుకూడ. అరబ్బుల హింసాతత్వంతో ఏకీభవించక పోయినా, "బ్రిటిషువారికి బ్రిటన్ ఎలాంటి జన్మహక్కో. అరబ్బులకు పాలస్టయిన్ అలాంటి జన్మహక్కు" అని అన్నాడు.

కాబట్టి మనకర్తవ్యం సుస్పష్టమే. మన పోరాటం, పాలస్టయిన్ పోరాటాన్ని బలపరుస్తుంది. యుద్ధచ్ఛాయలు ప్రపంచమంతా వ్యాపిస్తున్నాయి. రేపు యుద్ధమేవస్తే, పాలస్టయిను వలెనే మనమూ స్వాతంత్ర్యం సంపాదించుకోవాలి.

పాలస్టయిన్‌కు స్వాతంత్ర్యంవస్తే యూదుల గతేమిటి? ఫాసిస్టుల రాక్షసకృత్యాలకు గురి అయ్యే యూదులను అలావదలి వేయవలసిందేనా అన్న ప్రశ్నవస్తుంది. దానికి పాలస్టయిన్‌లోని వివిధవర్గాలను గురించి తెలుసుకోవాలి.

మొదటిది పెద్దభూస్వాములు, వర్తకులు. జాతీయనినాదాలు పల్కుతూనే ఇది సామ్రాజ్యవాదాన్ని సపోర్టుచేస్తున్నది. ఉదాహరణకు నాషషిబీ సోదరుడు ఫక్రీబేష షాబీ నేడు బ్రిటిషుప్రభుత్వ సూచనలను బలపరుస్తున్నాడు. రాగె బెబేనా షషిబీ విప్లవకారుల భయంవల్ల పైకి తీవ్రంగా మాటాడతాడు. (ఈజిప్టు పారిపోయాడు విప్లవకారుల భయంవల్ల, ప్రభుత్వం రౌండ్‌టేబిలు సభకు డిఫెన్సుపార్టీ తరఫున ప్రతినిధిగా ఎన్నుకొంది. విప్లవకారుల భయంవల్ల, వుడ్‌హెడ్ కమీషన్‌కు సాక్ష్యమిస్తూ విభజన వలదన్నాడు.)

రెండవది :— మధ్యతరగతి. అరబ్బు ప్రజలలో ఎక్కువ శక్తియుతమైనది. చిన్న దుకాణదార్లు, గవర్నమెంటు ఉద్యోగస్థులు, వివిధ వృత్తులలో నిమగ్నులయినవారూ, సెకండరీస్కూలు మొదలుకొని యూనివర్సిటీ విద్యవరకు చదువుకొన్న 'విద్యాధికులు'. వీరు సామ్రాజ్యవాదమునకు ప్రబల విరోధులు. కారణం ఉద్యోగాలు సరిగా వుండవు. జీతాలు తక్కువ స్వాతంత్ర్యం సున్న. వీరిలో ఎక్కువమంది యువకులు. వారికి కేపటలిస్టు దృక్పథమున్నా, సామ్రాజ్యవాదం అంటె మంట.

మూడవది ;— రైతులు, పట్టణకార్మికులు. వారిలో చైతన్యం గలవారు రాజీలకిష్టపడని సామ్రాజ్యవిరోధులు. చైతన్యం తక్కువ గలవారు బ్రిటిషువారికంటె యూదులే ఎక్కువ శత్రువులని భావించుతారు. దానికి కారణం జాతిద్వేషంకాదు. మత ద్వేషమూకాదు. యూదులు తమ దేశంలో ప్రవేశించడవలననే తమ భూములుపోయాయని, తాము కూలీలయ్యామని, తమకు యూదుకూలీలమూలకంగా తగినకూలి రావడంలేదని భావించుతారు.

ఇక యూదుల సంగతి :— ఒక భాగం సామ్రాజ్యవాదాన్ని బహిరంగంగా సపోర్టు చేస్తారు. వారు పండ్లతోటల యజమానులు, పరిశ్రమాధికారులు, బ్యాంకర్లు. వీరికి అరబ్బు కేపిటలిస్టు (ధనాఢ్యుల) ల పోటీనుండి అరబ్బు ప్రజాసామాన్యం నుండీ, ఆర్థికక్షోభ వచ్చినపుడు యూదు కార్మికుల నుండీ (తిరగబడకుండా) కాపాడేది బ్రిటిషు ప్రభుత్వం అని వీరి భావన.

ఇక యూదుకార్మికుల సంగతి. వారు యూదు కార్మిక నాయకుల చేతులలో ఉన్నారు. నాయకులు మితవాదులు సామ్రాజ్య వాదాన్ని సమర్థిస్తారు. వర్గ కలహదృష్టిని మరల్చి, అరబ్బులు అడవి మనుష్యులనీ, సామ్రాజ్యవాదం లేకపోతే, అరబ్బు కార్మికులనుండి వారికి అపాయం

కల్గుతుందనీ ఒకభయం కల్గించారు. మతావేశంకూడ ఎక్కువ ఎక్కించారు.

ఇక మరోభాగం ఉన్నది. వారు కమ్యూనిష్టులు. మనదేశంలో వలెనే పాలస్టయిన్‌లో కమ్యూనిస్టుపార్టీ నిషేధించబడింది. వీరిలో ఎక్కువ మంది మేధావులు, తీవ్రవాదులు. కమ్యూనిస్టుల అభిప్రాయంలో 'జియోనిజం' సామ్రాజ్యవాదపు బంటు అని తలుస్తారు. అరబ్బుల జాతీయ స్వాతంత్ర్యమే సోషలిజానికి మొట్టమొదటి మెట్టని భావిస్తారు. అందుకని ఆ ఉద్యమానికి సహాయం చేస్తున్నాడు,

కాబట్టి యూదుసమస్యకు పరిష్కారం ఏమిటి? సామ్రాజ్యవాదంతో పూర్తిగా విడిపోయిన "ప్రజాస్వామ్య, స్వాతంత్ర్య, సంయుక్త "పాలస్టయిన్"లోనే అరబ్బులు, యూదులు తమతమ సమస్యలను సుహృద్భావంతో పరిష్కరించుకో గలరు. సామ్రాజ్యవాదంతో సహకారం ఉంచుట వల్లనే యూదులంటే భయపడుతున్నారు. నిజంగా నేడు జర్మనీ రాక్షసకృత్యాల ఫలితంగా కూడు గుడ్డలులేక అల్లాడుతూ ఉండే యూదులెందరో ఉన్నారు. అలాంటి వారిని పాలస్టయిన్‌కు రానీయడం న్యాయమే. కాని అలా రావడానికి తాహతు కావాలిగదా? ఉన్నది. పాచ్యసమీప ప్రాంతాలలో యూదులను ఇంకా చేర్చుకోవచ్చు. కాని అందులకు అరబ్బులలో విశ్వాసం కలగాలి. విశ్వాసం ఎలా కల్గుతుంది? యూదు జనసామాన్యం తమ నాయకుల మోసాన్ని గ్రహించి, అరబ్బు సోదరులతో గలిసి, బ్రిటిషు సామ్రాజ్యంతో పోరాడుటవల్లనే.

ఇంతేగాదు. యూదుల సమస్య బాగా పరిష్కారం కావాలంటే, పాలస్టయిన్‌లో నేటి ఆర్థిక విధానం పనికిరాదు. పాలస్టయిన్‌లో సోష

లిజం స్థాపించబడితేనే. అరబ్బయినా. యూదయినా, అందరికీ తిండి, గుడ్డ లభిస్తుంది.

"పాలస్టయిన్ భవిష్యత్తు నేడు ప్రపంచ భవిష్యత్తుమీద ఆధారపడి ఉంది. నేడు ప్రపంచాన్ని ఒక ప్రశ్న బాధించుతున్నది. అది సోషలిజం, వర్గరాహిత్య సంఘం ఏర్పడుటా లేక అంధకారంలో ఊహా స్వప్నాలలో కొట్టుకులాడు హె.జి. వెల్సు తరుచు చెప్పుచున్నట్లు దాని వినాశనమా?" *

* The Jewish Question – George Sacks.

పా ల స యి న్

END OF TITLE